అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
బుధవారం 2-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 215 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

పేదలపై దోపిడీ ఆపండి

సబ్సిడీ సిలిండర్ల ధర పెంపుపై పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళన

- రాజ్యసభలో కార్యకలాపాల అడ్డగింత..పలుమార్లు సభ వాయిదా
- ప్రజలపై భారాలు మోపడం ఖండిస్తున్నాం : సీతారాం ఏచూరి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

గృహవినియోగదారుల సబ్సిడీ సిలిండర్లపై ప్రతి నెల రూ. 4 పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, మరోవైపు ప్రధాని పిలుపుమేరకు కోట్లాది మంది సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవడం జరిగిందని...ఈ సమయంలో ప్రభుత్వం పేదలపై భారాలు మోపడం సరికాదంటూ ఆందోళనకు దిగాయి. కేంద్ర సర్కారు నిర్ణయాన్ని విరమించుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. 'పేదలను దోపిడీ చేయడం ఆపండి' అంటూ పెద్దపెట్టున నినదించాయి. కాంగ్రెస్, సీపీఐ(ఎం), ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ సభ్యులు సభా కార్యకలాపాలు అడ్డుకోవడంతో రాజ్యసభ పలుమార్లు వాయిదా పడింది. మంగళవారం ఉదయం రాజ్యసభలో ఈ అంశాన్ని తృణమూల్ ఎంపీ దేరిక్ ఒబ్రెయిన్ లేవనెత్తారు. సబ్సిడీ ధరలకు వంటగ్యాస్ అందించే సామాజిక బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తించడం లేదని ఆరోపించారు. 'అంతర్జాతీయంగా చమురు ధర 111 డాలర్ల నుంచి 48 డాలర్లకు పడిపోయింది. కానీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచుతోంది. ఎన్నికల సమయంలో ...9లో



ప్రఖ్యాత శాస్త్రవేత్త పీఎం భార్గవ కన్నుమూత

సీసీఎంబీ స్థాపనలో క్రియాశీలక పాత్ర

- మూఢనమ్మకాలను వ్యతిరేకించిన మేధావి
- రాజస్థాన్‌లో జననం... హైదరాబాద్‌లో స్థిరనివాసం...పలువురి సంతాపం

వివరాలు 9లో



జడ్జి సత్యాగ్రహం


- మధ్యప్రదేశ్‌లోని హైకోర్టు ఎదుట నిరసన
- న్యాయశాఖలో సంస్కరణలు తేవాలని డిమాండ్

భోపాల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనం రోడ్లపై ధర్నా..నిరసనలు చేయటం చూస్తుంటాం. కేసుల్లో వాదనలు విని తీర్పు చెప్పాల్సిన న్యాయమూర్తికే వచ్చిన కష్టమేంటీ..? ఎందుకు ఆందోళనబాట పట్టారు.? బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో ఆ న్యాయమూర్తి ఉద్యమించాల్సిన అవసరం ఏమొచ్చింది? వివరాలిలా.. అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా పని చేస్తున్న ఆర్‌కె ...9లో

జీఎస్టీ దెబ్బకు ఉత్పత్తి ఢమాల్

ఎనిమిదిన్నరేండ్ల కనిష్టానికి పడిపోయిన సూచీ

పెద్దనోట్లరద్దు ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తయారీ రంగంపై వస్తు,సేవల పన్ను(జీఎస్టీ) మరోసారి గట్టి దెబ్బతీసింది. జులై నెలలో కొనుగోలుదారు మేనేజర్ల సూచి(పీఎంఐ) ఒక్కసారిగా పడిపోయింది(జులై 1 నుంచి జీఎస్‌టీ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే). ఈ ఏడాది జూన్‌లో పీఎంఐ 50.9 పాయింట్లుండగా, జులైలో 47.9కి పడిపోయింది. ఎనిమిదిన్నరేండ్లలో ఇదే అత్యంత కనిష్ఠస్థాయి. 2009 ఫిబ్రవరి నుంచి పెద్ద నోట్ల రద్దు సందర్భంగా డిసెంబర్‌లో క్షీణించిన పీఎంఐ ఈసారి జీఎస్టీ ప్రతికూల ప్రభావంతో అంతకన్నా కిందికి జారిపోయింది. నిక్కీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ సర్వేలో ఇది వెల్లడైంది.



- జులైలో పీఎంఐ 47.9గా నమోదు : నిక్కీ ఇండియా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: తయారీరంగంలో ఎగుడు,దిగుడు పరిస్థితులను పీఎంఐ సూచిస్తుంది. ఈ రంగంలోని కంపెనీలకు కొత్తగా వచ్చే ఆర్డర్లు,నూతన ఆవిష్కరణలు, ఉత్పత్తి, సరఫరా-పంపిణీ, ఉద్యోగ వాతావరణం అనే ఐదు అంశాలను పరిగణనలోకి తీసుకొని సూచీని లెక్క వేస్తారు.



జులైలో కొత్త ఆర్డర్లు, సరఫరా బాగా తగ్గిపోయాయి. దాంతో,వస్తూత్పత్తి కోసం అవసరమైన ముడి సరుకు, పాక్షికంగా పూర్తి చేసిన వస్తువులు లేదా విడి భాగాల కొనుగోలును కంపెనీలు తగ్గించుకున్నాయి. ఈ కారణంగా మధ్యస్థాయి వస్తు తయారీదారులు కూడా తీవ్రంగా నష్టపోయారు. దీంతో, జులై నెలలో తయారీరంగపు పీఎంఐ కనిష్టానికి దిగజారింది. జీఎస్టీ తర్వాత ఈ రంగంపై పన్నుల భారం అధికం కావడం వల్లే ఈ ...9లో



ఆసియాలోనే ముఖేశ్ రెండో కుబేరుడు

- ఈ ఏడాది సంపద 77 వేల కోట్లు
- బ్లూమ్‌బర్గ్ మిలియనీర్ ఇండెక్స్‌లో వెల్లడి

వివరాలు 12లో



యువతుల పట్ల అసభ్య ప్రవర్తన

- ఆరుగురు యువకులు అరెస్ట్
- హైదరాబాద్ నగర శివారులో ఘటన

వివరాలు 9లో

సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడదాం

సీపీఐ రాష్ట్ర సమ్మేళనంలో వక్తలు

- అబద్ధాలు చెప్పటంలో కేసీఆర్, మోడీ పోటాపోటీ : సురవరం
- అన్ని రంగాల్లో సమానత్వం కావాలి : తమ్మినేని
- ఈనెల 16 నుంచి సెప్టెంబర్ వరకు సదస్సులు
- అక్టోబర్ 5 నుంచి బస్సుయాత్ర

వివరాలు 9లో



2లక్షల కోట్ల కార్పొరేట్ అప్పుల పునరుద్ధరణ

- రాజ్యసభలో జైట్లీ 10లో

చైనా చొరబాటు నిజంకాదు

- తోసిపుచ్చిన సైన్యం 2లో

2వేల కోట్లతో ఎస్సారెస్పీ పునర్జీవన పథకం

10న సీఎం చేతుల మీద ప్రారంభం : మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణకు ఉన్న అతిపెద్ద సాగునీటి వనరైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవన పథకానికి, ఆధునీకరణకు రూ.2 వేల కోట్లు కేటాయించామని రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి టి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీలో ఉన్న టీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, వెంకటేశ్వర్‌రావు, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 10న ఉదయం 11 గంటలకు ఎస్సారెస్పీ పునర్జీవన ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారని ప్రకటించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ వేగంగా పూర్తి చేస్తున్నారని వెల్లడించారు. ఐదు జిల్లాలకు మేలు చేసేలా ఎస్సారెస్పీ పథకమని తెలిపారు. ఎస్సారెస్పీ కింద 14.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిస్తామని తెలియజేశారు. ఎస్సీరెస్పీ పునర్జీవన ...9లో

టార్చి లైట్ల వెలుగులో ఆపరేషన్లు

ఉస్మానియాలో రెండు టేబుళ్లకు ఒకే లైటు

- ఆరు నెలలుగా ఇదే దుస్థితి
- మెడిసిన్ అవుటాఫ్ స్టాక్ బోర్డు

నవతెలంగాణ - ధూల్‌పేట్

'పేద ప్రజల ఆరోగ్యం కోసం వైద్యఆరోగ్య శాఖకు భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నాం. ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నాం' అని సర్కారు గొప్పలకు పోతున్నా...అది క్షేత్రస్థాయిలో డొల్ల అని తేటతెల్లమైంది. రెండు టేబుళ్లకు ఒకే లైటు..టార్చిలైట్ల



వెలుతురులో అత్యవసర ఆపరేషన్లు...మెడిసిన్ విభాగంలో అవుట్‌ఆఫ్ స్టాక్ బోర్డులు...ఇదీ ఉస్మానియా ఆస్పత్రిలోని దుస్థితి. రోజూ వేల మంది పేదలకు వైద్యసేవలు అందించే ఆ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలేమి పేదల ప్రాణాలమీదకు వస్తున్నది. ఉస్మానియాలో ఆరునెలలుగా అత్యవసర ఆపరేషన్ థియేటర్(ఈఓటీ)లోని లైట్లు పనిచేయట్లేదు. ఒక ఆపరేషన్ థియేటర్‌లో రెండు టేబుళ్లు ఉంటాయి. ఒక్కో టేబుల్‌పై ఒక ఆపరేషన్ చేస్తారు. కొన్నిసార్లు అత్యవసర రోగులు ఎక్కువగా ఉంటే ఇద్దరికి ఒకే సమయంలో ఆపరేషన్లు చేయాలి. అయితే రెండు టేబుళ్లకు సరిపడా లైట్లు లేకపోవడంతో వైద్యులు తప్పని పరిస్థితుల్లో టార్చి లైట్లు, సెల్‌ఫోన్ టార్చి పెట్టుకుని ఆపరేషన్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు ...9లో



వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓటేస్తేనే..
ఈ హామీలు నెరవేరుస్తారట..!!

కార్మిక వైద్యానికి సర్కార్ గండి

దేశ అట్టడుగు ప్రజానీకానికి విద్య, వైద్యం లాంటి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రపంచంలోని అన్ని శ్రేయో రాజ్యాల కనీస ధర్మం. ఆ ధర్మానికి తూట్లు పొడిచే చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశ జాతీయోత్పత్తిని పెంచి ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసే అట్టడుగు కార్మికునికి కనీస వైద్య సదుపాయం సైతం నిరాకరిస్తోంది. అదీ సాక్షాత్తూ "ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్" (ఈఎస్ఐ) ద్వారా కార్మికులకు అందే వైద్య సదుపాయాలు అందకుండా గండి కొట్టింది. అత్యంత రహస్యంగా ఢిల్లీలోని 'పంచదీప్' (ఈఎస్ఐ కేంద్ర కార్యాలయం) కేంద్రంగా ఆదేశాలు అన్ని రాష్ట్రాల్లో ఉన్న తన నేతృత్వంలోని ఆస్పత్రులకు అందించింది. ఇప్పటికే విద్యను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించిన కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు.. ఇక కొద్ది శాతం కార్మికులకు అందుతోన్న వైద్యాన్ని సైతం అందకుండ చేస్తున్నాయి. నిజానికి అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులకు ఆ సౌకర్యం సైతం లేనే లేదు.

ఈఎస్ఐ నిర్వీర్యం

- రెండేండ్ల నిరంతర సర్వీసు అనివార్యం
- కేంద్ర కార్మిక శాఖ ఆదేశాలు



శంభాజీ. ఎల్

గతంలో ఎంతో కొంత ఈఎస్ఐ ద్వారా కార్మికలోకానికి వైద్య సదుపాయాలు అందేవి. కనీసం మూడు నెలల ఉద్యోగిత కాలం ఉంటే వారికి ఆ సౌకర్యం వర్తించేంది. అందులో 90 రోజుల్లో కనీసం ...9లో

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం బిల్లు వెనక్కి..

న్యూఢిల్లీ : వివిధ కంపెనీల యాజమాన్యాల్లో కార్మికుల భాగస్వామ్యం ఉండాలని ఉద్దేశించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం వెనక్కి తీసుకున్నది. 'యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం' బిల్లును 1990లో తీసుకొచ్చారు. నాటి కేంద్ర కార్మికశాఖ మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ రాజ్యసభలో దీనిని ప్రవేశ పెట్టారు. అయితే.. 27 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లును వెనక్కి తీసుకునేందుకు కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ.. రాజ్యసభలో మంగళవారం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాగా.. మూజువాణి ఓటు ద్వారా ఈ తీర్మానం ఆమోదం పొందింది.

యోగిని విచారించేందుకు ప్రభుత్వ నిరాకరణ
సవాలు పిటిషన్‌పై కోర్టు విచారణ

అలహాబాద్ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను 2007 నాటి గోరఖ్‌పూర్ అల్లర్ల కేసులో విచారించేందుకు నిరాకరిస్తూ యూపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం రెండు రోజుల గడువునిచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు తొమ్మిదికి వాయిదావేసింది. హింసాత్మక ఘటనలను రెచ్చగొట్టారంటూ లోక్‌సభ ఎంపీ యోగి ఆదిత్యనాథ్, గోరఖ్‌పూర్ మాజీ మేయర్ అంజు చౌదరి, ఎమ్మెల్యే రాధా మోహన్ అగర్వాల్, మరో వ్యక్తిపై 2008లో ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే. కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో దీనిపై 2008లో దాఖలైన ఎఫ్ఐఆర్‌పై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాల్సిందిగా పిటిషనర్లు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. 2007లో యోగి ఆదిత్యనాథ్ చేసిన ప్రసంగం రెచ్చగొట్టేలా ఉందని, దానివల్లే గోరఖ్‌పూర్‌లో అల్లర్లు జరిగాయని పిటిషనర్ ఆరోపించారు. 2015లోనే యోగి ఆదిత్యనాథ్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీసీఐడీ ప్రభుత్వాన్ని కోరింది. యోగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత... ఆయనను విచారించేందుకు నిరాకరిస్తున్నట్టు యూపీ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అప్పట్లో ఆ కేసులో యోగిని నిందితుడిగా పేర్కొని జైల్లో కూడా పెట్టారు.

నితీశ్ కుమార్ మండలి సభ్యత్వం రద్దు పిటిషన్
విచారణకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాష్ట్ర శాసన మండలి సభ్యుని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తనపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును గోప్యంగా ఉంచినందున అతని మండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. దీనిపై తక్షణ విచారణ జరపాలని పిటిసనర్ తరఫు న్యాయవాది ఎం.ఎల్. శర్మ కోర్టుకు విజ్ఞప్తి చేయగా ఈ విషయాన్ని పరిశీలిస్తామని న్యాయమూర్తులు దీపక్ మిశ్రా, మితవ రాయ్, ఎ.ఎం.ఖాన్విల్కర్లతో కూడిన ధర్మాసనం తెలపింది. 1991లో బర్హ్ లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేత సీతారాం సింగ్ హత్యతోపాటు, మరో నలుగురిని గాయపరిచిన కేసులో జేడీయూ నేత నితీశ్ నిందితుడిగా ఉన్నట్టు పిటిషనర్ ఆరోపించారు. ఈ కేసులో బీహార్ ముఖ్యమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా సీబీఐని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. తమపై ఉన్న క్రిమినల్ కేసులను నామినేషన్ సందర్భంగా అభ్యర్థులు దాఖలు చేసే అఫిడవిట్లలో తప్పనిసరిగా బహిర్గతం చేయాలని పేర్కొంటూ ఎన్నికల కమిషన్ 2002లో ఉత్తర్వులు జారీచేసింది. తనపై కేసును గోప్యంగా ఉంచిన నితీశ్ కుమార్ మండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును నితీశ్ కుమార్ 2012లో మినహా 2004 నుంచి దాఖలు చేసిన అఫిడవిట్లలో ఎప్పుడూ వెల్లడించలేదని ఆరోపించారు.

'ఫాల్తూరామ్' : నితీశ్‌పై లాలూ నిప్పులు

జేడీయూ నేత నితీశ్ కుమార్‌పై రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జెడి) చీఫ్ లాలూప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. నితీశ్‌ను 'ఫాల్తూరామ్'గా అభివర్ణించారు. అధికార వాంఛతోనే నితీశ్ ఈ పనిచేశారని ఆరోపించారు. బీహార్ ముఖ్యమంత్రి పదవిని ఈ విడత తనకు ఇవ్వాల్సిందిగా నితీశ్ తనను వేడుకున్నారని లాలూ ప్రసాద్ అన్నారు.

కీలక డేటా పరిరక్షణకు శ్రీకృష్ణ నేతృత్వంలో కమిటీ

న్యూఢిల్లీ : భారత్‌లో కీలక డేటా రక్షణకు సంబంధించిన అంశాలను గుర్తించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బిఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో నిపుణుల కమిటీని మోడీ సర్కార్ నియమించింది. ఏమైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించే పద్ధతులను ఈ కమిటీ సిఫార్సు చేస్తుంది. ఈ కమిటీలో పది మంది సభ్యులుంటారు. టెలికమ్యూనికేషన్స్, ఐటీ, యూఐడీఏఐ, విద్యా విభాగాలకు చెందిన ప్రతినిధులు ఈ కమిటీలో వుంటారు. భారత్‌లో డేటా రక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై అధ్యయనం చేయడమే కాకుండా డేటా రక్షణ బిల్లు ముసాయిదాను కూడా రూపొందిస్తారు. ఆ తర్వాత బిల్లును కేంద్రం పరిశీలిస్తుంది. కమిటీ ఏర్పాటుకు సంబంధించిన సర్క్యులర్‌ను జారీ చేసిన ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, కమిటీ సభ్యులకు కావాల్సిన సమాచారాన్ని అందిస్తుంది. భారత్‌లో రిలయన్స్, మెక్‌డొనాల్డ్స్ వంటి కార్పొరేట్ సంస్థలు గోప్యత, డేటా ఉల్లంఘనలకు పాల్పడుతుండడంతో డేటా పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఐటి మంత్రిత్వశాఖ గత ఆరు మాసాలుగా డేటా రక్షణపై కసరత్తు ప్రారంభించింది.

చైనా చొరబాటు నిజంకాదు

- తోసిపుచ్చిన సైన్యం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ లోని చమోలీ జిల్లా బారాహోతీ ప్రాంతంలో చైనా సైనికులు భారత భూ భాగంలోకి చొచ్చుకు వచ్చినట్టు వెలువడిన వార్తలను సైన్యం తోసిపుచ్చింది. ఈ వార్తల్లో పేర్కొన్నట్టుగా బారాహోతీ ప్రాంతంలో ఎటువంటి చొరబాట్లు జరగలేదని సైన్యం ప్రతినిధి కల్నల్ అమల్ ఆనంద్ మీడియాకు చెప్పారు. వాస్తవాధీన రేఖపై భిన్నాభిప్రాయాలు వుండటం వల్లే తరచు పొరుగుదేశాల భూభాగంలోకి ప్రవేశించటం జరుగుతుందని ఆయన వివరించారు. కాగా ఈ ఘటనపై విచారణ కమిటీని నియమించినట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రతినిధి మదన్ కౌశిక్ చెప్పారు.

ఈశాన్య రాష్ట్రాలకు రూ.2,350 కోట్ల వరదసాయం

- ప్రధాని ప్రకటన

గువహతి : వరద బీభత్సానికి గురైన ఈశాన్య రాష్ట్రాలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రాతిపదికన రూ. 2,350 కోట్ల రూపాయల సాయం అందించనున్నట్టు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. వరద బాధిత ఈశాన్య రాష్ట్రాలను సందర్శించేందుకు మంగళవారం ఇక్కడికి చేరుకున్న ప్రధాని అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ ముఖ్యమంత్రులు, వారి క్యాబినెట్ సహచరులతో కలిసి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు రూ.2,350 కోట్ల వరద సాయం ప్యాకేజ్‌ని ప్రధాని ప్రకటించినట్టు అసోం ఆర్థిక మంత్రి హిమంత బిశ్వశర్మ చెప్పారు. ఏఏ రాష్ట్రాలకు ఎంతెంత సాయం అందించేది త్వరలోనే ప్రకటిస్తారని ఆయన వివరించారు.

సోహ్రాబుద్దీన్ హత్య కేసు
ఐపీఎస్ వంజారాకు విముక్తి

అహ్మదాబాద్ : దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో గుజరాత్ పోలీస్ మాజీ డైరెక్టర్ జనరల్ వంజేరాకు సీబీఐ కోర్టు విముక్తి ప్రసాదించింది. వంజేరాతో పాటు రాజస్తాన్ పోలీసు అధికారి దినేశ్ ఎంఎన్‌కు కూడా కోర్టు విముక్తి ప్రకటించింది. ఈ కేసులో ఇదివరలో నిందితులుగా ఉన్న అనేక మంది బీజేపీ నేతలకు కోర్టు విముక్తులను చేసిన విషయం తెలిసిందే. వారిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కూడా ఉన్నారు. కోర్టుతీర్పు వెలువడినవెంటనే విలేకరులతో మాట్లాడుతూ పోలీసు అధికారులమైన తాము ఇద్దరు విముక్తి కోరుతూ దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు అంగీకరించిందని వంజేరా చెప్పారు.

ముంపు బాధితులందరికీ
పునరావాసం కల్పించాలి

- ఆ తర్వాతే సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ గేట్లు మూయాలి
- బాధితులందరికీ పరిహారం ఇవ్వాలి
- వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీని కొనసాగించాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో



న్యూఢిల్లీ : ముంపు బాధితులందరికీ పునరావాసం కల్పించిన తర్వాతే సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ గేట్లు మూసి వేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తున్నదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. బాధితులకు సరైన పునరావసం కల్పించడం పూర్తయితేనే.. జులై 31 తర్వాత వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు పొలిట్‌బ్యూరో తెలిపింది.

ముంపు బాధిత కుటుంబాలు 40,000కు పైగా ఉన్నాయని, వారందరికీ పరిహారం అందించడం, పునరావాసం కల్పించడం పూర్తి కాలేదని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. రైతులకు ఇంకా ఎలాంటి పరిహారమూ ఇప్పటివరకూ ఇవ్వలేదని తెలిపింది. వ్యవసాయ కార్మికులు, దుకాణదారులు, మత్స్యకారులు, కుండల తయారీదారులువంటి వృత్తి పనివారికి పరిహారం కల్పించే నిబంధనలు రూపొందించకపోవడాన్ని పొలిట్‌బ్యూరో తప్పు పట్టింది. రాజకీయ ఒత్తిడి వల్ల 40,000 కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పొలిట్‌బ్యూరో తెలిపింది. సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ నేతృత్వంలో బాధిత కుటుంబాలు నిర్వహిస్తున్న ఆందోళనకు సీపీఐ(ఎం) సంఘీభావం తెలిపింది.

వంటగ్యాస్ సబ్సిడీని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఖండించింది. గ్యాస్ సిలిండర్ ధర ప్రతినెలా రూ.4 చొప్పున పెంచుతూ సబ్సిడీని పూర్తిగా తొలగించాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ధనికులు సబ్సిడీని స్వచ్ఛందగా వదులుకొని, పేదలకు అది అందేందుకు తోడ్పడాలంటూ ప్రధాని గతంలో చేసిన ప్రచారానికి తాజా నిర్ణయం పూర్తిగా విరుద్ధంగా ఉన్నదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఓవైపున అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం ఉత్పత్తులపై ధరలు తగ్గుతుండగా, పేదలపై భారం మోపే నిర్ణయం ఎలా తీసుకున్నారని పొలిట్‌బ్యూరో ప్రశ్నించింది. దేశంలోని మెజారిటీ ప్రజలపై భారం మోపే ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

నిండు గర్భిణి... 20 కిలో మీటర్లు...

- రోడ్డుపైనే ప్రసవం
- శిశువు మృతి
- మధ్యప్రదేశ్‌లో ఘటన



కట్ని : బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. అంబులెన్సు సదుపాయం లేక నిండు గర్భిణి 20 కిలో మీటర్ల దూరంలోని ఆస్పత్రికి నడకదారిన బయలుదేరింది. చివరకు రోడ్డుపైనే ప్రసవించింది. కాగా, అక్కడే శిశువు మృతిచెందిన ఘటన కట్ని జిల్లాలో చోటుచేసుకుంది. బర్మానీ గ్రామానికి చెందిన బీనా అనే గర్భిణికి సోమవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. దాంతో కుటుంబసభ్యులు అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. అది రాకపోవడంతో చేసేదిలేక 20కిలో మీటర్ల దూరంలోని బర్హి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి భర్తతో కలిసి నడకదారిన బయలుదేరింది. బర్హీ పట్టణానికి చేరు కోగానే ఆమెకు పురిటి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి.

అక్కడి పోలీసు స్టేషన్ సమీపాన రోడ్డుపైనే ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పసికందు రోడ్డుపై పడిపోవడంవల్లే చనిపోయిందని కుటుంబసభ్యులు మీడియాకు తెలిపారు. కాగా దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య ముఖ్య అధికారి అశోక్ అవధియాను ప్రశ్నించగా... ఏడో నెలలో ప్రసవించడంవల్లే బిడ్డ చని పోయినట్టు చెప్పారు. అంబులెన్స్ ఎందుకుపంపలేదని అడుగగా.. బర్హీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అంబులెన్స్ అందుబాటులో లేదని అన్నారు. 'జననీ ఎక్స్ ప్రెస్ (గర్భవతులకు అంబులెన్స్ సర్వీసు 108) మా ఆధీనంలో లేదు' అన్నా రు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్టు అశోక్ అవధియా చెప్పారు.

లష్కరే అగ్ర నేత అబూ దుజానా ఎన్‌కౌంటర్



శ్రీనగర్ : లష్కరే తోయిబా అగ్రనేత, టాప్ కమాండర్ అబూ దుజానాను భద్రతా బలగాలు పుల్వామా జిల్లా హక్రీపురా గ్రామ పరిసరాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చంపివేశాయి. ఈ ఘటనలో మరో ఉగ్రవాది కూడా హతమైనట్టు సమాచారం అందింది. తెల్లవారు జామున 4.30 సమయంలో 182 బెటాలియన్, సెంట్రల్ రిజర్వు దళాలు, 163 బెటాలియన్, 55 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన గాలింపు సందర్భంగా కచ్చితమైన నిఘా హెచ్చరికల ఆధారంగా ఆ గ్రామంలోని ఒక ఇంటిపై దాడి చేసాయి. ఆ ఇంట్లో ఉగ్రవాదులు తలదాచుకున్నట్టు అందిన సమాచారం ఆధారంగా ఈ దాడులు జరిగాయి. ఆ ఇంట్లో అబూతో పాటు ఆతని అనుచరుడు ఆరిఫ్ కూడా ఉన్నట్టు నిర్ధారించుకున్న తర్వాత ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. భీకరంగా సాగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టుగా నిర్ధారణ అయింది. దుజానాపై ప్రభుత్వం రూ. 10 లక్షల రివార్డు ప్రకటించింది. గత మే నెలలో ఒకసారి భద్రతా దళాల కన్నుగప్పి దుజానా తప్పించుకుపోగలిగాడు. అప్పుడు కూడా జనం రాళ్లు విసురుతూ కల్పించిన సమయంలోనే ఆయన తప్పించుకోగలిగాడు. పాకిస్తాన్‌కు చెందిన దుజానా 2010లో దేశంలో చొరబడ్డాడు. స్థానికంగా పటిష్టమైన కార్యకలాపాల వ్యవస్థను ఏర్పాటు చేసుకోగలిగాడు. 2014లో స్థానిక లష్కరే తీవ్రాది అంతిమ కార్యక్రమాల్లో పాల్గొని మొట్ట మొదటి సారి రంగంలో కనిపించాడు. మరోసారి గత ఏడాది జూలైలో హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ అంత్య క్రియల్లో కూడా పాల్గొన్నాడు. అప్పటి నుంచి భద్రతా బలగాలు ఆయన కోసం వేటాడుతూనే ఉన్నాయి. ఆయనకు చాలా ఉగ్ర దాడులతో సంబంధం ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

పోలీసుల కాల్పుల్లో పౌరుడి మృతి

మరోవైపు దుజానా ఎన్‌కౌంటర్ వార్త తెలియగానే కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతంలో దాదాపు 100 మందికి పైగా యువకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయుగోళాలు, పెల్లెట్లను ప్రయోగించారు. అంతేకాక, కొన్ని రౌండ్ల కాల్పులు కూడా జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఫిర్దోస్ అహ్మద్ అనే వ్యక్తిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కానీ, అతడు అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. ఇదే ఘటనలో 12 మందికి పైగా నిరసనకారులు గాయపడ్డారు. దుజానా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కాశ్మీర్‌వ్యాప్తంగా మొబైల్, ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు సైనికాధికారి ఒకరు వెల్లడించారు.

హెచ్1బీ వీసాకు 11 ఏండ్లలో
21 లక్షల మంది భారతీయులు దరఖాస్తు



వాషింగ్టన్ : హెచ్1బీ వీసా కోసం గడిచిన 11 ఏండ్లల్లో 21 లక్షల మంది భారతీయులు దరఖాస్తు చేసుకున్నట్టు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) అధికారిక రిపోర్టు వెల్లడించింది. ఈ రిపోర్టులోని వివరాల ప్రకారం.. అయితే వీరిలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు లేరని తెలిసింది. హెచ్1బీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సరాసరి జీతం 92,317 డాలర్లు(దాదాపు రూ.60 లక్షలు) కాగా.. ఎక్కువ మంది మాస్టర్, బ్యాచ్‌లర్ డిగ్రీ అర్హత కల్గి ఉన్నారని పేర్కొంది. 2007 నుంచి ఈయేడాది జూన్ వరకు మొత్తం 34 లక్షల హెచ్1బీ దరఖాస్తులను యూఎస్‌సీఐఎస్ స్వీకరించింది. వీరిలో 21 లక్షల మంది భారతీయులే ఉన్నారు. ఇదే సమయంలో 26 లక్షల హెచ్1బీ వీసాలను యూఎస్ జారీ చేసింది. అయితే.. ఏ దేశానికి ఎన్ని వీసాలను జారీ చేసిందనేది వెల్లడి కాలేదు. 2007–17 మధ్యకాలంలో చైనా నుంచి 2,96,313 మంది వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. పిలిప్పీన్స్ నుంచి 85,918, దక్షిణ కొరియా 77,359, కెనడా 68,228 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో 23 లక్షల మంది 25 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సు వారే ఉన్నారు. 20 లక్షల మంది కంప్యూటర్ ఆధారిత కేటగిరీకి చెందిన వారున్నారు. 11 ఏండ్ల కాలంలో 65 ఏండ్ల వయస్సు దాటిన వారు 2000 మంది వీసాలను పొందారు. అంతేకాక ఈ ఏడాదిలోనే ఇదే వయస్సు ఉన్న 122 మందికి హెచ్1బీ వీసాలు మంజూరయ్యాయి.

నిటి ఆయోగ్ ఉపాధ్యక్షుడు
అరవింద్ పనగారియా రాజీనామా



న్యూఢిల్లీ : ఎన్‌డీఏ సర్కారు అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పాటు చేసిన నిటి ఆయోగ్ తొలి ఉపాధ్యక్షుడు, ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త అరవింద్ పనగారియా (64) తన పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 31వ తేదీతో విధుల నుంచి తాను తప్పుకుంటున్నానని ఆయన మంగళవారం ప్రకటించారు. రెండేండ్ల క్రితం అమలులోకి వచ్చిన నిటి ఆయోగ్ ఉపాధ్యక్షుడిగా 2015లో ఆయన నియమితులయ్యారు. క్యాబినెట్ ర్యాంకు హోదాలోని ఈ పదవి నుంచి వైదొలగిన తర్వాత తిరిగి అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆయన తిరిగి అధ్యాపక బాధ్యతలు చేపట్టనున్నారు. తనకు కొలంబియా వర్సిటీ నుంచి సెలవు పెంపునకు అనుమతి అందలేదని ఆయన తన రాజీనామా కారణాన్ని తెలియజేశారు. ఈ విషయాన్ని గురించి నిటి అయోగ్ అధ్యక్షుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రెండు నెలల క్రితమే తెలియజేసినట్టు ఆయన తెలిపారు. ఇంతకుముందు ఆయన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు ఆర్థిక సలహాదారుగాను, వరల్డ్ బ్యాంకుతోను, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, ఐక్యరాజ్యసమితి సంస్థలతో కలిసి పనిచేసిన పనగారియా ప్రిన్స్‌టన్ వర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఇంటర్నెట్ వినియోగంలో..
భారత్, చైనా యువత ముందంజ

- ప్రపంచంలో 39 శాతం మంది రెండు దేశాలవారే : ఐరాస ఏజెన్సీ రిపోర్టు వెల్లడి



న్యూఢిల్లీ : ఇంటర్నెట్ వినియోగంలో భారత్, చైనా యువత ముందంజలో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న యువతీ, యువకుల్లో 39శాతం మంది భారత్, చైనాల నుంచే ఉన్నారని ఐరాస ఏజెన్సీ అయిన ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్(ఐటీయూ) వెల్లడించింది. ఐటీయూ రిపోర్టులోని వివరాల ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా 83కోట్ల మంది యువత(15–24 ఏండ్ల లోపు) ఇంటర్నెట్‌ను వాడుతుండగా, వీరిలో భారత్, చైనాల నుంచి 32 కోట్ల మంది ఉన్నారు. మొత్తంగా ఇంటర్నెట్ వినియోగిస్తున్న వారిలో 23 శాతం మంది 15 నుంచి 24 ఏండ్లలోపే ఉన్నారు. ఇదే లెక్కన తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో 35 శాతం, అభివృద్ధి చెందిన దేశాల్లో 13 శాతం మంది యువత ఉన్నారు. అంతేకాక, అభివృద్ధి చెందిన దేశాల్లో 94 శాతం, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 67 శాతం, తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో 30 శాతం మంది యువతీ యువకులు ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. గడిచిన ఐదేండ్లలో మొబైల్ బ్రాడ్‌బాండ్ సేవల వినియోగం 20శాతం మేర పెరిగింది. ఈ పెరుగుదల తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో గణనీయంగా ఉన్నది. ఇదే కాలంలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బాండ్ వినియోగం దాదాపు 9 శాతం పెరిగింది. మరోవైపు ఇంటర్నెట్ వాడకంలో పురుషులు, మహిళల మధ్య నిష్పత్తి క్రమంగా తగ్గుకుంటూ వస్తున్నది. గడిచిన మూడేండ్లలో ఇంటర్నెట్ వినియోగంలో మహిళల ప్రాతినిధ్యం బాగా పెరిగినట్టు రిపోర్టు వెల్లడించింది. అమెరికాలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండటం గమనార్హం. ఆ దేశంలో పురుషుల కంటే 3 శాతం మంది ఎక్కువ మంది మహిళలు ఇంటర్నెట్‌ను వాడుతున్నారని ఐటీయూ పేర్కొన్నది. చైనాలో మొత్తం 73 కోట్ల మంది, అమెరికాలో 28.7 కోట్ల మంది ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తున్నారని అంచనా.

ట్విట్టర్ పిట్ట మళ్ళీ ఎగిరేనా?

- తోటి సోషల్ నెట్ వర్కింగ్ సైట్లతో పోటీపడలేకపోతున్న ట్విట్టర్
- రెండో క్వార్టర్లో కొత్త యూజర్లను ఆకర్షించడంలో విఫలమైన సంస్థ
- గత రెండేండ్లలో స్టాక్ మార్కెట్లో 66 శాతంకి పైగా పడిపోయిన షేర్ ధరలు
- నూతన ఫీచర్లు, కొత్త రెవెన్యూ స్ట్రీమ్స్‌ను తీసుకురాకపోతే కోలుకోవడం కష్టమంటున్న నిపుణులు

- జై



మారుతున్న కాలానికి అనుగుణంగా నెట్టిల్లే వేదికగా వర్చువల్ కమ్యునిటీస్ ద్వారా నేటి యువత తమ కెరీర్ ఆసక్తులు, ఆలోచనలు, అభిప్రాయాలు వగైరా వంటి వాటిని సహచరులతో పంచుకోవడం సర్వసాధారణం అయ్యింది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వెబ్ చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కొంగొత్త ఫీచర్లు, టెక్నికల్ అడ్వాన్స్ మెంట్ లైట్ వెర్షన్లతో శరవేగంగా దూసుకెళ్తుండగా... ట్విట్టర్ మాత్రం ఆయా పోటీదారులను అందుకోవడంలో చతికిలపడిందని సదరు సంస్థ తాజాగా విడుదల చేసిన రెండో త్రైమాసిక ఫలితాలను చూస్తే అర్థమవుతోంది.

కొత్త యూజర్లు ఎక్కడ? :

ట్విట్టర్ సంస్థ ఈ యేడు రెండో క్వార్టర్ ఫలితాలను ప్రకటిస్తూ.. ఏటా సంస్థ రెవెన్యూలు ఐదు శాతం వరకు పడిపోయి.. 57.4 కోట్ల డాలర్లుగా నమోదు అయినట్టు తెల్పింది. ట్విట్టర్‌కు ప్రస్తుతం 32.8 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లున్నట్టు ప్రకటించిన యాజమాన్యం.. 2017 తొలి క్వార్టర్‌లో కూడా ఇంతే మొత్తం యూజర్ బేస్‌ను పేర్కొనడం గమనార్హం. అంటే, ఈ సంవత్సరం తొలి క్వార్టర్ తర్వాత అనగా ఏప్రిల్ నెల నుంచి జూన్ నెల వరకు ట్విట్టర్ ఒక్క యూజర్‌ను కూడా అదనంగా నమోదు చేసుకోలేకపోయిందన్న మాట! కాగా, గత క్వార్టర్‌లో 194 కోట్ల యూజర్ బేస్ తో ఉన్న ఫేస్‌బుక్ ఈ క్వార్టర్‌లో 200.01 కోట్ల యూజర్ల మార్కును క్రాస్ చేయడం పరిగణించాల్సిన విషయం.

అన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టాయి :

ట్విట్టర్ సంస్థ ప్రస్తుత గడ్డు పరిస్థితికి రావడానికి పలు కారణాలున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. లైవ్ స్ట్రీమింగ్, నియర్ ఫీల్డ్, యాడ్ మేనేజర్, కమ్యూనిటీ గ్రూప్స్ వంటి అధునాతన ఫీచర్లతో యూజర్ల అభిమానాన్ని చూరగొంటూ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వెబ్ చాట్, స్నాప్ చాట్ తదితర సామాజిక మాధ్యమాలు దూసుకుపోతుంటే.. ట్విట్టర్ మాత్రం ఇంకా అనుకున్న స్థాయిలో తన వెర్షన్లను యూజర్లకు అందుబాటులోకి తేలేకపోయిందన్నది అంగీకరించాల్సిన విషయం. వెరసి 2015 నాలుగో క్వార్టర్లో సుమారు తొమ్మిది కోట్ల డాలర్ల నష్టాన్ని నమోదు చేసిన సంస్థ, 2016 నాలుగో త్రైమాసికం ముగిసేనాటికి సంస్థ నష్టాలు 16.7కోట్ల డాలర్లకు పెరిగాయి. ఫైనాన్షియల్ పర్ఫామెన్స్ సరిగ్గా లేకపోవడంతో మార్కెట్ విలువను కూడా నిలుపుకోవడంలో ట్విట్టర్ అష్టకష్టాలు పడుతున్నది. 2015 ఏప్రిల్‌లో 52.9 స్టాక్ ను నమోదు చేసిన సంస్థ ప్రస్తుతం 16.75కు పరిమితమవడం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది. స్థూలంగా చెప్పాలంటే, గత రెండేండ్లలో స్టాక్ మార్కెట్లో ట్విట్టర్ షేర్ ధరలు 66 శాతంకి పైగా తగ్గిపోయినట్టు నిపుణుల అంచనా. ఇప్పటికే, 77 శాతం మొబైల్ ట్రాఫిక్ ని ఫేస్‌బుక్ మరియు దాని అనుబంధ సంస్థలు చేజిక్కించుకోగా, సెర్చ్ అడ్వర్టైజింగ్ లో సుమారు 88 శాతం మార్కెట్ షేర్ ను గూగుల్ సంస్థ ఆక్రమించడంతో ప్రకటనల ఆదాయమూ ట్విట్టర్‌కు అంతగా కలిసిరావట్లేదు. ఇలా ఒకదానికొకటి దరిమిలా ట్విట్టర్ ను కోలుకోలేకుండా చేస్తున్నాయి. అందుకే.. కోవెన్, రేమండ్ జేమ్స్, అట్లాంటిక్ ఈక్విటీస్, సిటీ గ్రూప్, లూప్ క్యాపిటల్ వంటి ఫైనాన్షియల్ దిగ్గజ సంస్థలు ట్విట్టర్ ఇకనైనా మేల్కొనకపోతే కష్టమని అభిప్రాయపడు తున్నాయి

. పోటీ సంస్థల వ్యూహాలను అర్థం చేసుకుంటూ మందగి స్తున్న యూజర్ వద్ధిని మరలా పెంచుకొనుటకు నవ్యమైన ఫీచర్లు, కొత్త రెవెన్యూ స్ట్రీమ్స్ ను తీసుకొస్తే ట్విట్టర్ పిట్ట మళ్ళీ ఎగరడం ఖాయమని మార్కెట్ పండితులు పేర్కొంటున్నారు.

సామాజిక మాధ్యమం పేరు	నెలవారీ యాక్టివ్ యూజర్లు(కోట్లలో)
ఫేస్‌బుక్	200.01
వాట్సాప్	120
ఫేస్‌బుక్ మెసెంజర్	120
వెబ్ చాట్	88.9
ఇన్‌స్టాగ్రామ్	70
ట్విట్టర్	32.8

ట్విట్టర్ - ఆసక్తికర అంశాలు :

- ట్విట్టర్ పిట్ట అధికారిక నామమైన ల్యారీ పేరు అమెరికన్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు లారీ జో బర్డ్ పేరు మీదుగా తీసుకున్నారు.
- జపాన్‌కు చెందిన ఓ బాలిక అత్యధికంగా 3,64,02,262 ట్వీట్లు చేసింది. ఈ తాకిడి తట్టుకోలేక ఆమె ఖాతాను ట్విట్టర్ సంస్థ యాజమాన్యం తొలగించడం విశేషం.
- ట్విట్టర్‌కు ఎస్సెమ్మెస్ ఆఫ్ ద ఇంటర్నెట్ అనే పేరు కూడా ఉంది.
- ఫేస్‌బుక్ సంస్థ ట్విట్టర్‌ను కొనుక్కోవడానికి రెండుసార్లు ప్రయత్నించినప్పటికీ ట్విట్టర్ మాత్రం అందుకు ఒప్పుకోలేదు. కాగా, క్లౌడ్ ఆధారిత కంప్యూటింగ్ సేవల సంస్థ సేల్స్ ఫోర్స్ సంస్థ 2016లోనే ట్విట్టర్‌ను కొనాలనుకున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.

సామాజిక న్యాయం కోసం
ఐక్యంగా పోరాడదాం..

సీపీఐ రాష్ట్ర సమ్మేళనంలో వక్తలు

అబద్ధాలు చెప్పటంలో కేసీఆర్, మోడీ పోటాపోటీ : సురవరం

- అన్ని రంగాల్లో సమానత్వం కావాలి : తమ్మినేని వీరభద్రం
- ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు సదస్సులు
- అక్టోబర్ 5 నుంచి బస్సుయాత్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు, అభ్యుదయవాదులు, మేధావులందరూ ఐక్యంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తద్వారా తెలంగాణాలో ఒక నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని సూచించారు. 'సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం' అనే అంశాలపై సీపీఐ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకూ రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. అక్టోబర్ 5 నుంచి డిసెంబర్ 5 వరకూ బస్సుయాత్ర నిర్వహించనున్నారు. యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహిస్తారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజా గాయకుడు గద్దర్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నేత విమలక్క, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పోటు రంగారావు, జానకి రాములు (ఆరెస్పీ), బండా సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), మురహరి (ఎస్‌యుసీఐ-సీ), తాండ్ర కుమార్ (ఎంసీపీఐ-యు) తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో అటు మోడీ, ఇటు కేసీఆర్ ఇద్దరూ విఫలమయ్యారని విమర్శించారు. వీరిద్దరూ అబద్ధాలను వల్లెవేయటంలో పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం తెలంగాణాలో ప్రజలు ఆశించిన విధంగా పాలన సాగడం లేదని అన్నారు. బంగారు తెలంగాణ అంటే.. ప్రజాస్వామ్యాన్ని కాలరాయడం, ధర్నాచౌక్‌ను ఎత్తివేయడమేనా..? అని ప్రశ్నించారు. రాష్ట్రం అవినీతి తెలంగాణగా మారిందని విమర్శించారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న తమ్మినేని

తమ్మినేని మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి వామపక్షాలే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులుగా ఎదిగే విధంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని సూచించారు. సామాజిక అంశాలపై దృష్టి సారించి ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు. కుల వివక్షను రూపుమాపే విధంగా ఆందోళనలకు రూపకల్పన చేయాలని కోరారు. సమగ్రాభివృద్ధి- సామాజిక న్యాయం కోసం నిర్వహించే బస్సుయాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పే విధంగా ఉండాలన్నారు. ఆర్థిక సమానత్వం ఒక్కటేకాక.. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమానత్వం కూడా సాధించినప్పుడే ప్రజా తెలంగాణ సాకారమవుతుందని చెప్పారు. కోదండరామ్ మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకోనప్పుడు రాష్ట్రం నెంబర్ వన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం కాకుండా తాను కోరుకున్న పథకాలకే సర్కారు నిధులు కేటాయిస్తున్నదని విమర్శించారు. జీఎస్టీ కారణంగా వివిధ రంగాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నదని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులపై నేడు విచారణ

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేయడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుంది. 20903 మంది ఔట్‌సోర్స్ సిబ్బందిని పేరోల్స్‌లోకి తీసుకొస్తూ (శాశ్వత ఉద్యోగులు) విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యం మంగళవారం కూడా విచారణకు నోచుకోలేదు.

విక్రమ్‌గౌడ్ కేసులో పురోగతి

- క్లాప్‌షార్ట్‌లో కాల్పులకు ప్రయత్నం.?..గన్ స్వాధీనం..?
- నేడు మీడియాకు వివరాలు వెల్లడించే అవకాశం

నవతెలంగాణ - సిటీబ్యూరో

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌పై జరిగిన కాల్పుల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కేసులో అనుమానితులుగా భావిస్తున్న ఆరుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనంతపురంలో సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వారిని మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. విక్రమ్‌గౌడ్‌పై జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు వ్యక్తుల ప్రమేయంపై పోలీసులు అన్నికోణాల్లో ఆరా తీసినట్టు తెలుస్తోంది. వారిచ్చిన సమాచారంతో పోలీసులు గన్ స్వాధీనం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. గత శుక్రవారం జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి తనపై కాల్పులు జరిపారని విక్రమ్‌గౌడ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అయితే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, కాల్పుల పేరుతో కావాలనే మైండ్ గేమ్ ఆడుతున్నాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అప్పుల బాధను తప్పించుకోవడానికే కాల్పుల నాటకం ఆడినట్టు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఈఘటనలో ఆరుగురు వ్యక్తులను తనే పురమాయించి ఉంటాడని అనుమానించారు. తనపై కాల్పులు జరపాలని అనంతపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులతోపాటు హైదరాబాద్ నగరానికి నలుగురికి సుపారీ ఇచ్చాడు. పక్కా పథకం ప్రకారమే కాల్పులకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఈక్రమంలో బంజారాహిల్స్ పరిధిలోని తన కార్యాలయంలో 'క్లాప్ షార్ట్'లో కాల్చుకునేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ ఒక్కడే వాచ్‌మెన్ ఉండడంతోపాటు రాత్రి 1:30 కావస్తుండడంతో ఆ సమయంలో తనకు సీరియస్‌గా ఏమైనా జరిగితే వెంటనే ఆస్పత్రికి ఎవరూ తీసుకెళ్లే దిక్కుండరని ప్లాన్‌ను ఇంటికి మార్చినట్టు తెలుస్తోంది. ఇంటికి వచ్చిన విక్రమ్ సుపారీ ఇచ్చిన వారితో కాల్పించుకోవాలని అనుకున్నాడు. ఇందులో భాగంగానే వాచ్‌మెన్‌ను గేట్ వేయొవద్దని చెప్పాడు. అయితే కాల్చే సమయంలో వారి గురితప్పితే ప్రాణాలకే ప్రమాదమని భయపడిన విక్రమ్ తానే స్వయంగా రెండువైపులా కాల్చుకొని గన్‌ను వారికిచ్చాడని తెలుస్తోంది. ఆ తర్వాత తనపై కాల్పులు జరిగాయని నాటకమాడాడు. అయితే అన్నికోణాల్లో విచారించిన పోలీసులు, గన్‌పౌడర్‌ను సైతం విక్రమ్ శరీరం నుంచే సేకరించారు. దాంతో విక్రమ్ మైండ్ గేమ్ ఆడుతున్నాడని గుర్తించి ఆయన కాల్‌డేటాను పరిశీలించారు. ఈ క్రమంలో ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్నికోణాల్లో విచారించి వారి నుంచి కీలక సమాచారం రాబట్టారు. గన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. మంగళవారం విక్రమ్ పుట్టిన రోజుకావడంతో బుధవారం కేసు వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశముంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విక్రమ్ అప్పులిచ్చిన వాళ్ల ఒత్తిడి నుంచి తప్పించుకునేందుకు, కుటుంబసభ్యుల సానుభూతి పొందేందుకే తనపై దాడి జరిగిందన్న సీన్ క్రియేట్ చేసి ఉంటాడని సీనియర్ పోలీస్ అధికారులు అభిప్రాయడుతున్నారు.

మొదటి రోజే 1,242 మందిపై కేసులు

- హెల్మెట్ ధరించని వారే అధికం
- అమల్లోకొచ్చిన నెగిటివ్ పాయింట్ల విధానం

నవతెలంగాణ - సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా, పోలీస్‌శాఖలు సంయుక్తంగా చేపట్టిన నెగిటివ్ పాయింట్ల విధానం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశంలోనే హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన మొదటిరోజే 1242 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి నెగిటివ్ పాయింట్లు వేశారు. అందులో హెల్మెట్ ధరించనివారే అధికంగా ఉన్నారు. ఉదయం రోడ్లపైకి వచ్చిన పోలీసులు ప్రతీ వాహనాన్నీ తనిఖీ చేశారు. ముఖ్యంగా లైసెన్స్, బీమాపత్రాలు, ఆర్సీతోపాటు పొల్యూషన్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నెంబర్‌ప్లేట్లు, ధృవీకరణ పత్రాలు సరిగాలేని వాహనదారులకు పాయింట్స్ విధించారు. హిమాయత్‌నగర్, నారాయణగూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అంబర్‌పేట్, పాతబస్తీతోపాటు సికింద్రాబాద్‌లో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మొదటిరోజు 1242 మందిపై కేసులు నమోదు చేశారు. ఒక్కరోజుల్లో మొత్తం 1406 పాయింట్లు పడ్డాయి. పట్టుబడ్డ వారిలో 1100లకుపైగా ద్విచక్రవాహనదారులున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపించిన వారే అధికంగా ఉన్నారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. 40 మంది లారీల డ్రైవర్లకు కూడా నెగిటివ్ పాయింట్లు విధించారు. 12 పాయింట్లు పూర్తయితే లైసెన్స్ రద్దు చేస్తారు. దీనికి 24 నెలలపాటు వెసులుబాటు కల్పించారు.

ఖరారైన భద్రాద్రి ఆలయ తుది నమూనా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భద్రాద్రి ఆలయ అభివృద్ధి తుది నమూనా సిద్ధమైంది. ఆలయ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించిన చిన జీయర్‌స్వామి అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. భద్రాద్రి ఆలయాన్ని టెంపుల్ సిటీగా మార్చాలన్న సీఎం కేసీఆర్ సూచనల మేరకు ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి నమూనాలను రూపొందించారు. ఆ నమూనాలు ఆగమన శాస్త్రం ప్రకారం లేవని, కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని ఆలయ వేద పండితులు సూచించారు. వారి సూచనలను పరిగణలోకి తీసుకున్న ఆర్కిటెక్ట్ తుది నమూనాలను ఖరారు. ఆ నమూనాలను హైదరాబాద్‌లో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలయ ఈవో శ్రీనివాస్‌తో పాటు వేద పండితులు కలిసి చినజీయర్ స్వామిని కలిసి చూపించారు. అయితే భద్రాద్రి తుడి మాస్టర్ ప్లాన్‌కు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సివుంది. సీఎం ఆమోద ముద్ర పడగానే ఆ వెంటనే టెండర్లను ఖరారు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెలలో పనులన్నీ పూర్తి చేసి టెండర్లకు వెళ్లాలని మంత్రి సూచించారు.

పార్థసారధితో ట్రైనీ ఐఏఎస్ అధికారులు భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధితో డా. సచిన్, యోగెందర్‌సింగ్,ఆశికజైన్ ట్రైనీ ఐఏఎస్ అధికారులు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టిన పథకాలు, రైతు రుణమాఫీ, 9గంటలపాటు విద్యుత్, విత్తనోత్పత్తి, మార్కెటింగ్ విధానం, ప్రాజెక్టుల నిర్మాణం వంటి పథకాలను అడిగి తెలుసుకున్నారు


సంపాదకీయం

సబ్సిడీ గ్యాసు

సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ భారత ప్రజలందరి వికాసమే నా లక్ష్యం అని మోడీ ప్రకటించారు. పేదల కిస్తున్న గ్యాస్ సబ్సిడీ ఎత్తివేశారు. ఎల్‌పీజీ గ్యాస్‌ను మరింత భారంగా మార్చారు. వచ్చే ఏడాది వరకు లేదా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సున్నా అయ్యేంత వరకు నెలకు రూ.4లు పెంచాలని నిర్ణయించారు. గత ఏడాది పెట్రోలియం రాయితీలు రూ.27317 కోట్ల నుండి 25 వేల కోట్లకు తగ్గిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్‌కు రూ.16,076.13 కోట్లు రాయితీగా కేటాయించారు. పార్లమెంట్‌లో సబ్సిడీ పద్దు ఆమోదించబడింది. ప్రభుత్వం పార్లమెంట్‌ను లెక్కచేయకుండా మళ్ళీ అదే పార్లమెంట్‌లో సబ్సిడీని రద్దు చేస్తున్నామని ప్రకటించడం అప్రజాస్వామ్యం. అన్యాయం. అంతర్జాతీయ మార్కెట్‌తో గ్యాస్ ధరలను అనుసంధానం చేశారు. ప్రజల బాగోగులను పాలకులు మార్కెట్ శక్తులకు వదిలివేశారు. పర్యావరణ కాలుష్యానికి పరిశ్రమలు వాహనాలే కారణం కాదనీ, ఇండ్లలో వాడే వంట చెరుకు కూడా కారణం అని మొసలి కన్నీరు కార్చినవారే ఇప్పుడీ నిర్ణయం చేసారు. ప్రపంచ వ్యాప్తంగా వంటకోసం బొగ్గు, కట్టెలు, పశు వ్యర్థాలు 43శాతం వాడుతుండగా, భారత్‌లో 50శాతం కుటుంబాలున్నాయని చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు లబ్ధిచేకూర్చేలా 5 కోట్లు ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు మూడేండ్లలో ఇస్తామన్నారు. 80శాతం జనాభాను గ్యాస్ వినియోగ పరిధిలోకి తీసుకువస్తామని కోతలు కోశారు. కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. కోటిన్నర మందికి మొదటి ఏడాది ఉచిత కనెక్షన్లు ఇస్తామని, 18 లక్షలు మాత్రమే ఇచ్చారు. సబ్సిడీ తీసివేసిన తర్వాత పేదలకు వంట గ్యాస్ భారంగా మారే ప్రమాదం ఉన్నప్పుడు వంటకోసం పాత పద్ధతులనే అనుసరించే ప్రమాదం లేకపోలేదు. అప్పుడు ప్రభుత్వం ఏం చెబుతుంది?

> **సబ్సిడీల అర్థం మారిపోయింది. లేనివాడిని కొట్టి ఉన్నవాడికి పెట్టడంగా మారిపోయింది. బడాపెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ పేదల నోళ్లు కొడుతున్నారు. పెద్దల జేబులు నింపుతున్నారు. పాలకుల వివక్షను ప్రజలు అర్థం చేసుకోవాలి. అన్యాయం చేస్తున్నవారిని నిలదీయాలి.**

ఆదాయ వర్గాలు వంటగ్యాస్ రాయితీని వదులుకోవాలని మోడీ పిలుపునిచ్చారు. దానికి "గివిట్ ఆఫ్" అని ముద్దుపేరు పెట్టారు. రాయితీలు వదలుకున్న వారు మరొక పేదవాడికి సబ్సిడీ ఇచ్చినట్టేనని నమ్మబలికారు. ఐదువేల కోట్లు ఆదా అయినట్టు ప్రకటించారు. కొంత కాలం తర్వాత కుటుంబంలో 10 లక్షల ఆదాయం ఉన్నవారు సబ్సిడీ గ్యాసును వదలుకోవాలని హెచ్చరించారు. ఇప్పుడు మొత్తం సబ్సిడీని తీసివేశారు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే సబ్సిడీ గ్యాసుకు మంగళం పాడినట్టు అర్థమవుతున్నది. చాయ్ వాలా కొడుకును నేను



పేదల కష్టాలు తెలుసునాకు అన్న మోడీ, నిజంగానే ఆమ్ ఆద్మీ అయితే గ్యాస్ సబ్సిడీ రాయితీని తీసివేయొద్దు. ప్రజలను పెనం మీద నుండి పొయ్యిలోకి నెట్టకూడదు.

2012 నాటికి రాష్ట్ర ప్రభుత్వాలూ, కేంద్రపాలిత ప్రాంతాలూ వ్యాట్‌ను ప్రవేశపెట్టాయి. యూపీ, బెంగాల్, తమిళనాడు, ఢిల్లీ లాంటి ప్రభుత్వాలు గ్యాస్ మీద వ్యాట్ వేయలేదు. కొన్ని రాష్ట్రాలు 1 నుండి 5 శాతం వరకు పన్నులు వేశాయి. అప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో గ్యాస్‌పై 5శాతం వ్యాట్ వేశారు. సబ్సిడీ ఉపసంహరణ భారంగా మారుతుంది. ఒకవైపు జీఎస్‌టీ మరొక వైపు రాయితీ తీసివేయడం గోడ దెబ్బ చెంపదెబ్బలాగ తయారైంది.

ప్రభుత్వం చక్కెరను చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేయటం నిలిపివేసింది. ఏటా 20.7 లక్షల టన్నుల చక్కెర దారిద్ర్యరేఖకు దిగువనున్న 40 కోట్ల మంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరేది. కేంద్రం రాయితీ కింద రూ.18.50 చెల్లించేది. ఆహార భద్రత చట్టంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వినియోగదారుల విభాగం లేనందున ప్రభుత్వం ఎత్తివేయాలని చూడటం శోచనీయం. పాలకులు చెప్పేవి సాకులు తప్ప మరేమీకావు. చక్కెర సబ్సిడీ ఎత్తివేసి రూ.4500 కోట్ల భారం ప్రజల మీద వేయటం కాషాయ సర్కారుకే చెల్లింది.

బీజేపీ పాలకులు ఏటికేడు రాయితీలు తగ్గిస్తున్నారు. అంకెల రూపంలో చూసినప్పుడు పెరిగినట్టు కనబడినప్పటికీ ఆచరణలో సబ్సిడీ వ్యయాన్ని కుదిస్తున్నారు. జాతీయ స్థూల ఉత్పత్తితో పోల్చినప్పుడు వారి బండారం బట్టబయలవుతుంది. సబ్సిడీలకు 2015-16లో జీడీపీలో 1.90శాతం రాయితీలు కేటాయించారు. నేడు 1.44శాతానికి తగ్గించారు. యూపీఏ-1 ప్రభుత్వ పాలనలో 147 సంక్షేమ పథకాలు ఉన్నాయి. మోడీపాలనలో ప్రస్తుతం 28 ప్రయోజిత పథకాలకు కుదించారు. మిగతా పథకాలను రద్దు చేశారు. కేంద్రం వివిధ పథకాల కింద 28 పథకాలను విభజించింది. 6 పథకాలు అత్యంత కీలకమైనవిగా తేల్చింది. వీటికి వందశాతం నిధులు కేంద్రమే ఇస్తుంది. మరొక 19 పథకాలు ముఖ్యమైనవిగా తేల్చి వీటికి 60శాతం నిధులు ఇస్తుంది. వాస్తవంగా ఈ ఏడు గత సబ్సిడీలు కంటే 5శాతం తగ్గించాలని నిర్ణయించారు. ఒకే దేశం ఒకే పన్ను విధానంతో 3 లక్షల కోట్ల పన్నుల భారం మోపారు.

నిజానికి బలహీనమైన వారిని బలంగా తయారు చేయడానికి, ప్రజలలో ఉన్న ఆందోళన అసంతృప్తిగా మారకుండా పాలకులు సబ్సిడీలను తెరమీదకు తెచ్చారు. కానీ ఇప్పుడు సబ్సిడీల అర్థం మారిపోయింది. లేనివాడిని కొట్టి ఉన్నవాడికి పెట్టడంగా మారిపోయింది. బడాపెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ పేదల నోళ్లు కొడుతున్నారు. పెద్దల జేబులు నింపుతున్నారు. పాలకుల వివక్షను ప్రజలు అర్థం చేసుకోవాలి. అన్యాయం చేస్తున్నవారిని నిలదీయాలి.




డాక్టర్ చుక్కా రామయ్య

ప్రభుత్వ వ్యవస్థల్ని పటిష్టం చేయాలి

రామయ్య మాట

మనది ప్రజాస్వామిక దేశం. అత్యధిక జనాభా కల్గిన రెండో దేశం. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం కల్గిన ఈ దేశంలో అవినీతి, నిరుద్యోగం, పేదరికం, ఆశ్రిత పక్షపాతం, అధికార దుర్వినియోగం, బంధుప్రీతి ఇలా అనేక సమస్యలు ప్రజల్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. ఏ పని కావాలన్నా ఇదివరకైతే సంబంధిత కార్యాలయాలకు వెళ్లడం.. అక్కడి ఆఫీసర్‌ను / సిబ్బందిని కలిసి తమ పనులు కానిచ్చుకోవడం సాఫీగా జరిగిపోయేది. కార్పొరేట్‌రంగం విస్తరణకు ముందునాటి మాటది. కానీ కార్పొరేట్ సంస్థలు యధేచ్ఛగా దేశంలో విస్తరించాక లాబీయింగ్, ఇన్‌ఫ్లూయెన్స్ అనే పదాలకే అధికంగా ప్రాధాన్యం ఏర్పడింది. తద్వారా శాఖాపరంగా జరగాల్సిన ముఖ్య పనులన్నీ ఈ రోజు కేవలం వ్యక్తుల ఇన్‌ఫ్లూయెన్స్ ఆధారంగా కొనసాగుతుండటం ఆందోళనకరమైన పరిణామం. బర్త్ సర్టిఫికేట్ జారీ దగ్గర నుంచి చివరకు నగరాల్లో శ్మశానవాటికలో దహన సంస్కారాలకు కావల్సిన ఆరడుగుల నేల వరకు.. ఇలా అన్ని పనులూ ఏ రాజకీయ నాయకుడో/ అధికారో/ డబ్బున్న పెద్దమనిషో తన ఇన్‌ఫ్లూయెన్స్ వాడటం ఆధారంగానే అవి సాధ్యమవుతున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అధికార యంత్రాంగంలో కొందరు అలాంటి పెద్ద మనుషుల ప్రభావానికి లోనై వ్యవస్థలను బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టమవుతోంది. దీంతో దేశంలో అధిక శాతంగా ఉన్న ప్రజలు తమ పనులు చేసుకోలేక, ఎవరితోనూ చేయించుకొనే అవకాశం లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారం కలిగిన వారి మెహర్బానీల కోసం పనిచేసే వారితో ప్రజలకు కొంత అన్యాయం జరుగుతుంటే.. మరోవైపు నిజాయితీ, వృత్తి పట్ల నిబద్ధత కలిగిన ఎందరో నాయకులు, అధికారులు ఉన్నచోట పేదలకు న్యాయం జరుగుతోంది. కానీ, విశేష అధికారాలు, పటిష్టత కలిగిన మన ప్రభుత్వరంగ వ్యవస్థలు బలహీనపడుతుండటం అత్యంత ఆందోళనకరమైన పరిణామం.

ప్రస్తుత కాలంలో బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా.. దస్త్రాలపై ముఖ్యమైన అధికారుల సంతకాలు కావాలన్నా ఎవరో ఒకరు పెద్దమనిషి ఓ మాట చెబితే పని జరిగిపోతోందనే ఆలోచన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఆ తర్వాత జరిగే పరిణామాలు, వ్యవస్థకు అదెంత ముప్పు తెస్తుందనేది వారు ఆలోచించడం లేదు. అప్పటికి వారి పని అయిపోవాలనే చందంగా పరిస్థితి తయారైంది.



వ్యవస్థలో కొందరు ఉద్యోగులు కూడా అలాగే తయారయ్యారు. లంచాలకు అలవాటుపడిన వారు కొందరైతే.. ఎవరైనా పెద్దమనిషితో చెప్పిస్తేనే పనిచేసే వారు మరికొందరు. దీంతో సామాన్య పేద ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తమ పనుల కోసం ఎటువెళ్లాలో, ఎవరితో చెప్పించాలో తెలియక నరకయాతన అనుభవించేవారు మనకెందరో తారసపడుతుంటారు. ఎవరితోనైనా చెప్పిస్తే మీ పని ఇట్టే జరిగిపోతుందని ఆయా కార్యాలయాల్లోనే కొందరు చెబుతుండటం నిజంగా సిగ్గుచేటు. ఇక అవినీతి విషయం చెప్పనక్కర్లేదు. వికృతరూపం దాల్చి సమాజంలో తీవ్రమైన అసమానతలను తీసుకొచ్చిన మహమ్మారి అది. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఓ బలమైన యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. వ్యక్తుల కంటే వ్యవస్థలకు, వారి నిబంధనలకు ఎక్కువ విలువ ఇవ్వాలి. ప్రతి అధికారిని తన విధుల్ని స్వేచ్ఛగా నిర్వర్తించే అవకాశం ఇచ్చినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుంది. ఇప్పటికీ ఎందరో నిజాయితీ గల అధికారులు రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామిక వ్యవస్థకే పెను ప్రమాదం.

ఉద్యోగులకు కొంత మంది నాయకులు చెప్పిన విధంగా తలలు వూపే విధంగా కాకుండా నిబంధనల ప్రకారం పనిచేసే అధికారాన్ని, స్వేచ్ఛను వారికి సమకూర్చాలి. పేద, ధనిక, కులం, మతం తేడాల్లేకుండా పనిచేసే అధికార యంత్రాంగం రూపొందాలి. అప్పుడే సామాజిక మార్పు సాధ్యమవుతుంది. ప్రజలకు జవాబుదారీగా పనిచేసే అధికారులు కావాలే తప్ప ప్రజలపై పెత్తనం చెలాయించేవారు కాదు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా దాన్ని కూలంకుషంగా అధ్యయనం చేసి వారి సమస్యలపై నిరంతరం పనిచేసే అధికారులతోనే సమాజం మరింత ముందుకెళ్తుంది. అట్టడుగు వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అహర్నిశలు పనిచేసిన ఎస్ఆర్ శంకరన్ లాంటి గొప్ప అధికారుల అవసరం ఈ సమాజానికి ఎంతో ఉంది. అలాంటి గొప్ప వ్యక్తిత్వం, పరిస్థితులతో రాజీపడకుండా నిత్యం ప్రజలతో మమేకమై పనిచేసిన మహనీయుల గురించి నేటి ఉద్యోగులకు తెలియజెప్పాలి. ఆ దిశగా వారిలో ఉత్సాహాన్ని పెంపొందించాలి. వ్యక్తిగత ప్రయోజనాల కన్నా.. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలనే సంకల్పాన్ని వారిలో నూరిపోయాలి. అప్పుడే మెరుగైన సమాజం సాకారమవుతుంది. ప్రజలకు విధేయులుగా కాకుండా అధికారానికి విధేయులుగా ఉండే వారిని ప్రోత్సహిస్తే ఈ సమాజంలో మార్పు ఎండమావే అవుతుంది. ప్రభుత్వ వ్యవస్థల్ని పటిష్ట పరిచి వాటిని పరిరక్షించుకొనే చర్యలతో అందరికీ సమానంగా సేవలు అందించినప్పుడే వాటి స్ఫూర్తి నెరవేరుతుంది.

- ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

తెలంగాణ ఔనో కాదో గానీ, ఇసుకైతే బంగారమే !!



ఎన్. వేణుగోపాల్

తెలంగాణ పాలకులు తెలంగాణను బంగారంగా మారుస్తామని ప్రజలు అడగకుండానే వాగ్దానం చేశారు. బంగారు తెలంగాణగా మార్చడమంటే పాలకులు ఇచ్చుకున్న నిర్వచనం ఏమిటో ఇప్పుడిప్పుడే బైటపడుతున్నది. దేశమంటే మట్టి కాదని, మనుషులని ఎవరు చెప్పినా, బంగారు తెలంగాణగా మార్చే పని మట్టితో, భూమితో మొదలయింది. భూకబ్జాలకు, ఆక్రమణలకు, అక్రమాలకు చెల్లుచీటీ ఇచ్చారు. అక్రమ ఆక్రమణదారులను సమర్థించారు. తప్పని పరిస్థితులలో నాలుగురోజులు ఆర్భాటం చేసి ఆ తర్వాత మరిపించారు. ఈ బంగారు భూమి ఉదాహరణలు గత మూడేండ్లలో గురుకుల్ ట్రస్ట్, అయ్యప్ప సొసైటీ, ఎన్ కన్వెన్షన్, నయీం ఆక్రమణలు, మియాపూర్, గచ్చీబౌలి, ఘాంసిమియాగూడ, ఇబ్రహీం పట్నం వగైరా వగైరా చెప్పలేనన్ని పేరుకుపోయాయి.

> **ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఇసుక తవ్వకాల మీద దర్యాప్తు జరిపి నివేదిక ఇమ్మని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం మేరకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 2017 మే మూడో వారంలో సమర్పించిన నివేదికలో చాల స్పష్టంగా తెలంగాణ ప్రభుత్వం మానేరు, మ్రోయుతుమ్మెద, గోదావరిలలో పూడిక తీత పేరుతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నదని, ఈ విధానం అక్రమమైనదని, సమర్థనీయమైనది కాదని వ్యాఖ్యానించింది. ఆ**

మట్టికి మరో రూపం ఇసుక గనుక ఇప్పుడిక ఇసుకను బంగారం చేసేపని మొదలయింది. తెలంగాణను బంగారం చేయడం ఎలా ఉన్నా, ఇసుక బంగారు బాతుగుడ్లను పరిరక్షించే ఉద్యమమే మొదలయింది. అందుకే తెలంగాణను వ్యతిరేకించినవాళ్ళు, అడ్డుపడినవాళ్ళు, రాకుండా కుట్రలు చేసినవాళ్లు కూడ ఏలినవారికి పనికొస్తున్నారు గాని, ఇసుక రవాణాకు అడ్డుపడినవాళ్లు మాత్రం నేరస్తులైపోయారు. లారీలు ఎక్కించి చంపవలసిన మనుషులుగా కనబడుతున్నారు. ఇసుక రవాణా వద్దన్న నేరానికి, మనుషులను చంపే ఇసుక లారీలను, కంట్రాక్టర్లను శిక్షించాలన్న పాపానికి వేధింపులకు గురి కావలసి వస్తున్నది. లాకప్పుల్లో రోజుల తరబడి చిత్ర హింసలు, కరెంటు షాకులు, రోకలిబండలు, అక్రమ కేసులు - ఎమర్జెన్సీలో, పాత ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులకు తెలిసిన అన్ని పద్ధతులూ యథాతథంగా అమలు అవుతున్నాయి.

ఈ వ్యవహారంలో రాజకీయ వివాదాలు ప్రవేశించడంతో తాజాగా జరిగిన చిత్రహింసలు, అక్రమ కేసులు, పౌరహక్కుల సమస్య, దళితులమీద దాడి వంటి అంశాల మీదనే ఎక్కువ చర్చ జరుగుతున్నది. ఎప్పుడో ఒకసారి ఇసుక లారీ ప్రమాదంలో మరణించినవారి ప్రస్తావన వస్తున్నది. కాని అసలు ఈ వ్యవహారానికంతటికీ మూలమైన ఇసుక సక్రమ, అక్రమ రవాణా, ఇసుక కంట్రాక్టర్లు, ఇసుక రాజకీయార్థిక విషయాల చర్చ రావలసినంతగా రావడం లేదు.


ఇసుకను బంగారం అని కూడ పిలుస్తారు. నిజంగానే ఇటీవలి కాలంలో ఇసుక బంగారం విలువ విపరీతంగా పెరిగి, సమస్త అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఇసుక మాఫియా చేతుల్లో సాధనాలుగా మారిపోయాయి. ఇతర ఖనిజాల తవ్వకం లాగ ఇసుక తవ్వకాలు ప్రమాదకరమైనవిగా కనిపించవు గాని నిజానికి ఆ ఖనిజాల తవ్వకాలకు ఎంత తీవ్రమైన పర్యావరణ, సామాజిక, రాజకీయార్థిక పర్యవసానాలు ఉన్నాయో ఇసుక తవ్వకానికి కూడ అంతే తీవ్రమైన పరిణామాలున్నాయి. బహుశా ఎక్కువే కూడ ఉండవచ్చు. ఇతర ఖనిజాలన్నీ ఎక్కడో ఒకచోట నిర్దిష్టంగా ఉంటాయి గాని ఇసుక దేశవ్యాప్తంగా ఉన్న నదుల్లో, ఉపనదుల్లో, ఏరుల్లో, వాగుల్లో, సముద్రతీరాల్లో ఎక్కడైనా దొరుకుతుంది. అందువల్ల ఇతర ఖనిజాల మాఫియాల్లాగ ఇసుక మాఫియా కొన్ని రాష్ట్రాలకూ, కొన్ని ప్రాంతాలకూ పరిమితమైనది కాదు. ఇది ఎక్కడికక్కడ స్థానికమైనదే గాని దేశవ్యాప్తమైనది. అంటే మిగిలిన మాఫియాల కన్న బలమైనది. పైగా ఇది చెప్పలేనంత లాభసాటి వ్యాపారం గనుక ఇందులో అక్రమాలు, బెదిరింపులు, హత్యలు, దొంగతనాలు, లంచగొండితనం, రాజకీయ నాయకుల, పోలీసు, రెవెన్యూ, అటవీ అధికారుల లాలూచీ చాల ఎక్కువగా ఉన్నాయి.

తెలంగాణాణ్యం

దేశంలో అక్రమ ఇసుక వ్యాపారపు మాఫియా ఎంత బలమైనదీ, ఎంత సంపన్నమైనదీ అంటే అది చాలచోట్ల ప్రభుత్వాలనే శాసిస్తున్నది. కర్నాటకలో ఐఎఎస్ అధికారి అనుమానాస్పద మరణం, మధ్యప్రదేశ్‌లో ఒక ఉన్నతాధికారి మీదికి లారీ ఎక్కించి హత్య చేయడం, ఉత్తరప్రదేశ్‌లో ఒక ఐఎఎస్ అధికారిణి బదిలీ, ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ఇసుకను పట్టుకున్న అధికారుల బదిలీలు, ఎన్నో రాష్ట్రాలలో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న అధికారుల మీద దాడులు, ఇసుక అక్రమ వ్యాపారం బైటపెట్టిన జర్నలిస్టుల మీద దాడులు వంటి ఘటనలు ఎడాపెడా జరుగుతున్నాయి. అయితే ఈ దాడులన్నీ అక్రమ ఇసుక వ్యాపారాన్ని, రవాణాను అరికట్టాలనో, నియంత్రించాలనో అనుకునే అధికారుల మీద, జర్నలిస్టుల మీద మాత్రమే. అలా అనుకునేవాళ్లు ఎక్కువమంది ఏమీ లేరు. సాధారణంగా స్థానిక రాజకీయ నాయకులు, అధికారులు, గ్రామీణ పెత్తందార్లు, పాత్రికేయులు కూడ ఇసుక మాఫియా ముడుపులు పొందే జాబితాల్లో ఉంటారు. ఇసుక అక్రమ రవాణాను చూసీ చూడనట్టు పోనిస్తారు.

ఈ దేశవ్యాపిత చిత్రంలో భాగంగానే తెలంగాణ ఇసుక మాఫియాను చూడాలి. గత రెండేండ్లలో నేరెళ్లకు చెందిన ముగ్గురు, జిల్లెల్లకు చెందిన ఒకరు ఇసుక లారీల కింద పడి మరణించడం, గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, జూలై 2న మళ్లీ ఇసుక లారీ గుద్దుకొని భూమయ్య మృతి చెందడంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుని ఇసుక లారీల మీద దాడి జరిగింది. రెండేండ్లుగా ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని పోలీసులు వెంటనే రంగంలోకి దిగి నేరెళ్ల నుంచి ఎనిమిది మంది యువకులను తీసుకుపోయి, భయంకరమైన చిత్రహింసలకు గురి చేశారు. అక్రమ కేసు బనాయించి జైలుకు పంపారు. తగులబడిన ఇసుక లారీల యజమానుల, ఇసుక అక్రమ రవాణాదారుల తరఫున అత్యుత్సాహం ప్రదర్శించి కుటుంబ సభ్యుల మీద దౌర్జన్యాలు చేశారు. తప్పుడు కేసులు పెడతామని బెదిరించారు. ఈ దౌర్జన్యానికి కారణం ఇసుక తవ్వకాల నుంచి ఆదాయం రాబట్టదలచుకున్న ప్రభుత్వం, కొంత సక్రమ అనుమతి పొంది, మరి కొంత అక్రమ రవాణా ద్వారా ఇబ్బడి ముబ్బడిగా లాభాలు సంపాదిస్తున్న కాంట్రాక్టర్లు. ఆ కాంట్రాక్టర్లలో ఏలినవారికి సన్నిహిత బంధువులు, ఆశ్రితులు ఉండడం అదనపు ఉత్సాహానికి కారణం.

పాత ఇసుక తవ్వకాల విధానం వల్ల ప్రభుత్వానికి తక్కువ ఆదాయం వచ్చేదనీ, తెలంగాణ ఏర్పడ్డాక విధానం మార్చినందువల్ల హఠాత్తుగా అది పెరిగిందని ఈ వివాద ప్రాంతపు శాసనసభ్యుడు కూడ అయిన పరిశ్రమల, గనుల శాఖ మంత్రి అంటున్నారు. 2014లో రూ.10 కోట్లు మాత్రమే ఉండిన ఆదాయం, 2015-16లో రూ.374 కోట్లకు, 2016-17లో రూ.419 కోట్లకు పెరిగిందని ఆయన అన్నారు. ఈ అంకెల లోగుట్టు తర్వాత చూడవచ్చు గాని, ప్రభుత్వ సంపాదననూ, ఇసుక అమ్మకాల ద్వారా కాంట్రాక్టర్ల సంపాదననూ పోల్చిచూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బైటపడతాయి.



ప్రస్తుతం వివాదం వచ్చిన జిల్లాను మాత్రమే చూస్తే, ఇక్కడ మిడ్ మానేరు ఆనకట్ట కింద మునిగిపోయే ఎనిమిది గ్రామాల్లో, మానేరు, మూలవాగుల్లో అపారమైన ఇసుక ఉన్నదని, దాన్ని తవ్వి తీయాలని ప్రభుత్వం తలపెట్టింది. తాను చేపట్టనున్న నీటిపారుదల పథకాలకు, గృహనిర్మాణ, రహదారి, మౌలిక సౌకర్యాల పథకాలకు చాల ఇసుక అవసరం అవుతుందని, అలాగే ప్రయివేటు గృహనిర్మాణ సంస్థలకు, వ్యక్తులకు కూడ అమ్మవచ్చునని భావించింది. ఈ ఇసుక వ్యాపారం రాష్ట్ర ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ ప్రాంతంలో కొడుముంజ, కొదురుపాక, కాజీపూర్ అనే మూడు క్వారీలున్నాయి. ఒక్కొక్క క్వారీకి రోజుకు సగటున 2000 ఘనపు మీటర్ల ఇసుక చేరుస్తున్నారు. ఒక లారీ సగటున 20 ఘనపు మీటర్ల ఇసుకను తీసుకువెళ్లగలుగుతుంది. అంటే ఒక్కొక్క క్వారీ నుంచి రోజుకు 1000 లారీల ఇసుక బైటికి తరలుతుంది. ప్రభుత్వం ఒక ఘనపు మీటర్ ఇసుకకు రూ.600 వసూలు చేస్తుంది. అంటే ఒక లారీకి ప్రభుత్వానికి సగటున రూ.12,000 ఆదాయం ఉంటుంది. (ఈ ఆదాయం రూ.8,250 అని కాంగ్రెస్ ప్రకటించింది). బైట మార్కెట్‌లో సాధారణంగా లారీల లెక్కన గాని, టన్నుల లెక్కన గాని ఇసుక అమ్ముతారు. సగటున ఒక టన్ను బరువు తూగే ఇసుక 0.65 ఘనపు మీటర్లు ఉంటుంది. అంటే ఒక లారీలో సగటున 30 టన్నులు ఉంటుంది. ఇసుక రకాన్ని బట్టి టన్నుకు రూ.1500 నుంచి రూ.1900కు అమ్ముతున్నారు. అంటే ఒక లారీ ఇసుక అమ్మితే కంట్రాక్టర్‌కు రూ.45,000 నుంచి రూ.57,000 ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి అత్యధికంగా రూ.12,000 చెల్లించినా, లారీ అద్దె, డీజిల్, డ్రైవర్, కూలీలు ఖర్చులన్నీ మరొక రూ.10,000 అనుకున్నా, ఒక్కొక్క లారీ మీద కాంట్రాక్టర్‌కు కనీసం రూ.23,000 నుంచి రూ.35,000 లాభం ఉంటుంది. ఇందులో స్థానిక శాసనసభ్యుడు, రాజకీయ నాయకులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, మార్గమధ్యంలో అధికారులు మొదలైనవారందరికీ వాటాలు ఇచ్చినా కాంట్రాక్టర్‌కు లారీకి పది పదిహేను వేల రూపాయలు మిగులుతాయి. ఈ లెక్కన కాంట్రాక్టర్లు ఎంత సంపాదిస్తున్నారో, నిర్ణయాధికారం ఉన్నవారిని, ప్రభుత్వాన్ని కూడ వారు తమ గుప్పెట్లో ఎట్లా బంధించగలరో అర్థమవుతుంది.

ప్రాణాలకు తెగించి ఇసుక అక్రమరవాణాను చిత్రీకరించి భారతదేశంలో ఇసుక మాఫియా అక్రమ వ్యాపారాల గురించి 2017 మార్చిలో ఒక పరిశోధనాత్మక కథనం వెలువరించిన ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపనీ (ఏబీసీన్యూస్) భారతదేశంలో విజృంభిస్తున్న నిర్మాణ పరిశ్రమ రూ.7,70,000 కోట్ల విలువైనదని, అది మూడున్నరకోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నదని, ఆ వ్యాపారానికి కీలకమైన ముడిసరుకు ఇసుకేనని రాసింది. అంటే దేశవ్యాప్తంగా ఇసుక వ్యాపారం కనీసం రెండు లక్షల కోట్ల రూపాయలదై ఉంటుంది, అందులో సగం అక్రమ వ్యాపారమే. అదే ఇసుక మాఫియా బలం.

వివిధ రాష్ట్రాల హైకోర్టులనుంచి సుప్రీం కోర్టు దాకా ఎన్నెన్నో న్యాయస్థానాలు పర్యావరణ కారణాలతో ఇసుక తవ్వకాన్ని నిషేధిస్తూ, ఆంక్షలు విధిస్తూ ఎన్నో తీర్పులు ఇచ్చాయి. పర్యావరణ మంత్రిత్వ శాఖలు, పర్యావరణ విభాగాలు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి సంస్థలు ఎన్నో నిబంధనలు విధించాయి. పర్యావరణ అనుమతి లేకుండా ఇసుక తవ్వగూడదని, తవ్వకానికి యంత్రాలను ఉపయోగించగూడదని, ఇసుక రీచ్‌ల నుంచి బైటికి ఎడ్లబళ్లలో మాత్రమే రవాణా చేయాలని, ఇసుక లారీలు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 దాకా మాత్రమే తిరగాలనీ, రాత్రి పూట తిరగగూడదనీ, ఒక మీటర్ కన్న ఎక్కువ లోతుకు తవ్వగూడదని, పూడికతీత పేరుతో ఇసుక తవ్వగూడదని ఈ నిబంధనలు చెపుతున్నాయి. కాని ఇసుక మాఫియా చెప్పుచేతల్లో నడుస్తున్న ప్రభుత్వాలు ఆ తీర్పులనూ, నిబంధనలనూ బేఖాతరు చేస్తున్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఇసుక తవ్వకాల మీద దర్యాప్తు జరిపి నివేదిక ఇమ్మని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం మేరకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 2017 మే మూడో వారంలో సమర్పించిన నివేదికలో చాల స్పష్టంగా తెలంగాణ ప్రభుత్వం మానేరు, మ్రోయుతుమ్మెద, గోదావరిలలో పూడిక తీత పేరుతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నదని, ఈ విధానం అక్రమమైనదని, సమర్థనీయమైనది కాదని వ్యాఖ్యానించింది. ఆ అక్రమానికి తార్కిక ఫలితమే నేరెళ్ల ఘటన.

సెల్: 9848577028

- సంచారీ చటోపాధ్యాయ్

ప్రత్యామ్నాయం చూపుతున్న కేరళ

ఆహార 'శిల్పులు' (రైతులు) తిన్నారా? రెండు పూట్ల కాకపోతే ఒక పూటైనా!

వారు ఉన్నారా, ఊడేరా? ఎంతైనా ఉద్యమించండి, నిరసనలో ఆలుగడ్డలు, ఉల్లిపాయలు, పాలు ఎంతయినా రోడ్లపాలు చేయండి. పోలీసు తుపాకులకు ఎన్ని ప్రాణాలనైనా హరించుగాక! వ్యవసాయ సంక్షోభం గురించి దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళనలు చిరుదీపంలాగే మిగిలాయి. కేంద్రం దృష్టి సారించాల్సి ఉంది. కానీ వారు నిర్లిప్త ధోరణితో ఉన్నారు. దేశంలో ఇతర నాలుగు రాష్ట్రాలలాగే కేరళ కూడా ఇదే సంక్షోభం చవి చూస్తోంది. బీజేపీ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో ఏ స్థాయిలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారో, కేరళలో అలాంటి చిత్రం ఇంచుమించు దుర్లభం.

కేంద్ర విధానాల పుణ్యమా అని కొద్దో గొప్పో దేశంలో ప్రతి రాష్ట్రం వ్యవసాయ సంక్షోభంతో కుదేలవుతున్నది. ఆ అననుకూలత మధ్య కూడా వ్యవసాయ సంక్షోభం నివారణకు కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోంది.

భారతదేశంలో అత్యధికులు వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నారు. కానీ కాలం గడిచిన కొద్దీ వారి దుస్థితి తీవ్రరూపం దాలుస్తోంది. పంట నష్టం, ధర లేకపోవటం, రుణ మాఫీ చేయకపోవటం, అభివృద్ధి పేరిట సాగు భూమి కుదింపు ఇలా రైతుల కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. వారితో పాటే రైతు కూలీలు కూడా ఇదే ఊబిలో కూరుకుపోతున్న పరిస్థితి. ఈ పరిస్థితిలో పోరాడుతోంది కేరళ. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలవటానికి నిబద్ధతతో ఉంది. పినరయి విజయన్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా రైతులకు సౌకర్యాలు కల్పించే ప్రయత్నం చేస్తోంది. రైతు కూలీలు, రైతుల స్వయం పోషణ, అభివృద్ధిని పెంచటానికి వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది, అనుసంధానం పెంచటానికి ప్రయత్నిస్తోంది.

ఆహారం కోసం ప్రధానంగా ఇతర రాష్ట్రాలపై కేరళ ఆధారపడి ఉన్నది. ఇంకా చెప్పాలంటే తృణ ధాన్యాలు, కూరగాయల కోసం కూడా ఆ రాష్ట్రం ఇతరులపై ఆధారపడాల్సిందే. ఇతర రాష్ట్రాలలాగే కేరళలో కూడా ప్రధాన ఆహారం వరిధాన్యం. కానీ వాస్తవానికి అవసరమైన దానిలో పదోవంతు కూడా ధాన్యం కేరళలో పండదు. ఉత్పత్తి పెరగకపోతే కేరళ స్వయం పోషణ కూడా పెరగదు. ముఖ్యంగా ధాన్యం పండించడానికి సాగు విస్తీర్ణం పెంచకపోతే స్వయంపోషక వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించటం కష్టం. ఇదే కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ కర్తవ్యం.

ఇంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కేరళలో 'ప్యాడియాండ్ వెట్‌ల్యాండ్ కన్సర్వేషన్ యాక్ట్' (ధాన్యం, తడిభూమి సంరక్షణ చట్టం) చేసింది. కానీ తర్వాత అధికారానికి వచ్చిన యూడీఎఫ్ ప్రభుత్వం దాన్ని పక్కకి నెట్టింది. దీనివల్ల ఉత్పత్తికి పనికొచ్చే భూమి కుదించుకుపోతోంది. ఇప్పుడు ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మళ్లీ ఆ చట్టాన్ని పరిశీలించింది. తడి భూమి సంరక్షణ కార్యక్రమం ద్వారా సుమారు 4.27 హెక్టార్ల భూమి అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఉత్పత్తికి పనికొచ్చే భూమి విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ భూమంతా భవిష్యత్తులో ఎన్నడూ సంకోచించకుండా చట్టం సహాయం తీసుకునే డేటా బ్యాంకు తయారుచేస్తోంది. కేరళ సీపీఐ(ఎం) నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం ఉత్పత్తి పెంచటంలో విజయం సాధించడం గమనార్హం. ఇంచుమించు 3వేల ఎకరాల మాగాణి, 15వేల ఎకరాల మెట్ట భూమిలో ధాన్యం సాగవుతోంది. గత ప్రభుత్వం అరుణాములాలో సుమారు 252 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు కోసం ధ్వంసం చేసింది. పరిసరాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కేరళ ప్రభుత్వం పథనామతిట్టా జిల్లాలోని ఆ భూమిలో తిరిగి వ్యవసాయం మొదలు బెట్టింది. చట్ట విరుద్ధ భూ కబ్జాదారులు పర్యాటక, రియల్ ఎస్టేట్ పేరుతో అలెప్పీలో మేథరాన్ సరస్సుని కబ్జా చేశారు. ఈ 300 ఎకరాలు, రాని చిథిరా సరస్సు తాలూకా 500 ఎకరాల భూమిలో కూడా అదే తరహాలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి.



కేరళ అంతటా ప్రతి జలాశయం నుండి పూడిక తీయటానికి, వాటిని శుభ్రంగా ఉంచటానికి 'ద హరిత కేరళా మిషన్' అమలు చేసింది. నదులు, చెరువులు, సరస్సులు అన్నింటి విషయంలోనూ ఈ పథకం అమలు చేసింది. కేవలం తడి భూమిని శుభ్రపర్చటమే కాక పూడిక తీయటం, మురికి నీరు తరలించటం, ఉత్పత్తికి ఉపయోగపడేలా భూమి వైశాల్యాన్ని పెంచటం కూడా ఈ పథకం పరిధిలో ఉన్నాయి. పునరుద్ధరించిన భూమిలో కూరగాయలు పండిస్తున్నారు. రైతులను స్వయం పోషకులుగా మార్చే పనిలో ఇది కూడా ఒక భాగమే. వివిధ సాగు భూమి, జలాశయాలు ఇప్పటికే పునరుజ్జీవమయ్యాయి. అక్షరాస్యత విజన్, ప్రజాస్వామిక వికేంద్రీకరణ, సాధారణ ప్రజల ప్రణాళిక ఆధారంగా ఈ పథకంలో సామాన్య ప్రజల అనుసంధానాన్ని పెంచటం జరుగుతున్నది. పంటకు మార్కెట్ కూడా అవసరం. పంటకు సరైన ధర లభిస్తేనే వ్యవసాయ భూమిని పెంచటం సముచిత మవుతుంది. ఓనం, చిహూ, రంజాన్, క్రిస్టమస్ వంటి సామాజిక ఉత్సవాల్లో ప్రత్యేక మేళాలతో విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేసింది. ఇంతేకాక పండుగల సందర్భంలో ప్రతి పంచాయతీ ప్రాంతంలో ప్రత్యేక దుకాణం ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పంట అమ్మటం జరుగుతున్నది.

ఉత్పత్తి, అమ్మకం ఎంత ముఖ్యమో, రైతుల ఆదాయం సుస్థిరం చేయటం కూడా అంతే ముఖ్యం. దేశం మొత్తంమీద రైతులు, వ్యవసాయ కూలీలకు ఏమాత్రం లాభసాటిగా కనపడనప్పుడు, కేరళ ప్రతినెలా రైతుల కోసం రూ.1100 పెన్షన్ పెంచింది. దాంతోపాటే ప్రకృతి వైపరీత్యాల్లో ఎక్కువ సందర్భాల్లో రైతుల రుణం మాఫీ చేసింది. పంట బీమా, ఆపద కాల సహాయ నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయిచిది. దీనివల్ల పంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలలో రైతులకు అవసరం మేరకు నష్టపరిహారం ఇవ్వటానికి వీలుంటుంది. గిరిజన ప్రాంత రైతుల కోసం రూ.20 కోట్లతో ఒక ప్రత్యేక పథకం అమలు చేశారు. రైతులతో సంబంధం ఉన్నవారికి కనీస భత్యం, బీమా ఏర్పాటుకు కేరళ ప్రభుత్వం ముందుకెళుతోంది. అదే సమయంలో ఒప్పందం ఆధారంగా వ్యవసాయ పనుల విషయంలో ప్రోత్సహిస్తోంది. దీనివల్ల వ్యవసాయ సంబంధాలు మెరుగవుతాయి.

కేరళలో కూడా వ్యవసాయ భూమి లేకపోవటం, అన్యాక్రాంతం కావటం రైతులకు ఒక పెద్ద సమస్య. ఎంతోమంది రైతులకు ఇండ్లు లేవు. భూమిలేని, ఇల్లు రైతులకు ఇంటి నిర్మాణానికి కేరళ నడుం బిగించింది. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 20 వేల మంది అన్నదాతలకు భూమి పంచింది.

అనువాదం : వేదుల రామకృష్ణ



కళ... ఏదో ఒక రూపంలో ప్రతి ఒక్కరిలో దాగి ఉంటుంది. లోలోపల దాగిన కళ అవకాశాలను బట్టి బయటకు వస్తుంది. మనసులోని భావాలను బట్టి జీవం పోసుకుంటుంది. అలాంటి కళ కొందరికి హాబీ అయితే మరికొందరికి ప్రాణం. అలాంటి వారిలో డాక్టర్ స్నేహలత ప్రసాద్ ఒకరు. తనలోని అందమైన భావాలకు సజీవ సాక్ష్యాలు ఆమె చిత్రాలు. రంగుల్లోనే కాదు, రాళ్ళల్లోనూ వాస్తవాలను మన కండ్లముందు నిలబెడుతున్న అద్భుత శిల్పి ఆమె. త్వరలోనే వరల్డ్ ఏషియా ఉమెన్స్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకోబోతున్న ఆమెను మానవి పలకరించింది...

మనసులోని భావాలకు సజీవ సాక్ష్యాలు





అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలి

మన దగ్గర అందమైన శిల్పాలు ఎన్నో ఉన్నాయి. కానీ మనవాళ్ళేమో వాటిని వెదుక్కుంటూ యూరప్ వెళుతుంటారు. స్టోన్ ఆర్ట్‌లో మన దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని నా కోరిక. తెలంగాణ రాష్ట్రంలోని పార్కులు, ప్రధాన కేంద్రాలలో నేను చెక్కిన బొమ్మలు పెట్టాలి. ఇప్పటి వరకు శిల్పాలు చెక్కాలంటే జోద్‌పూర్ వెళ్ళాల్సి వచ్చేంది. క్యాంప్ ఉన్న ప్రతి సారి పదిహేను, ఇరవై రోజులు అక్కడే ఉండిపోయేదాన్ని. అప్పుడు పిల్లలకు దూరంగా ఉండడం చాలా కష్టంగా ఉండేది. అక్కడకు, ఇక్కడకు తిరగడం చాలా ఇబ్బంది. అందుకే ప్రస్తుతం ఇక్కడే ఓ ఆర్ట్ గ్యాలరీ పెట్టబోతున్నాను. మరో రెండు నెలల్లో అది ప్రారంభం కాబోతుంది.

స్నేహలత రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో జన్మించారు. తల్లి లీలాదేవి. తండ్రి దివాన్‌సింగ్. చిన్నప్పటి నుంచి పెయింటింగ్ అంటే అమితమైన ఆసక్తి. తెల్లకాగితం దొరికితే చాలు రంగులతో నింపేవారు. అయితే తండ్రికి ఇది నచ్చలేదు. కూతురు చదువులో ఎక్కడ వెనబడిపోతుందో అని ఆయన భయం. ఒక్కోసారి కోపంతో ఆమె గీసిన బొమ్మలను చించిపడేసేవారు. అయితే తల్లి మాత్రం స్నేహలతను ప్రోత్సహించేవారు. ఆమె కూడా ఆర్టిస్టే. అయితే చిన్నతనంలోనే పెండ్లి కావడంతో తన ఇష్టాలను, కోరికలను చంపుకోవల్సి వచ్చింది. అందుకే కూతురు ఆ రంగంలో ఎదుగుతుంటే తనే ఎదిగినంతగా ఆనందించేది. కూతురి కోసం భర్తతో వాదించేది.

తల్లి ప్రోత్సాహంతో...

అలా తల్లి ప్రోత్సాహంతో స్నేహలత స్కూల్ స్థాయి నుంచే ప్రతి కాంపిటీషన్‌లో పాల్గొని బహుమతులు తెచ్చుకునేది. కూతురిని డాక్టర్ చేయాలని తండ్రి కోరిక. అందుకే ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో చేర్చారు. కానీ స్నేహ మనసు ఎప్పుడూ బొమ్మలు, రంగుల చుట్టూనే తిరిగేది. ప్రకృతి, అమ్మాయిలు, అందం ఇలా తన ప్రతి చిత్రంలో వాస్తవికత ఉట్టి పడేది. పెయింటింగ్‌లో కూతురి టాలెంట్‌ను గమనించిన తండ్రి చివరకు చదువు విషయంలో నిర్ణయం ఆమెకే వదిలేశాడు. దాంతో స్నేహ డిగ్రీలో బీఎఫ్‌ఏ పూర్తి చేసి ఉదయ్‌పూర్‌లో ఎంఎఫ్‌ఏ చేశారు. తర్వాత జైపూర్ యూనివర్సిటీలో పాశ్చాత్య దేశాల చిత్రాలకు, మన దేశ చిత్రాలకు మధ్య తేడాలపై పీహెచ్‌డీని ఎంతో కష్టపడి రెండేండ్లలో పూర్తి చేశారు. అలాగే ఫారెన్ ట్రేడ్ కోర్స్ కూడా పూర్తి చేశారు. రాజస్థాన్‌లో సొంతంగా ఓ ఆర్ట్‌గ్యాలరీ కూడా ఏర్పాటు చేసుకున్నారు.

టాప్ టెన్‌లో...

'మా దగ్గర ఆడపిల్లలకు ఎప్పుడు పెండ్లి చేసి పంపిద్దామా? అనే తల్లిదండ్రులు ఎక్కువగా ఆలోచించేవారు. కనీసం బయటకు కూడా పంపేవారు కాదు. అలాంటి చోట అమ్మ నాకు సపోర్ట్ ఇచ్చింది. అమ్మ లేకపోతే ఈ రోజు ఇలా మీ ముందు కూర్చోగలిగేదాన్ని కాదు' అంటూ తల్లి తనకు ఇచ్చిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు స్నేహలత. తన అందమైన చిత్రాలతో రాజస్థాన్‌లోని టాప్ 10 పెయింటర్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అందం, ప్రకృతికి ప్రాధాన్యం ఇచ్చే ఆమె పెయింటింగ్స్‌కు రాజస్థాన్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. 64 ఫీట్స్ కాన్వాస్‌పై అతి పెద్ద చిత్రాన్ని గీసి ఆర్టిస్టుగా చరిత్ర సృష్టించారు. ఎన్నో అవార్డులను సైతం అందుకున్నారు. ప్రకృతిపై ఆమెకున్న అమితమైన మమకారం తను గీసే ప్రతి చిత్రంలో కనిపిస్తుంది. 'రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుంది. అందమైన ప్రకృతి కనుమరుగయ్యే ప్రమాదం రాబోతుంది. ప్రకృతి ప్రసాదించిన అందాల్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. అందుకే నా చిత్రాలన్నీ ప్రకృతితో ముడిపడి ఉంటాయి' అంటారు స్నేహలత.



పనితోనే సమాధానం

మన దేశంలో శిల్పాలు చెక్కుతున్న మహిళల సంఖ్య చాలా తక్కువ. కారణం ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. ఎండలో నిలబడి గంటల కొద్ది చేయాలి. దుమ్ము, విపరీతమైన వేడి ఉంటుంది. అందుకే చాలా మంది మహిళలు ఈ పని మేము చేయలేమేమో అని ఎంచుకోడానికి భయపడతారు. కొంతమందికి చేయాలని ఉన్నా ఇంట్లో సహకారం ఉండదు. పైగా ఇలాంటి క్యాంప్‌లకు వెళ్ళేటప్పుడు చుట్టూ మగవాళ్ళే ఎక్కువగా ఉంటారు. ఇప్పటి వరకు నేను ఎన్నో రాష్ట్రాలకు వెళ్ళాను. చాలా చోట్ల మహిళను నేనొక్కదానే ఉంటాను. మగాళ్ళు కూడా ఆడవాళ్ళు అనేసరికి తక్కువగా చూస్తారు. ఈ అమ్మాయి ఏం చేస్తుందిలే అనుకుంటారు. మనం వాళ్ళ సాయం అడగాలని ఎదురు చూస్తుంటారు. అలాంటి వారందరికి సమాధానం నేను నా పనితోనే చెబుతాను. మనం చేసే శ్రమే మనలో నమ్మకాన్ని పెంచుతుంది. దీన్ని ఎప్పటికీ నమ్ముతాను. బొమ్మలు గీయడం అమ్మ నుంచి వస్తే, సమాజాన్ని ధైర్యంగా ఎదుర్కోవడం డిఫెన్స్‌లో పని చేసిన నాన్న నుండి వచ్చింది. సమాజానికి సేవ చేయడం నా భర్త ప్రసాద్ నుంచి నేర్చుకున్నాను.

దారి చూపిన సిమ్లా వర్క్‌షాప్

ఓ స్నేహితుని ద్వారా నిజామాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రసాద్‌తో పెండ్లి కుదిరింది. 2004లో పెండ్లి చేసుకుని మొదటిసారి హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. బాబు, పాప పుట్టారు. ఎనిమిది సంవత్సరాలు పిల్లల ఆలనా పాలనతో సరిపోయింది. తర్వాత మళ్లీ తన కళను ప్రారంభించాలనుకున్నారు. 'రొమాంటిసైజ్ నేచర్' పేరుతో తను గీసిన బొమ్మలతో హైదరాబాద్‌లో ఎగ్జిబిషన్ కూడా పెట్టారు. బొమ్మలైతే వేస్తున్నారు. కానీ తృప్తి లేదు. కొత్తగా ఏదో చేయాలనే తపన. ఏం చేయాలో అర్థం కాలేరు. ఆలా మనసు మదనపడుతున్న సమయంలో 2013లో సిమ్లాలో ఓ ఆర్ట్ వర్క్‌షాప్‌కు వెళ్ళారు. అక్కడకు వెళ్ళినపుడు తెలిసింది తన మనసు ఏం కోరుకుంటుందో. ఆ వర్క్‌షాప్‌లో మొదటిసారి స్టోన్ వర్క్ చేస్తున్న కళాకారులను చూశారు. వారు అందమైన శిల్పాలు చెక్కుతుంటే, తను కూడా అలాంటివి చేయాలని నిర్ణయించుకున్నారు. అంతే స్నేహితుల సహకారంతో తనకు తానో సొంతంగా శిల్పాలు చెక్కడం ప్రారంభించారు.

శ్రమలోనే తృప్తి, ఆనందం...

శిల్పాలు చెక్కడమంటే మామూలు విషయం కాదు. ఎంతో కష్టంతో కూడుకున్న పని. ఎండా, వేడి, ఉలి, మిషిన్ శబ్దాలు, దుమ్ము... వీటన్నింటినీ తట్టుకుంటూ శ్రమిస్తేనే ఓ అందమైన శిల్పం సృష్టించబడుతుంది. స్నేహలత ఒక శిల్పం చెక్కడం ప్రారంభించారంటే దాన్ని పూర్తి చేసే వరకు వదిలిపెట్టారు. చిన్న తేడా వచ్చినా రాజీపడరు. తను అనుకున్న విధంగా ఆ శిల్పం తీర్చిదిద్దే వరకు శ్రమిస్తూనే ఉంటారు. అలా ఇప్పటి వరకు 60 శిల్పాల వరకు చెక్కారు. వాటిలో ఆరున్నర అడుగులు, తొమ్మిదిన్నర అడుగులు, పన్నెండున్నర అడుగుల శిల్పాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ఆమె పెయింటింగ్స్ కన్నా శిల్పాలు చెక్కడంపైనే ఎక్కువగా దృష్టిపెట్టారు. 'ఇంత శ్రమిస్తున్న నాకు ఎలాంటి కష్టం లేదు. ఈ శ్రమలోనే తృప్తి, ఆనందం ఉన్నాయి' అంటారు స్నేహలత.

ఉమెన్స్ అచీవర్ అవార్డ్...

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉదయ్‌పూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఆర్ట్ క్యాంప్‌లో 'బేటీ బచావ్ – బేటీ పడావ్' అనే కాన్సెప్ట్‌తో తల్లీ, తండ్రీ, మధ్యలో అమ్మాయితో మూడు శిల్పాలను చెక్కారు. దీనికి గాను ఆగస్టు 17న ప్రధాని చేతుల మీదుగా ఇంటర్నేషనల్ వరల్డ్ ఏషియా ఉమెన్స్ అచీవర్ అవార్ట్‌ను తీసుకోబోతున్నారు. త్వరలోనే 26 ఫీట్లు ఉండే ఏక శిలతో పంచపాండవులను చెక్కబోతున్నారు. స్నేహలత కేవలం కళకే పరిమితం కాలేదు. భర్త నడుపుతున్న నందిని హాస్పిటల్ డైరెక్టర్‌గా అడ్మిషన్ వర్క్ మొత్తం ఆమే చూసుకుంటున్నారు. అలాగే ఇసీఐఎల్ చుట్టుపక్కల ఉన్న ఎనిమిది ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో ఈమె ఆధ్వర్యంలోనే ఉచిత మెడికల్ క్యాంప్‌లు జరుగుతున్నాయి. ప్రస్తుతం స్నేహలతకు మినిష్టరీ ఆఫ్ కల్చర్ వారి నుంచి జేఆర్‌ఎఫ్ కూడా వస్తుంది.

సలీమ

మినాక్ థియేటర్ రూపకర్త



రోవెనా కాడే (2 ఆగస్టు 1893 - 26 మార్చి 1983)

Women of the day

ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన థియేటర్ల జాబితాలో మినాక్ థియేటర్ ఒకటి. సముద్ర తీరాన రాళ్లతో కూడిన ప్రదేశంలో నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్ ఇది. ఒకేసారి ఎనభైవేల మంది ప్రదర్శనను తిలకించేలా అద్భుతంగా కట్టిన నిర్మాణం. ఈ కట్టడం రూపకర్త రోవెనా కాడే. అన్ని కాలాల్లోనూ రక్షణ కల్పించేలా ఆమె ఎంతో ప్రతిభను కనపరుస్తూ.. దీనిని నిర్మించి ప్రపంచానికి అందించారు.

ఈ థియేటర్ ఇంగ్లాండ్లోని కార్నావాల్‌లోని ల్యాండ్స్ ఎండ్ నుండి ఆరున్నర కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రతిసంవత్సరం మే నుండి సెప్టెంబరు వరకు ఇక్కడ ప్రదర్శనలు జరుగుతాయి.

ఇంగ్లాండ్‌లోని డెర్బీ పట్టణం సమీపంలోని స్పోండాన్‌లో కాడే జన్మించారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత వారి కుటుంబం స్పోండాన్‌లోని ఇంటిని అమ్మేశారు. వెస్ట్ పెన్విత్ లోని లామెర్నాకు వలసవెళ్లారు. ఆమె 1920 లలో మినాక్ ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని ఇంటిని నిర్మించుకోవడానికి 100 పౌండ్లతో స్థలం కొనుగోలు చేసి ఇంటిని నిర్మించారు. ఇక్కడే తన తల్లిదండ్రులతో కలిసి నివసించారు. 1929 లో 'ఎ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీం' పేరుతో ఒక లోకల్ ప్రొడక్షన్‌ను ప్రారంభించారు. ఒక శాశ్వత బహిరంగ వేదికను నిర్మించడానికి తగిన స్థలం కోసం అన్వేషణ ప్రారంభించారు. ఆమె ఆశించిన విధంగా థియేటర్ నిర్మించడానికి తగిన ప్రదేశం ల్యాండ్స్ ఎండ్ నుండి కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రాన్కెట్ శిఖరాలలో మధ్య కనిపించింది. సముద్రతీరంలో ఎంతో అద్భుతంగా ఉన్న ఈ ప్రాంతంలో 1931–32లో ఆమె తన గార్డినర్ బిల్లీ రాలింగ్స్ సహాయంతో థియేటర్‌ను నిర్మించారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ప్రారంభించేనాటికి కాడే వయసు 38 సంవత్సరాలు మాత్రమే. ఏడు సంవత్సరాలు కష్టపడి దీనిని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అనేక విధాల మెరుగుదిద్దారు. ఈ వేదిక మీద 1932 వేసవిలో షేక్స్‌పియర్ రచించిన 'ది టెంపెస్ట్' ప్రదర్శించడానికి ఆరు నెలలు పట్టింది. బ్యాటరీలు, కారు హెడ్‌లైట్ల సహాయంలో ఈ ప్రదర్శన జరిగింది. నాటక ప్రపంచం ఈ అద్భుతమైన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను గుర్తించింది. 1944 లో స్టీవార్ట్ గ్రాంజెర్, మార్గరెట్ లాక్వుడ్ నటించిన 'లవ్ స్టోరీ' కి ఒక వేదికగా ఈ థియేటర్‌ను ఉపయోగించారు. ఆ తర్వాత ఈ లోకేషన్‌లో అనేక చిత్రాల చిత్రీకరణ జరిగింది. 1976 లో ఈ థియేటర్‌ను ఛారిటబుల్ ట్రస్ట్‌కు రోవెనా కాడే ఇచ్చేశారు.

క్యాల్షియం కావాల్సినంత...

క్యాల్షియం అనగానే అందరికీ గుర్తొచ్చేది పాలు. పాలల్లో కంటే ఎక్కువపాళ్లలో క్యాల్షియం ఉండే కొన్ని ఆహారపదార్థాలున్నాయి. క్యాల్షియం లోపం లేకుండా ఉండాలంటే... రెగ్యులర్‌గా వీటిని ఆహారంలో చేర్చుకోండి.

డైరీ ప్రొడక్ట్స్‌లో అధిక శాతంలో క్యాల్షియం ఉంటుంది. సాధారణంగా పాలు తీసుకొనే కంటే పెరుగు, మజ్జిగా తీసుకోవడం చాలా మంచిది.

ఒక గ్లాసు పాలలోకంటే గుప్పెడు నువ్వుల్లో ఎక్కువ క్యాల్షియం ఉంటుంది. నువ్వుల్లో అధికంగా ఉన్న జింక్ ఎముకల మినరల్స్ సాంద్రతను పెంచుతుంది.



ఆకుకూరల్లో ముఖ్యంగా పాలకూరలో క్యాల్షియం మరియు ఐరన్ పుష్కలంగా ఉంటుంది. తల్లి నుండి రక్తం బిడ్డవైపుకు ప్రసరిస్తుంది కాబట్టి, ఆకు కూరలను తినడం వల్ల తల్లికి సరిపడా రక్తాన్ని ఉత్పత్తి చేస్తుంది.

చిక్కుళ్లలో క్యాల్షియం అధికంగా ఉంటుంది. బాగా ఉడికించిన బెండకాయల్లో సైతం క్యాల్షియం అధికంగా ఉంటుంది.

సంత్రాల్లోనూ క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని డైరెక్టుగా తినేయొచ్చు. లేదంటే జ్యూస్‌లుగానో, సలాడ్స్‌గానో చేసి తీసుకోవచ్చు.

'డి' విటమిన్ వల్లే మన శరీరంలో క్యాల్షియం ఉత్పత్తి అవుతుందని. ఆస్పరాగస్ లో 'డి' విటమిన్ పుష్కలంగా ఉండి. మరియు ఇందులో ఉండే ఆరోమాటిక్ ఫ్లేవర్ మార్నింగ్ సిక్‌నెస్ ను పోగొడుతుంది.

సీ ఫిష్‌లో సాల్మన్, టునా, క్యాట్ ఫిష్‌లో విటమిన్ 'డి' మాత్రమే కాదు కాల్షియం, ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయి కాబట్టి చేపలు తినడం మంచిది. రొయ్యలు, పీతల్లో సైతం క్యాల్షియం ఉంటుంది.

బ్లాక్‌బెర్రీస్, స్ట్రాబెర్రీస్, రస్‌బెర్రీస్.. మూడింటిలోనూ క్యాల్షియం ఉంటుంది. కర్జూర పండ్లు, కిస్‌మిస్‌ల్లో కూడా క్యాల్షియం కావాల్సినంత లభిస్తుంది.

ఇట్ల చేద్దాం

పచ్చిమిరపకాయల తొడిమెలు తీసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడం వల్ల తొందరగా పాడవవు.

బాల్యం ఒక అందమైన దశ...

బాల్యం ఒక అందమైన దశ. ఈ దశలో మనసులో నాటుకుపోయే అనేక భావనలు జీవితాంతం వెన్నంటి ఉంటాయన్నది అందరు అంగీకరించాల్సిన వాస్తవం. అలాంటి దశలో పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి తల్లిదండ్రులు అనేక రకాలుగా భయపెడుతుంటారు. అలా భయపెట్టడం పిల్లల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు మానసిక నిపుణులు. మరి ఆ ప్రభావాలెంటో... వాటికి పరిష్కార మార్గాలెంటో తెలుసుకుందాం !



ఒక రకమైన ఫొబియా...

పిల్లలను భయపెట్టి మాట వినేలా చేసుకోవడం సరైందేనా? పిల్లలు పాలు తాగకపోయినా... అన్నం తినకపోయినా... మాట వినకపోయినా... ఇదిగో దెయ్యం, అదిగో పోలీసు అంటూ ఏదో ఒకటి చెప్పి భయపెట్టిస్తుంటారు. ఒకప్పుడు ఇది సరైనది కావచ్చు. కానీ ప్రస్తుత రోజుల్లో చిన్నపిల్లలకు ఫొబియా, డిప్రెషన్‌కు కారణాలవుతున్నాయి. కొంత మంది పిల్లలు ఇలాంటి విషయాలను ధైర్యంగా, స్ఫూర్తిగా తీసుకుంటారు. మరి కొంతమంది పిల్లలు ప్రతి చిన్న విషయానికి భయపడిపోతారు. కొంచెం పెద్దయ్యాక "చెప్పిన మాట వినకపోతే టీచర్ కొడుతుందని...డాడీ కొడతాడని భయపెట్టిస్తారు". 'ఇంకా కొంచెం పెద్దవాళ్ళు అయిన తర్వాత బయటికి వెళ్లితే ఇలా ఉంటావు, నువ్వు ఆడ పిల్లవు, నువ్వు ఇలా చేయాలి, నువ్వు ఆడ పిల్లవు భర్త ఇంటికి వెళ్లితే వంట ఎలా చేస్తావు, అందుకే చదువు కోవడం కంటే ముందుగా ఇంటి పనులు రావాలని భయపెట్టిస్తుంటారు. దీని వల్ల జీవితం మొత్తం ఏదో భయంతో బతకాల్సివస్తుంది.

ఇలాంటి ఆలోచన ధోరణితో పెంచడం ద్వారా పిల్లలకు భర్త, వివాహం అంటే చాలు ప్రతికూల ఆలోచనలు వస్తాయి, లేదా పోలీసు వాళ్లను చూస్తే చాలు ఒకరకమైన పొబియా వస్తుంది. ఈ రోజుల్లో రోడ్ మీద ఎక్కడ చూసిన పోలీసు వాళ్లే కనిపిస్తారు. కొన్నిసార్లు తల్లిదండ్రులకు ఉండే భయలను కూడా పిల్లలకు నేర్పిస్తారు. ఉదాహరణకు బల్లి, బొద్దింక, ఎలుక వంటివి ఇంట్లో కనిపిస్తే చాలు గట్టిగా అరిచి బయటకు పరిగెడతారు. పిల్లలు కూడా గట్టి గట్టిగా కేకలు వేసి బయటకు పరుగులు తీస్తారు. పిల్లలకు అసలు అందేంటో కూడా తెలిదు! ఆ తర్వాత పెద్దయ్యాక కూడా ఈ ఫొబియా వెంటాడుతునే ఉంటుంది. అందు వల్ల భయం అనేది ఎంత వరకు కరెక్టు అనేది ఒకసారి ఆలోచించుకోవాలి ! చాలా వరకు తల్లిదండ్రులు అనుకునేది ఏంటాంటే పిల్లలు భయంతో పెరిగితే క్రమశిక్షణ, భక్తి అలవడుతాయి అనుకుంటారు. అలా కాకుండా భక్తి, క్రమశిక్షణ అనేవి భయం లేకుండా కూడా రావచ్చు. టీచర్స్, డాడీ, పోలీసులు అన్న భయం ఉండాల్సిన అవసరం లేదు. గౌరవం ఉంటే చాలు. ఇకపోతే ప్రతికూలంగా చెప్పకపోతే పిల్లలు ఏ మాత్రం మాటా వినరని చెబుతారు తల్లిదండ్రులు. అయితే దీనికి కూడా ఒక మార్గం ఉంది. చిన్నప్పటి నుంచి భయపెట్టడం మానేసి ప్రతి విషయాన్ని వివరిస్తూ... పిల్లలకు అర్థమయ్యే విధంగా పెంచితే సరిపోతుంది.

లాజికల్ థింకింగ్

అమ్మ అరుస్తుందనుకోండి... అరిచే వరకు అమ్మకు ఓపిక ఉంది కాదా అని అవే చేష్టలు చేస్తుంటారు. చాలా మట్టుకు పిల్లలకు ఇలాంటి ప్రవర్తనను తల్లిదండ్రులే నేర్పిస్తారు. వాళ్ళు పుట్టినప్పుడు ఒక తెలుపు రంగు కాగితంలా ఉంటారు. దాని మీద పిచ్చి గీతలైన సరే... మంచి రాతలైన సరే... పెద్దవాళ్లు, సమాజం, సంస్కృతి ఇవన్నీ రాస్తుంటాయి. అయితే పిల్లలు ఎలా తయారవుతరనేది కేవలం వంశాపారంపర్యంగా వచ్చే స్వభావమే కాకుండా తల్లిదండ్రులు నేర్పించే స్వభావం కూడా చాలా మట్టుకు ఉంటుంది. కాబట్టి భయాలను తొలగించి చిన్నతనం నుంచి ధైర్యంగా పెంచడం నేర్చుకోవాలి. "ఇట్స్ ఓకే దీన్ని ఫేష్ చేయేచ్చు ఏమి కాదు! అనే భావన వారిలో కలగాలి. అలా ధైర్యంగా పెంచడం వల్ల ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను, ఆటంకాలను ఎదుర్కొంటారు. కొంత మంది తల్లిదండ్రులు ఆశపెట్టి మాట వినేలా చేసుకుంటారు.... ఇది సరైన పద్ధతి కాదు? షాపింగ్‌కు వెళ్లినప్పుడు పిల్లలు నాకు టెడ్డీబేర్ కావాలి అని మారాం చేస్తే ! హలీడేస్‌లో, దీపావళికీ ఇప్పిస్తానని ఆశ చూపిస్తుంటారు. అలా కాకుండా ఓకే నీకు టెడ్డీబేర్ కావాలి కదా! చలో ఇద్దరం కలిసి బాగా చదువుకుందాం అని అనాలి. ఇలా లాజికల్‌గా పెంచడం వల్ల ఎన్నో ఉపయోగాలుంటాయి. లాజికల్ దింకింగ్ అనేది జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. లాజికల్ థింకింగ్ వల్ల ఎలాంటి పరిస్థితినైన సరే ఎదుర్కోనే మానసిక దృక్పాథం అలవడుతుంది. పిల్లలు చాలా వరకు వాళ్ల పరిదిలో వాళ్లు లాజికల్‌గా ఆలోచిస్తుంటారు. కాబట్టి చిన్నారుల్లో ఉండే భయాలను తొలగించడం కీలకం.

సహజ రంగు కోసం...

ఈ ఆధునిక జీవనంలో జుట్టు రంగు మారడం ఓ సాధారణ సమస్య. మేలనిన్ అనే ఒక వర్ణద్రవ్యం లేకపోవడం వలన జుట్టు రంగు మారుతుంది. అలానే జన్యు సంబంధమైన సమస్యలు, శరీరంలో కొన్ని రసాయన చర్యలు జరగడం, పర్యావరణ కాలుష్యం, ఆందోళన కూడా జుట్టు సహజ రంగును మార్చేస్తుంది. అలాగే రసాయనాలతో కూడిన ఆయిల్స్, షాంపూల వల్ల కూడా జుట్టు తెల్లబడుతుంది. అయితే కొందరు జుట్టు నల్లగా కనిపించాలని ఏవేవో రాసేస్తుంటారు. అలా కాకుండా కొన్ని నెచురల్ చిట్కాలతో మీ జుట్టు మరింత వొత్తుగా, నల్లగా మార్చుకోవచ్చు. అవేంటో చూద్దాం...



- అర లీటరు నీటిలో, ఓ టేబుల్ స్పూన్ ఉసిరి పొడి, సగం చెక్క నిమ్మరసం కలపాలి. తలస్నానం చేసే ముందు ఆ నీటిని తలకు అప్లై చేస్తే మంచి ఫలితాన్ని పొందగలరు.
- మూడు టేబుల్ స్పూన్లు తాజా గోరింటాకు పేస్టు, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకొని దానిలో కాఫీ పొడి వేసి తగిన మోతాదులో నీటిని కలిపి పేస్టులా తయారు చేయాలి. ఈ పేస్టుని తలకి అప్లైచేసి రెండు గంటలు అలానే ఉంచి, తర్వాత షాంపూతో తలని శుభ్రం చేయాలి.

ఆయేషా హత్య కేసులో పోలీసుల వైఫల్యంపై చర్యలేమిటి?

నవతెలంగాణ-హైదరాబాద్

విజయవాడలో పెనుసంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో అసలు నేరస్తులను గుర్తించడంలో విఫలమైనవారిపై అపెక్స్ కమిటీ ఏవిధమైన చర్యలు తీసుకుందో తెలియజేయాలని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయేషా హత్య కేసులో హైకోర్టు వెలువరించిన తీర్పులో పి.సత్యంబాబు నిర్ధోషి అని ప్రకటిస్తూనే పలు సందేహాల్ని వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలో ఈకేసును తిరిగి దర్యాప్తు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమా మేల్కోటే, సామాజిక కార్యకర్త వల్లూరుపల్లి సంధ్యారాణి, జర్నలిస్టు కె.సజయ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. వాదనల అనంతరం హైకోర్టు స్పందిస్తూ.. నేరస్తుల్ని గుర్తించడంలో విఫలమైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారా లేదా. గత మార్చి 31న హైకోరు ఆదేశాల మేరకు ఈ వ్యవహారాన్ని అపెక్స్ కమిటీకి నివేదించారా లేదా. నివేదించి ఉంటే ఆ కమిటీ ఏం చర్యలకు సిఫార్సు చేసింది. కమిటీ ఏమీ చేయకపోతే అందుకు కారణాలు వంటిపూర్తి సమాచారాన్ని తెలియజేయాలని కోరింది. కేసు విచారణ 8కి వాయిదా వేసింది.

బోర్డు తిప్పేసిన సాయిరామ్ ట్రేడర్స్

సత్యవేడు : 'సగం ధరకే వస్తువులు ఇస్తాం' అని నమ్మబలికి దాదాపు 400మంది దగ్గర రూ.2 కోట్లను వసూలు చేసి సాయిరామ్ ట్రేడర్స్ బోర్డు తిప్పేసి ఉడాయించింది. విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం షాపు వద్దకు వచ్చి లబోదిబోమన్నారు. బాధితుల కథనం మేరకు.. గత నెల 13న సత్యవేడు పెట్రోల్‌బంక్ సమీపంలోని కాంప్లెక్స్‌లో 'సాయిరామ్ ట్రేడర్స్ మరియు ఆర్డర్ సప్లయర్స్' పేరుతో నూతన షాపును ప్రారంభించారు.

పోరాటం ఆగదు

- పునరావాసం కల్పించాకే పోలవరం నిర్మించాలి: మహాధర్నాలో వక్తలు
- ఐదు రాష్ట్రాల సరిహద్దు రహదారి దిగ్బంధనం



మహాధర్నాలో రోడ్డుపై బైటాయించిన ఎమ్మెల్యే సున్నం రాజయ్య

చింతూరు : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం డిమాండ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లా చింతూరులో మంగళవారం నిర్వాసితుల సమస్యలపై మహాధర్నా నిర్వహించింది. ఎటపాక, విఆర్ పురం, కూనవరం, చింతూరు మండలాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది గిరిజనులు చింతూరు సెంటర్ నుంచి ఐదు రాష్ట్రాల సరిహద్దు జంక్షన్ అయిన చట్టి వరకూ మూడు కిలోమీటర్ల మేర మండుటెండలో పాదయాత్ర నిర్వహించి, రహదారిని దిగ్బంధించారు. నిర్వాసితులందరికీ పూర్తి పునరావాసం కల్పించాలని, భూమికి భూమి ఎప్పుడిస్తారో చెప్పాలని, ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారో చెప్పాలని నిర్వాసితులు నినాదాలు చేశారు. రోడ్డుపై బైటా యించి నిరసన తెలపడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ ముంపు మండలాల్లోని గిరిజన, గిరిజనేతరులందరికీ పునరావాసం కల్పించే వరకూ పోలవరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కొండపోడు భూమికి పట్టా భూమితో సమానంగా పరిహారం చెల్లించాలన్నారు. భద్రాచలం ఎంఎల్ఎ సున్నం రాజయ్య మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరు సాగిస్తామన్నారు. గిరిజనుల పోరాటం అమరావతికి, ఢిల్లీకి వినిపించేలా ఉండాలన్నారు. ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు.

17, 18 తేదీల్లో ముంపు మండలాల బంద్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17, 18 తేదీల్లో ముంపు మండలాల్లో 48 గంటల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ చెప్పారు.

తుని ఎమ్మెల్యే ఇంటిపై ఇన్‌కంటాక్స్ దాడులు

కోటనందూరు : తూర్పుగోదావరి జిల్లా వైసీపీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా నివాసంపై ఆదాయ పన్నులశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నం ఆదాయ పన్నులశాఖ అదనపు కమిషనర్ మూర్తినాయక్ ఆధ్వర్యాన 46 మంది ఎనిమిది బృందాలుగా ఏర్పడ్డారు. తుని పట్టణంలోని లక్ష్మీగణపతి, వెంకన్నబాబు, వెంకట ధనలక్ష్మి, దాడిశెట్టి నరసయ్య, జ్యూయలరీ షాపులపై, సురేష్‌కుమార్ ఆస్పత్రి, తల్లిపిల్లల ఆస్పత్రిపై, వైద్యుల ఇళ్లలోనూ ఐటి అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు.

వైద్యుల నివాసంలో భారీగా నగదు, వివిధ ఆస్తుల పత్రాలు దొరికినట్టు సమాచారం. జ్యూయలరీ షాపుల్లో అధిక మొత్తంలో బంగారం నిల్వలు ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు.

అసెంబ్లీ సీట్ల పెంపు లేదు

- పునః స్పష్టీకరించిన కేంద్రం

న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజక వర్గాల పెంపు ఇప్పట్లో చేపట్లే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3)ని సవరిస్తే కానీ అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని పునరుద్ఘాటించింది. రాజ్యాంగ సవరణ చేయకపోతే 2026 తర్వాత వచ్చే జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపుదల ఉంటుందని హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారాం అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వ వైఖరేమిటనీ టిడిపి ఎంపి మురళీమోహన్, టిఆర్ఎస్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. దీనిపై హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ లిఖిత పూర్వకంగా సమాధా నమిచ్చారు. రాజ్యంగంలోని ఆర్టికల్ 170 (3)కి లోబడే సీట్ల పెంపుదల ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్టికల్ 170(3)కి లోబడి ఆంధ్రప్రదేశ్‌లో 153 నుంచి 225 సీట్లు, తెలంగాణలో 119 నుంచి 175 సీట్లు పెంచాలని చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఆర్టికల్ 170(3)ని సవరించాలని కేంద్రం భావిస్తోందా లేదా అన్నదానిపై కేంద్రం బదులివ్వలేదు.

బాబు మాటలు నమ్మి మోసపోవద్దు : ముద్రగడ

కిర్లంపూడి : చంద్రబాబు 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నీటిమూటల్లాగే ఉన్నాయని, ఆయన మాటలు విని మోసపోవద్దని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో మంగళవారం ముద్రగడ బహిరంగలేఖ విడుదల చేశారు. జీఓ 30 సక్రమంగానే ఉన్నప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. 2016 ఫిబ్రవరిలో మంత్రి అచ్చెన్నాయుడు మరో ఏడు నెలల్లో కమిషన్ రిపోర్టు తెచ్చుకుని అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రానికి పంపుతామని చెప్పినట్టు వివరించారు.

సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వరరావుకు 'కీర్తి' పురస్కారం



ఫైల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ జర్నలిస్టు, అతిథి మాసపత్రిక సంపాదకులు ఎం వెంకటేశ్వరరావుకు కీర్తి పురస్కారం లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా ఆయా రంగాల్లో సేవలు అందించి పలువురికి ఈ అవార్డులను అందజేస్తుంది. 2016కుగాను 40 మందికి ఈ పురస్కారాలను ప్రకటించింది. జర్నలిజంలో ఈనాడు మాజీ ప్రతినిధి వెంకటేశ్వరరావును ఎంపిక చేసింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో ఆయన జన్మించారు. డిగ్రీ చదువుకుంటూనే 1984లో ఈనాడులో పార్ట్‌టైం విలేకరిగా వృత్తిలోకి వచ్చారు. 2006 వరకు వివిధ స్థాయిల్లో అక్కడే విధులు నిర్వహించారు. ఆ తర్వాత వార్త దినపత్రికలో చేరి 2015 వరకు విలేకరిగా పనిచేశారు. నాలుగేండ్ల నుంచి అతిథి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా మాసపత్రిక సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. 33 ఏండ్లుగా పత్రికారంగంలో ఉన్నారు. సినీమారంగంతోనూ పరిచయం ఉంది. 'చదువుకోవాలి' అనే బాలల సినిమా నిర్మించి దర్శకుడిగా పరిచమయ్యారు. పేదరికంలో పుట్టిన అమ్మాయి ఎదుర్కొనే సమస్యలు కలెక్టర్ అయ్యే వరకు పడ్డ కష్టాలను సినిమాలో కండ్లకు కట్టినట్టు చూపించారు. మంచి సందేశం ఉండడంతో విద్యార్థుల నుంచి ఆదరణ లభించింది. 2014లో కెనడా అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఎక్సలెన్సీ అవార్డు, 2013లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఉగాది ఉత్తమ చిత్రం పురస్కారాన్ని అందుకున్నారు. కీర్తి పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఎస్వీ సత్యనారాయణకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెలాఖరులో అవార్డుగ్రహీతలకు యూనివర్సిటీ అవార్డులను అందజేయనుంది.

ఓఆర్ఆర్ చుట్టూ హరితహారం : సీఎం ఓఎస్డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగు రోడ్డు చుట్టూ హరితహారం చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించినట్టు సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. ఓఆర్ఆర్‌ను మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ అధికారులతో భేటి అయ్యారు.

పౌరసరఫరాల శాఖ హమాలీల సమ్మెకు విరామం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా పంపిణీ పథకాన్ని, ఆహారభద్రత చట్టాన్ని, రాజ్యాంగ హక్కు ఆర్టికల్ 47, 239 ప్రకారం 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేయాలని, సివిల్ సప్లయీస్ హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని, గతేడాది ఇచ్చిన జి.ఓ. ప్రకా రం తక్షణమే ఈఎస్ఐ కార్డులు, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని, మహిళా స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, తొలగించిన సెక్యూరిటీ గార్డుల ను తిరిగి ఉద్యోగాలలో నియమిం చాలని గత నెల 25 నుంచి సమ్మె చేస్తున్న పౌరసరఫరాల శాఖ హమాలీలు సమ్మెను తాత్కాలికంగా విరమించారు.

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

మధ్యాహ్నభోజన పథకం బిల్లులను ఏజెన్సీలకు చెల్లించడంలో డీఈఓ, ఎంఈఓ లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ హెచ్చరించారు. ప్రతి నెలా పదిలోపే బిల్లులు చెల్లించాలని ఆదేశిం చారు. నవతెలంగాణలో మంగళవారం 'బడిపిల్లల బువ్వకు బంగారం తాకట్టు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆయన సూచించారు.

9 నుంచి 14 వరకు దేశవ్యాప్త ఆందోళనలు

- అఖిల భారత కిసాన్ సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ పిలుపునిచ్చింది. కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఇఎమ్ఎస్ అకాడమిలో అఖిల భారత అధ్యక్షులు అమ్రారామ్ అధ్యక్షతన అఖిల భారత కౌన్సిల్ సమావేశం జరిగింది. రైతులు ఎదుర్కొంటున్న 7 సమస్యలపై చర్చించింది. ఈ సమస్యన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9 నుంచి జిల్లా కేంద్రాల్లో జైల్ భరో కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది.

దేశవ్యాప్తంగా కలిసి వచ్చే రైతు, రైతుకూలీ సంఘాలు, వ్యవసాయ, కార్మిక సంఘాలను కలుపుకోవాలని కోరింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం పెంచి మద్దతు ధర నిర్ణయించాలని, పార్లమెంటులో చట్టం చేయా లని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి హన్నన్‌మొల్లా, ఎస్. రామచంద్రన్ పిళ్లై, వరదరాజన్, సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్, పి. జంగారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, నున్నా నాగేశ్వర్‌రావు, బండ శ్రీశైలం, వాసుదేవరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. ఉస్మానియా ఆస్పత్రిలో ఇటీవల రోగి మృతి చెందడంతో బంధువులు పీజీ డాక్టర్లపై దాడి చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉస్మానియా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయేందర్‌గౌడ్, నిజావుల్లా, అనూష, సుప్రియ, వెంకటరమణలు రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డితో చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరించేందుకు హామీ లభించడంతో సమ్మె విరమిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టుల కోసం 12,500 మెగావాట్ల కరెంట్

నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

- రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదు..: ట్రాన్స్‌కో సీఎండీ
- కాళేశ్వరంపై విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారుల భేటీ



మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం 2018 జూన్ నాటికి 12,500 మెగావాట్ల విద్యుచ్ఛక్తి అవ^రమని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2018 జూన్ నాటికి కాళేశ్వరం పంపింగ్ స్టేషన్లు పనిచేస్తాయని, వీటికి సంబంధించిన విద్యుత్ సరఫరా కోసం ఏర్పాట్లు ముమ్మరం చేయాలని మంత్రి ఆదేశించారు. డెడ్‌లైన్ లోపే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, పంపిణీ లైన్ల ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఈ సమావేశంలో పాల్గొన్నా ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైన విద్యుత్ సరఫరా కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. నిర్దేశిత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనిచేస్తామన్నారు. ప్యాకేజీల వారీగా పంపింగ్ స్టేషన్లు పూర్తి చేయడానికి నీటిపారుదల శాఖ పనిచేస్తున్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. వచ్చే డిసెంబర్ నాటికి 6, 8 ప్యాకేజీ పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం పంప్‌హౌస్‌ల పనులు వేగం పుంజుకున్నాయని, 2018 మార్చి నాటికి ఇవి పూర్తవుతాయని ఆయన ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి కావాలంటే విద్యుత్ సంస్థల సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది ఖరీఫ్‌లో కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించనున్నట్టు తెలిపారు. పంప్‌లు, మోటార్ల తయారీదారులతోనూ సమావేశమైన విషయాన్ని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోనూ రిజర్వాయర్ల మీదుగా వెళున్న 220, 132, 33 కేవీ సబ్‌స్టేషన్లను తరలించాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టులకు హెచ్‌టీ లైన్లు అడ్డం రాకుండా చూడాలని ఆదేశించారు. 2018 మార్చి లోగా 10 సబ్‌స్టేషన్లు పూర్తి కావాలన్నారు. ఆరు 400 కేవీ, మూడు 220 కేవీ, రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ టవర్లు, హెచ్‌టీ లైన్ల నిర్మాణంపై ఆయన సమీక్షించారు. 59 విద్యుత్ టవర్లు నిర్మించాలన్నారు. నీటిపారుదల, ట్రాన్స్‌కోకు చెందిన ఉత్సాహవంతులైన ఇంజనీర్ల టీమ్‌ను నియమించాలను సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధరరావు, ట్రాన్స్‌కో కో-డైరెక్టర్ సూర్యప్రకాశ్, జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం, ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా

- దిగ్విజయ్‌సింగ్ తొలగింపు
- కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో కీలక మార్పు జరిగింది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి దిగ్విజయ్‌సింగ్‌ను కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం తప్పించింది. ఆయన స్థానంలో ఏఐసీసీ జాతీయ కార్యదర్శి రామచంద్ర కుంతియాను నియమించింది. కార్యదర్శిగా సతీష్‌ను నియమిస్తూ మంగళవారం ఏఐసీసీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. డిగ్గీని ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని చాలాకాలంగా పలువురు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరుతూ వస్తున్నారు. అనేకమంది దిగ్విజయ్‌సింగ్‌పై ఫిర్యాదులు చేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా దిగ్విజయ్‌సింగ్ పదేండ్లుగా పనిచేశారు. ఆ అనుభవం విభజన అనంతరం తెలంగాణలోనూ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనూ పనిచేస్తుందని కాంగ్రెస్ అధిష్టానం భావించింది. అయితే తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాలేదు. ఏపీలో ఒక్కస్థానం కూడా గెలవలేదు. దీంతో ఆయనపై నేతల్లో వ్యతిరేకత వ్యక్తమవుతూ వచ్చింది. ఎన్నికల అనంతరం ఆయనను తప్పిస్తారని ప్రచారం జరిగింది. ఈ మూడేండ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీని గాడిపెట్టే ప్రయత్నంలోనూ ఆయన విఫలమయ్యారని ప్రచారం జరిగింది. పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలను, కుమ్ములాటలను ఆయన పరిష్కరించి, నేతల మధ్య సమన్వయం, సర్దుబాటు చేయలేకపోయారనే విమర్శ ఉంది. ఆయన ఎదుటే ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి కొట్టుకున్నారు. ఇటీవల ఆయన ట్విట్టర్‌లో చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌పార్టీకి ఇబ్బందికరంగా మారాయని రాష్ట్ర కాంగ్రెస్‌నేతలు అభిప్రాయపడ్డారు. వాటిని సమర్థించుకోలేక నేతలు ఇబ్బందులు పడ్డారు. అయితే మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు ఉండడంతో దిగ్విజయ్‌సింగ్ ఆ రాష్ట్రానికి ఇన్‌చార్జిగా పంపించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌పై పార్టీపై దృష్టి సారించేందుకు ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సమయంలో తెలంగాణకు మరో ఇన్‌చార్జిని నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. కుంతియా రాకతో ప్రస్తుతానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మార్పు ఉండకపోవచ్చు అని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

మహిళా కాలేజీల్లో పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి

- స్టే ఉత్తర్వుల్ని రద్దు చేసిన డివిజన్ బెంచ్

నవతెలంగాణ- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో బోధన, భోదనేతర సిబ్బంది పోస్టుల భర్తీ ప్రక్రియపై సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ ఎత్తివేస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. 546 బోధన, బోధనేతర పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీకి తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. దీనిని విచారించిన సింగిల్ జడ్జి ఇటీవల స్టే విధించారు. దీనిపై తెలంగాణ సర్కార్ చేసిన అప్పీల్ పిటిషన్‌ను న్యాయమూర్తులు సీవీ నాగార్జునరెడ్డి, జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణకు స్వీకరించింది. రాష్ట్రంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లోని బోధన, బోధనేతర పోస్టుల ఖాళీలన్నింటినీ మహిళలతో భర్తీ చేయాలని జూన్ 2న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిని సదాశివపేట వాసి వెంకట నరసింహగౌడ్ సవాల్ చేస్తూ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. జూలై 30 జరగాల్సిన రాతపరీక్షపై సింగిల్ జడ్జి స్టే విధించడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతరులు అప్పీల్ చేశారు. ఏ పోస్టుల్లో ఎవరిని నియమించాలో నిర్ణయించే అధికారం ప్రభుత్వానిదేనని, ఈ వ్యవహారంలో కోర్టులు జోక్యం చేసుకునే వీల్లేదని గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును తెలంగాణ సర్కార్ హైకోర్టు బెంచ్ ద ష్టికి తెచ్చింది. ఆ తీర్పు ఆధారంగా స్టేను రద్దు చేస్తున్నట్టు బెంచ్ వెల్లడించింది. పోస్టులన్నీ మహిళలకే కేటాయించడం సబబేనని, స్టే రద్దు చేస్తున్నా పోస్టుల భర్తీ తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉండాలని బెంచ్ తన మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. విజయలక్ష్మీ, పంజాబ్ యూనివర్సిటీ మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో పోస్టులన్నీ మహిళలతో భర్తీ చేయడం సరైనదేనని పేర్కొందని తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి వాదించారు. పోస్టుల భర్తీ విధాన నిర్ణయంలో భాగమని, ఎవరిని నియమించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందని చెప్పారు. స్టే ఉత్తర్వుల కారణంగా మహిళా కాలేజీల్లో విద్యాబోధన, ఆ కాలేజీల్లో పాలనలపై తీవ్రప్రభావం పడుతుందని, స్టేను రద్దు చేయాలని కోరారు.

ఒక్క సీటూ మిగల్లేదు

- బీ ఫార్మసీ, ఫార్మాడీ, బయోటెక్నాలజీలో వందశాతం భర్తీ
- 9 వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2017-18 విద్యాసంవత్సరానికి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు భారీ డిమాండ్ ఉంది. ఎంసెట్ బైపీసీ అభ్యర్థులకు నిర్వహించిన తొలివిడత కౌన్సెలింగ్ తర్వాత ఒక్క సీటూ మిగలకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మంగళవారం సాంకేతిక విద్యాశాఖ తొలివిడత సీట్లను కేయించింది. ఈ మేరకు ప్రవేశాల కన్వీనర్ ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 67,343 మంది అభ్యర్థులు అర్హత సంపాదించారని తెలిపారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింట్ సిస్టం ఆధారంగా ఆన్‌లైన్‌లో చలాన్ ద్వారా ఫీజు చెల్లించి జాయినింగ్ రిపోర్టు తీసుకొని కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు కాలేజీల్లో చేరేందుకు ఈనెల 9వ తేదీ వరకు గడువుందని తెలిపారు. తుదివిడత సీట్ల కేటాయింపు తర్వాతే ఒరిజినల్ ధ్రువపత్రాలు కాలేజీల్లో ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల రెగ్యులరైజ్‌పై కాంగ్రెస్ హర్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం పట్ల టీపీసీసీ హర్షం ప్రకటించింది. ఎన్నికలకు ముందు అధికారం కోసం టీఆర్ఎస్ అనేక వాగ్ధానాలు చేసిందని పేర్కొంది. మంగళవారం గాంధీ భవన్‌లో పార్టీ అధికార ప్రతినిధి మహేశ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు.

రాజ్యహింస పెరిగింది : మల్లు రవి

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజాఉద్యమాలపై రాజ్యహింస పెరిగిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు. నేరేళ్ల ఘటనపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ కుల రాజకీయాలు చేస్తోందని టీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దళితులు, బీసీల మీద థర్డ్ డిగ్రీ ప్రయోగించినా స్థానిక ఎంపీ సుమన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నోరు విప్పకపోవడంతోనే కాంగ్రెస్ పార్టీ బాధితులకు అండగా నిలబడిందన్నారు.

ఐఓబి రుణ కుంభకోణంపై విచారణ జరిపించాలి : పొంగులేటి

ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఐఓబి బ్యాంకు రుణాల్లో పెద్ద కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని మండలిలో ఉపనేత పొంగులేటి సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. భూమి ఒకరిదైతే రుణాలు వేరేవాళ్లకు ఇచ్చారని ఆరోపించారు. రైతు రుణాలను మధ్య దళారీలు దోచుకుంటున్నారన్నారు.

ఎంతమంది దళితులు చస్తే స్పందిస్తారు?

- కేటీఆర్‌కు గీతారెడ్డి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ప్రాణాలకు హానీ కలిగేలా పోలీసులు దళితులను కొట్టినా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కె తారకరామారావు స్పందించలేదని పీఏసీ చైర్మెన్ జె గీతారెడ్డి విమర్శించారు. ఎంత మంది దళితులు చనిపోతే స్పందిస్తారని ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. దళితులు, బీసీల పట్ల కేటీఆర్‌కు కనీస సానుభూతి కూడా లేకుండా లేదన్నారు. కేటీఆర్ మౌనంగా ఉంటూ ఇసుక మాఫియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇంత జరిగినా టీఆర్ఎస్ నాయకులు ఇంకా అబద్ధాలతో కాలం గడుపుకుంటూ దళితుల పట్ల అమానుషంగా మాట్లాడుతున్నారన్నారు. మానవత్వం లేని నాయకులు ప్రజా ప్రతినిధులు ఎలా అయ్యారని ప్రశ్నించారు. దళితులంటే మరీ అంతా చిన్నచూపా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇసుక లారీల కింద జనం పడి చనిపోతుంటే కేటీఆర్‌కు పరామర్శించే తీరిక లేదన్నారు. తన నియోజకవర్గ ప్రజల కంటే ఇసుక మాఫియానే ముఖ్యమయిందా?అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అయ్యావంటే సిరిసిల్ల ప్రజల దయ వల్లనే కదా? మరి వారు అంత ఆపదలో, కష్టాలలో ఉంటే ఇంత చులకనగా మాట్లాడడం తగునా అని ప్రశ్నించారు.

సమాచార శాఖ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ పోటీలు

- తొమ్మిదిలోగా ఎంట్రీలకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈనెల 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంగా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు ఎంట్రీలను ఆహ్వానించింది. ఈనెల 9లోగా పంపాలని సూచించింది. మొదటి కేటగిరీ కింద హరితహారం, మిషన్ భగీరథ, ఆరోగ్యలక్ష్మి, పర్యాటక, సాంస్కృతికం, పురాతన అంశాలకు సంబంధించి ఫోటోలు తీయాల్సి ఉంటుంది. అలాగే రెండో కేటగిరి కింద బోనాలు, బతుకమ్మతోపాటు కృష్ణా పుష్కరాల ఫోటోలు సేకరించాలి. మూడో కేటగిరి కింద వార్తాసంబంధమైన ఫోటోలను తీయాలని సమాచార శాఖ తెలియజేసింది. ఇతర సమాచారం కోసం సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎ హాష్మిని 9949351669 నెంబరులో సంప్రదించాలని కోరింది. ఎంట్రీలను సమాచార శాఖ రాష్ట్ర కార్యాలయం సమాచార భవన్‌కు నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ పంపాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'యూఆర్ఎస్‌ల్లో బాలకార్మికులను చేర్పించాలి'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల(యూఆర్ఎస్)ల్లో బాలకార్మికులను, వీధిబాలలను చేర్పించాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య అధికారులకు సూచించారు. మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. రాష్ట్రంలో మొత్తం 31యూఆర్ఎస్‌లు ఉన్నాయనీ, వీటిలో సిబ్బంది నియామకాలూ పూర్తి చేసినట్టు చెప్పారు. పోలీస్ శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది మాట్లాడుతూ.. జనవరి 1నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్, జూలై 1నుంచి 31వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్, వివిధ శాఖల అధికారులు డాక్టర్ గంగాధర్, శైలజ, నిర్మల, ఎం రమేశ్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాత సెలబస్‌నే కొనసాగించాలి : డీఈడీ అభ్యర్థుల సంఘం

టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)లో గత డీఎస్సీలో ఉన్న సెలబస్‌నే కొనసాగించాలని డీఈడీ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు మంగళవారం టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్‌ను ఆ సంఘం నేతలు కలిపి వినతిపత్రం అందించారు. టెట్ ఫలితాలను వెంటనే విడుదల చేసి, టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీను, రవి, నరేశ్, భాను, కోటేశ్, నవీన్ తదితరులున్నారు.

కావాలని కేసులు పెట్టలేదు : విప్ పల్లా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ జనరంజక పాలనను చూసి ఓర్వలేక జరగని విషయాలను జరిగినట్టుగా కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని శాసనమండలిలో విప్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. టీఆర్ఎస్ఎల్పీలో మంగళవారం ఆయన ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎన్ని ఆరోపణలు చేసినా.. ప్రజలు నమ్మరని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోవడంలో భాగంగా కొంతమందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అంతే కానీ కావాలని వారిపై కేసులు పెట్టలేదని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే దళితులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ తాను ఆడిస్తున్న డ్రామాలో భాగంగానే.. మీరాకుమార్‌ను నేరెళ్లకు తీసుకెళ్లారని విమర్శించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాతే.. ఇసుక మాఫియా అదుపులోకి వచ్చిందన్నారు. 2024 వరకూ టీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని, కాంగ్రెస్‌కు అధికారం దక్కదని అన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అన్యాయం; ఎమ్మెల్యే బాలరాజు

కాంగ్రెస్ హయాంలోనే దళితులకు అన్యాయం జరిగిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. ఆనాడు దళితుడైన మంత్రి శంకర్‌రావుపై దాడి జరిగితే.. ఉత్తమ్ ఎందుకు స్పందించలేదని, అప్పుడు ఉత్తమ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కపట ప్రేమ కురిపిస్తున్న కాంగ్రెస్‌ను దళితులు నమ్మరని ఆయన అన్నారు.

బీసీ వర్గాల బలోపేతం : మంత్రి జోగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం సచివాలయంలో శాలివాహన (కుమ్మరి) సంఘం ప్రతినిధులు మంత్రితో భేటి అయ్యారు. బీసీలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా పథకాలను రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. రాజకీయంగా, సామాజికంగా బీసీలు ఎదగాలని ఆకాంక్షిస్తుమని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుల వృత్తులపైనే ఆధారపడి ఉందన్నారు. వీటిలో అత్యాధునిక యంత్రాల వినియోగానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటాం

పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో నైపుణ్యాలు పెంపొందిస్తాం : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్


జిన్‌పింగ్

బీజింగ్: దేశ సార్వభౌమత్వాన్ని, భద్రతను పరిరక్షించుకుంటామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. ఈ బృహత్తర బాధ్యతలను తమ సైన్యమే సమర్ధవంతంగా నిర్వహించగలదని కితాబిచ్చారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన సమయం ఎప్పుడు ఆసన్నమైనా పీపుల్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) సిద్ధంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. భద్రతా బలగాల్లో నైపుణ్యతను పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూరి స్థాయిలో ఉపయోగించుకుని పీఎల్‌ఏని ఆధునీకరిస్తామన్నారు. పీఎల్‌ఏ 90వ వార్షికోత్సంలో జిన్‌పింగ్ మాట్లాడారు. చైనా భూభాగంలోని ఏ ప్రాంతాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునేది లేదని స్పష్టం చేశారు. 'చైనా ప్రజలు ఎప్పుడూ శాంతినే కోరుకుంటారు. ఇతర దేశాల దురాక్రమణను తిప్పిగొట్టగలరు. దుందుడుకు స్వభావాన్ని మా ప్రజలు కోరుకోరు. కానీ అన్ని సమస్యలపై పోరాడి గెలుస్తామనే విశ్వాసం మాత్రం మాకు ఉంది. మా దేశ సార్వభౌమత్వం, అభివృద్ధి, భద్రతను దెబ్బతీసే విధంగా ఎవరు ప్రవర్తించినా వాటిని ఉపేక్షించం' అని అన్నారు. మూడు రోజుల వ్యవధిలోనే జిన్‌పింగ్ పీఎల్‌ఏ సైనిక సామర్థ్యాల గురించి మాట్లాడటం ఇది రెండోసారి. గతనెల30న పీఎల్‌ఏ పరేడ్‌కు హాజరైన జిన్‌పింగ్ మాట్లాడుతూ చైనా సైన్యం శత్రుసైన్యాలపై జరిపే పోరాటంలో విజయం సాధించగలదన్న విశ్వాసం తనకు ఉందని నమ్మకం వెలిబుచ్చారు. ఈశాన్య ఆసియా ప్రాంతాల్లోని వివాదాల్లో జోక్యం చేసుకునేందుకు అమెరికా పావులు కదుపుతోందని విమర్శించారు. అనంతరం దక్షిణ చైనా దీవుల వివాదం గురించి మాట్లాడారు. ఈ ప్రాంతంపై తమకే హక్కులున్నాయని అన్నారు. తైవాన్‌ను చైనాలో అంతర్భాగంగానే పరిగణిస్తామన్నారు. వన్‌చైనా పాలసీలో జోక్యం చేసుకోవాలని ప్రయత్నించొద్దని పరోక్షంగా అమెరికాను హెచ్చరించారు.

పీఎల్‌ఏ : అత్యంత శక్తివంతమైన సైన్యంగా పీఎల్‌ఏకు పేరుంది. పీఎల్‌ఏ 1927, ఆగస్టు1న మావో జెడాంగ్ సారథ్యంలో ఆవిర్భవించింది. రష్యా రక్షణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం...ప్రస్తుతం పీఎల్‌ఏలో 23లక్షల మంది సైనికులు శిక్షణ పొందుతున్నారు. పీఎల్‌ఏ ఆధునీకరణ దిశగా జిన్‌పింగ్ ప్రయత్నిస్తున్నారు.

నన్ను క్షమించండి..ప్లీజ్

- ట్రంప్‌ను కోరిన హ్యారిపోర్టర్ రచయిత్రి

వాషింగ్టన్ : హ్యారీపోటర్ పుస్తక రచయిత్రి జె.కె రౌలింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు క్షమాపణలు చెప్పారు. గతవారం వైట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రంప్‌తో కరచాలనం చేయాలని ఓ దివ్యాంగ బాలుడు వీల్‌చైర్‌తో ముందుకు వచ్చాడు. ట్రంప్ అతన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోయిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఆ వీడియోను చూసిన జె.కె రౌలింగ్ బాలుడితో కరచాలనానికి ట్రంప్ ఆసక్తి చూపించకపోవడం శోచనీయమని ట్విట్టర్‌లో విమర్శించారు.

ఈ-వీసా విధానానికి రష్యా శ్రీకారం

- వచ్చే ఏడాది జనవరి1 నుంచి అమల్లోకి

మాస్కో : ఈ-వీసా విధానానికి రష్యా శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ విధానం ద్వారా కేవలం మూడు రోజుల్లోనే వీసా సౌకర్యం కల్పించనున్నట్టు మినిస్ట్రీ ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ ఈస్టర్న్ రీజియన్స్ సంస్థ సోమవారం తెలిపింది. వచ్చే ఏడాది జనవరి1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్టు తెలిపింది. తద్వారా, రష్యాలో వీసా కోసం దరఖాస్తు చేసుకోనున్న బ్రూనై, ఇండియా, చైనా, ఉత్తర కొరియా, మెక్సికో, సింగపూర్, జపాన్, అల్జీరియా, బహ్రెయిన్, ఇరాన్, ఖతార్, కువైట్, మొరాకో, యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, తునీషియా దేశాలకు చెందిన విద్యార్థుల వీసా ఇక్కట్లు తీరతాయని తెలిపింది. అయితే, ఈ-వీసాకు కేవలం 30 రోజులు మాత్రమే కాలపరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ-వీసా విధానం ద్వారా రష్యాకు పర్యాటకుల తాకిడి పెరిగి పర్యాటక రంగం అభివృద్ధి అయ్యే అవకాశముందని ఆ శాఖ డిప్యూటీ మంత్రి పావెల్ వోల్కోవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అమెరికాతో అణు ఒప్పందంపై ఇరాన్ తర్జనభర్జన

టెహ్రాన్ : అమెరికా తమపై తరచూ ఆంక్షలు మోపడం పట్ల ఇరాన్‌లో గుబులు మొదలైంది. అమెరికా సహా ఆరుదేశాలతో 2015లో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని రద్దు చేసుకునే యోచనలో ఉన్నట్టు తెలిపింది. అంతేగాకుండా, అమెరికా మోపిన ఆంక్షల గురించి ఐరాస భద్రతా మండలిలో ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

ఆఫ్ఘన్‌లో బాంబు పేలుడు..20 మంది మృతి

హెరాత్ : ఆఫ్ఘన్‌లోని హెరాత్ నగరంలోని ఓ మసీదు వద్ద మంగళవారం జరిగిన పేలుళ్లలో 20 మంది చనిపోయారు. మరో 30 మందికి పైగా గాయపడ్డారు.ఇరాన్ సరిహద్దులో ఉన్న జవాదీయా మసీదులో ఈ దాడి జరిగింది.మతఛాంధసవాదులు ఈ దారుణానికి పాల్పడిఉంటారని భద్రత బలగాలు తెలిపాయి.క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

ఉత్తర కొరియా అంతు చూస్తాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్ : ఉత్తర కొరియా అంతు చూస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉత్తర కొరియా గత వారం ప్రయోగించిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి గురించి ట్రంప్ స్పందించారు. కేబినేట్ సమావేశంలో మాట్లాడారు. ఉత్తరకొరియాను నిలువరించే శక్తి, సామర్థ్యాలు తమ దగ్గర ఉన్నాయని అన్నారు. అయితే, ఉత్తర కొరియాపై వ్యూహాలను మాత్రం ట్రంప్ వెల్లడించడానికి నిరాకరించారు. గతనెలలో ఉత్తరకొరియా రెండు ఖండంతార బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. క్షిపణుల ప్రయోగాలపై ట్విట్టర్‌లో విమర్శించారు. ఉత్తరకొరియా విషయంలో చైనా జోక్యం చేసుకోవాలని కోరారు. ఉత్తర కొరియా జూన్4, జూన్ 28 తేదీల్లో హ్వాసాంగ్-14 మిసైల్స్‌ను ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ క్షిపణులు ఉత్తర అమెరికా భూభాగంలోని ప్రాంతాలను ధ్వంసం చేయగలదని ఆ దేశ సైన్యం తెలిపింది. ఇటీవల ప్రయోగించిన క్షిపణి 3,724కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లక్ష్యాలను సైతం సునాయాసంగా ఢీకొట్టగలదని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా, అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రంప్

16 యుద్ధ విమానాలు, అదనపు బలగాలు మోహరింపు



ఉత్తర కొరియాకు 12 ఎఫ్-16 యుద్ధ విమానాలు, 200 మంది అదనపు బలగాలను పంపినట్టు పెంటగాన్ పేర్కొన్నది. రాజధాని సియోల్ నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న కున్సాన్ వైమానిక స్థావరంలో పసిఫిక్ ఎయిర్‌ఫోర్సెస్ బలగాలను మోహరించనున్నట్టు తెలిపింది. పశ్చిమ పసిఫిక్ దీవుల్లో శాంతిస్థాపన, స్థిరత్వాన్ని పెంపొందించడమే ప్రత్యేక బలగాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నది. జపాన్ బలగాలతో కలిసి ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్టు పసిఫిక్ ఎయిర్‌ఫోర్సెస్ కమాండర్ జనరల్ టెర్రెన్స్ ఓషఫ్నెస్సీ తెలిపారు.

భూసేకరణపై అభ్యంతరాలున్నప్పుడే ఒప్పందాలు చేసుకోవచ్చో లేదో విచారిస్తాం

నవతెలంగాణ-హైదరాబాద్

భూసేకరణపై అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగానే సంబంధిత భూయజమానులతో జిల్లా కలెక్టర్ ఒప్పందాలు చేసుకోవచ్చునో లేదో అనే అంశంపై విచారణ జరుపుతామని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించబోయే కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ కోసం సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలోని మామిడ్యాల, బైలాంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తాండ గ్రామాల్లో తలపెట్టిన భూసేకరణపై రైతుల అభ్యంతరాలపై నిర్ణయం తీసుకోలేదని, ఈలోగానే టెండర్ నోటిఫికేషన్ వెలువడిందని పేర్కొంటూ మామిడ్యాల గ్రామస్తుడు టి.శ్రీనివాస్ ఇతరులు వేసిన పిటిషన్‌ను మంగళవారం బెంచ్ విచారించింది. పర్యావరణ అనుమతులు కూడా లేకుండానే పనులు చేసేందుకు టెండర్ పిలిచారని తెలిపారు. విచారణ 17కి వాయిదా పడింది. ముందే ముసాయిదా ప్రకటించారా లేదాకేంద్రం రూపొందించిన భూసేకరణ చట్టం 2013కు తెలంగాణ సర్కార్ తెచ్చిన సవరణలకు ముందు గెజిట్‌లో ముసాయిదా ప్రకటించిందీ లేనిదీ తెలియజేయాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ కోరింది. భూసేకరణ నిబంధనలపై తెలంగాణ సర్కార్ తెచ్చిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు వేసిన వ్యాజ్యాన్ని బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. నోటిఫికేషన్‌కు ముందే ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, ముసాయిదాను జనానికి అందుబాటులో ఉంచాలని పిటిషనర్ వాదన. నోటిఫికేషన్‌ను జూన్ 30న జారీ చేసినట్లుగా జూలై 10న వెబ్‌సైట్‌లో పెట్టారని, అంతా గుట్టుగా చేశారన్నారు. విచారణ 8కి వాయిదా పడింది.

గిరిజన బడులకూ ఎస్ఎస్ఏ యూనిఫామ్స్

- పాఠశాల గ్రాంట్ కూడా...!

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠశాల నిర్వహణ గ్రాంట్‌ను సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) అందివ్వనుంది. దీంతో 15 జిల్లాల్లోని 1,408 పాఠశాలల్లో చదువుతున్న 25,237 మంది గిరిజన విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది. విద్యార్థులకు అవసరమైన బట్టలను సరఫరా చేయాలని కోరుతూ చేనేత శాఖ డైరెక్టరుకు ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ జి కిషన్ లేఖ రాశారు. గతేడాది విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఎస్ఎస్ఏ యూనిఫామ్స్ అందించింది. గిరిజన ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేయలేదు. పాఠశాల నిర్వహణ గ్రాంటు కూడా విడుదల చేయలేదు. గిరిజన పాఠశాలల్లోని విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ సరఫరా చేస్తుందని పాఠశాల విద్యాశాఖ, ఆశ్రమేతర పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖే సరఫరా చేయాలని గిరిజన సంక్షేమ శాఖ పట్టుదలతో ఉన్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఇరుశాఖల కమిషనర్లు, కార్యదర్శులతో పలుమార్లు ప్రాతినిధ్యం చేసి ఈ విషయంపై చర్చించారు. దీంతో ఎస్ఎస్ఏ ద్వారానే ఏకరూప దుస్తులు సరఫరా చేయాలని, పాఠశాల నిర్వహణ గ్రాంటును విడుదల చేయాలని ఇరుశాఖలు అంగీకరించాయి. ఈనిర్ణయం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సిరెడ్డి, చావ రవి హర్షం వ్యక్తం చేశారు.

రైల్వే భూమిపైత్వరగా నిర్ణయం తీసుకోండి

రైల్వేశాఖ మంత్రి సురేష్‌ప్రభుకు వినతి

- దత్తాత్రేయ ఆధ్వర్యంలో కలిసిన మంత్రి పద్మారావు, ఎంపీలు



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని లాలాపేట ప్రాంతంలో రైల్వేభూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభుకు తెలంగాణ ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి దత్తాత్రేయ ఆధ్వర్యంలో మంత్రి పద్మారావు, టీఆర్ఎస్ ఎంపీలు మంగళవారం సురేష్‌ప్రభును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పద్మారావు మాట్లాడుతూ... లాలాపేట ప్రాంతంలోని 12.60 ఎకరాల స్థలాన్ని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి కేటాయించాలని సురేష్‌ప్రభుకు విజ్ఞప్తి చేశామని, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు. సమావేశం నుంచే సౌత్ రైల్వేజీఎం వినోద్‌కుమార్ యాదవ్‌కు ఫోన్ చేశారని, ఆ స్థలానికి సంబంధించిన నివేదికలు త్వరతగతిన రూపొందించాలని ఆదేశించారని తెలిపారు. ఇక చర్లపల్లి వద్ద నిర్మించనున్న రైల్వే శాటిలైట్ టెర్మినల్ కోసం రాష్ట్ర ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రమంత్రికి వివరించినట్టు తెలిపారు. ప్రస్తుతం జంట నగరాల్లో స్థలం కొరత తీవ్రంగా ఉందని, రైల్వేభూమిని కేటాయిస్తే పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని పద్మారావు వివరించారు. ఇక ఎంపీ కవిత మాట్లాడుతూ.. రైల్వేస్థలంతో పాటు ఎంపీలకు సంబంధించిన నియోజకవర్గాల్లో రైల్వే పెండింగ్ పనులను సురేష్‌ప్రభు దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు వినోద్‌కుమార్, సీతారాం నాయక్, కొండా విశ్వేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, ప్రత్యేక ప్రతినిధి రామచంద్రుడు తేజావత్, ఓఎస్డీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టండి

- తెలంగాణ భవన్‌లో మౌనదీక్ష
- ప్రధాని దళిత వ్యతిరేకి : ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మౌనదీక్ష చేపట్టారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది తన మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను రాజకీయ కోణంలో చూడొద్దని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ మాదిగలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని బీజేపీ హామీఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి ఒక్క సీటు కూడా రాకుండా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వర్గీకరణ కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఈ తీర్మాన ప్రతులను సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేరుగా ప్రధానమంత్రికి, హోంమంత్రికి అందజేసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని దళిత వ్యతిరేకని తేటతెల్లమైందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అడ్డుపెట్టుకుని వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి బరిలో నిలిచారని ఆరోపించారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జీతం పెంపు!

ఉన్నత విద్యామండలి పరిశీలన

- ఉప ముఖ్యమంత్రి కడియం రాగానే నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలు పెంచే దిశగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) పరిశీలన చేస్తున్నది. వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రస్తుతం రూ.21,600 వేతనం వస్తున్నది. ఆరో వేతన కమిటీ సిఫారసు ప్రకారమైతే మినిమం టైంస్కేల్ రూ.48,600 ఉంది. దీంతో వారి జీతం రూ.48,600 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్టు సమాచారం. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అమెరికా పర్యటన ముగించుకొని రాగానే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపించనున్నారు. వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు అవకాశం లేదని నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీతాల పెంచడంపై ఉన్నత విద్యామండలి దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలు పెంచిన విషయం తెలిసిందే. సోమవారం టీఎస్‌సీహెచ్‌ఈ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లు కే వెంకటాచలం, ఎస్ మల్లేష్, కాకతీయ, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ వర్సిటీల వీసీలు ఆర్ సాయన్న, అల్తాఫ్ హుస్సేన్, రాజారత్నం, సాంబయ్య, కమిటీ సభ్యులు వెంకటయ్య, సదానందం, లక్ష్మినారాయణ, ఓ నర్సింహారెడ్డి, పాపయ్య, రమణారావు, ధన్వంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో పాపిరెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రవేశ పరీక్షల నిర్వహణ, ప్రవేశాల ప్రక్రియపై చర్చించామన్నారు. ఇంజినీరింగ్‌తోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో యాజమాన్య కోటాలో చేరిన విద్యార్థుల ర్యాటిఫికేషన్ల అంశాన్ని చర్చించామని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపైనా అభిప్రాయాలు తెలుసుకున్నామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి రాగానే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

నవచిత్రం

అందుకే మల్టీస్టారర్ సినిమా చేయను..


సుకుమార్

'మనం మార్కెట్ చట్రంలో ఇరుక్కుపోయాం. లిబర్టీగా సినిమాలు తీయాలంటే కంటిన్యూగా సక్సెస్‌లుండాలి' అని అంటున్నారు దర్శకుడు సుకుమార్. అశోక్, ఈషా జంటగా హరిప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన 'దర్శకుడు' చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్ పతాకంపై బీఎన్‌సీఎస్‌పి విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలిసి సుకుమార్ నిర్మించారు. ఈ నెల 4న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో సుకుమార్ ముచ్చటించిన విశేషాలు.. ఆయన మాటల్లోనే..

నా తరహా కథ కాదు..

'దర్శకుడు' చిత్ర కథ నా తరహాలో ఉండదు. నా స్టయిల్‌కి భిన్నంగా ఉంటుంది. అందుకే నాకు బాగా నచ్చింది. ఒక దర్శకుడికి, ఫ్యాషన్ డిజైనర్ మధ్య మొదలైన ప్రేమ ఎలాంటి పలుపులు తిరిగింది?, వృత్తి పట్ల స్వార్థం కలిగిన దర్శకుడు తన ప్రేమను, కెరీర్‌ను ఎలా బ్యాలెన్స్ చేశాడనేది సినిమా. ఇది పూర్తిగా దర్శకుడు హరిప్రసాద్ కథ. నాతోపాటు పనిచేసిన ఫిజిక్స్ లెక్చరర్. సినిమాను చాలా బాగా తెరకెక్కించాడు. సాయికార్తీక్ అద్భుతమైన మ్యూజిక్ అందించాడు. ఈ చిత్రానికి దేవి శ్రీప్రసాద్‌ని మ్యూజిక్ డైరెక్టర్‌గా తీసుకోవచ్చు. హీరో అశోక్ కొత్తవాడు, పైగా మా అన్నయ్య కొడుకు. నా స్వార్థం కోసం దేవిని వాడుకోవద్దనిపించి నేనే వద్దనుకున్నా. విషయం తెలిసి దేవి నాపై కోప్పడ్డాడు.

సహజంగా అద్భుతంగా చేశాడు..

అశోక్ చిన్నప్పట్నుంచి కథలు రాస్తుండేవాడు. నా దగ్గర అసిస్టెంట్‌గా చేస్తానని 'ఆర్య' సినిమా నుంచి అడుగుతున్నాడు. ఇది కష్టమైన జాబ్, వద్దని నేనే దూరం పెట్టా. 'వన్ నేనొక్కడికే' సినిమాకు చేస్తా అన్నాడు. ఆ కథకు ఒక వెర్షన్ రాయమని చెప్పా. చాలా బాగా రాశాడు. అయితే ఈ చిత్రానికి హీరోగా హరిప్రసాద్ తీసుకుంటాననంటే వద్దని చెప్పా. అశోక్‌తో నేను చేయించుకుంటానని హరి చెప్పాడు. వర్క్‌షాప్ నిర్వహిస్తే చాలా బాగా చేశాడు. దీంతో ఓకే చెప్పాను. ఈ చిత్రంలో ఎమోషనల్, సెంటిమెంట్, ఆవేశంగా బిహేవ్ చేసే సన్నివేశాల్లో చాలా అద్భుతంగా, సహజంగా చేశాడు.

భవిష్యత్‌లో కూడా వెళ్ళను..

నేను ఈ చిత్రానికి నిర్మాత అయినప్పటికీ పెద్దగా బర్డెన్ ఫీలవ్వలేదు. మా అన్నయ్య విజయ్‌కుమార్‌తోపాటు థామస్‌రెడ్డి చూసుకున్నారు. ఈ చిత్ర షూటింగ్ జరుగుతున్నప్పుడు ఒక్కరోజు కూడా సెట్‌కు వెళ్లలేదు. దర్శకుడు ఒక వ్యూలో చేస్తున్నప్పుడు దాన్ని మనం డిస్ట్రర్బ్ చేయడం సరికాదని వెళ్లలేదు. భవిష్యత్‌లో కూడా వెళ్లను. భవిష్యత్‌లో ఓ పెద్ద హీరోతో నా బ్యానర్‌లో సినిమా చేయాలని ఉంది. కానీ కొత్త వాళ్ళను పరిచయం చేయడంలో గొప్ప సంతృప్తి ఉంటుంది. దర్శకుడనే వాడు తన వ్యక్తిగత జీవితంలో కంటే వృత్తి జీవితంలో ఎక్కువ సంతృప్తి పొందుతాడు. ఇంట్లో పిల్లలు చేసే అల్లరి వల్ల వచ్చే ఆనందం కంటే ఒక సినిమా సక్సెస్ వచ్చినప్పుడు వచ్చే ఆనందం ఎక్కువ.

జీరో క్రియేటివిటీ అవుతుంది..

ఈ చిత్రంలో దర్శకుడి క్రియేటివిటీ 20శాతమే అనే డైలాగ్ ఉంది. దానిలో చెప్పినట్టుగానే దర్శకుడు క్రియేటివ్‌గా కథను రాసుకుంటాడు. ఆ తర్వాత సినిమాను సెట్ చేస్తాడు. తర్వాత మిగిలిన టెక్నీషియన్లతో కలిసి తీస్తాడు. అందరు అన్నీ చేస్తున్నప్పుడు డైరెక్టర్‌గా నేనేంటి చేసేదని ఒకానొక సందర్భంలో అనిపిస్తుంది. అలాంటప్పుడు తన మార్క్ చూపించడం కోసం షూటింగ్ మధ్యలో జోక్యం చేసుకుని ఇది ఇలా కాదు, అలా కాదని చెబుతుంటాడు (నవ్వుతూ). ఇక్కడ 20 శాతం క్రియేటివిటీ, 80 శాతం మేనేజ్‌మెంట్ ఉంటుంది. అదే మల్టీస్టారర్ సినిమా తీస్తే 100శాతం మేనేజ్‌మెంట్, జీరో క్రియేటివిటీ అవుతుంది. అందుకే మల్టీస్టారర్ సినిమా చేయను.

పల్లెటూరుపై తీయాలనుకున్నా..

నేను పల్లెటూరులోనే పుట్టి పెరిగాను. అక్కడి జీవితం ఎలా ఉంటుందో తెలుసు. ఎప్పుడైనా పల్లెటూరు నేపథ్యంలో సినిమా తీయాలని 'ఆర్య' నుంచి అనుకుంటున్నా. అది 'రంగస్థలం'తో కుదిరింది. 1980లో జరిగే కథ ఇది. కథకు అనుగుణంగా టైటిల్ పెట్టాల్సి వచ్చింది. ఇందులో రామ్‌చరణ్ కొత్త మేకోవర్‌లో కనిపిస్తాడు. నాగలి పట్టుకుని చరణ్ ఉన్న లుక్‌కు మంచి స్పందన వచ్చింది. సమంత కూడా బాగా కష్టపడింది. సినిమా దాదాపు 50శాతం పూర్తయ్యింది. సంక్రాంతికి విడుదల కానుంది. ఇది 100శాతం కమర్షియాలిటీ ఉన్న సెన్సిబుల్ సినిమా.

కథలు రెడీగా ఉండవు..

నా వద్ద కథలకు సంబంధించిన లైన్లు మాత్రమే ఉంటాయి. కానీ కథలు రెడీగా ఉండవు. ఒక సినిమా పూర్తయిన తర్వాతనే మరో కథపై కూర్చుంటాను. అందుకే వేగంగా సినిమాలు చేయలేకపోతున్నా. ఒకేసారి రెండు మూడు పనులు చేయలేను. నాకు సైన్స్‌ఫిక్షన్ తరహా సినిమాలు చేయాలనుంది. దానికి మన మార్కెట్ సరిపోదు. బాలీవుడ్‌లో తీయాలి. మనం మార్కెట్ చట్రంలో ఇరుక్కుపోయాం. అంత బడ్జెట్ వర్కౌట్ కాదు. ఇప్పుడిప్పుడే ఇక్కడ కూడా బయోపిక్ సినిమాలొస్తున్నాయి. మార్కెట్ విస్తరిస్తోంది. ముందుముందు బయోపిక్, సైన్స్‌ఫిక్షన్ వంటి విభిన్న కథా చిత్రాలు కూడా కచ్చితంగా మరిన్ని వస్తాయి. నేనూ చేస్తాను.

ప్రతిభకు ప్రోత్సాహం


ఆనంద్ ప్రసాద్, పూరీ జగన్నాథ్‌లతో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల బాలకృష్ణ అభిమాన సంఘాల అధ్యక్షులు

బాలకృష్ణ 101వ చిత్రం 'పైసా వసూల్' చిత్రాన్ని పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే. భవ్యక్రియేషన్స్ పతాకంపై వి.ఆనందప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ 101వ సినిమాను పురస్కరించుకుని ఆయన పేరు మీద బాలయ్య అభిమానులు, వారి కుటుంబ సభ్యుల్లోని 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న 101 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని చిత్ర నిర్మాణ సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల బాలయ్య అభిమాన సంఘాల అధ్యక్షులు, కన్వీనర్లతో దర్శకుడు పూరీ జగన్నాథ్, నిర్మాత ఆనంద్ ప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత ఆనందప్రసాద్ చెబుతూ, 'బాలకృష్ణతో ఈ చిత్రాన్ని చేయడం చాలా ఆనందంగా, గర్వంగా ఉంది. సినిమా చాలా బాగా వస్తోంది. సెప్టెంబర్ 1న ఈ చిత్రం విడుదల చేస్తున్న నేపథ్యంలో 101 పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని నిర్ణయించాం. ఈ స్కాలర్‌షిప్స్‌కు అర్హత పొందేందుకు తమ దరఖాస్తులను ఆయా జిల్లాలోని బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షులకు ఇవ్వవలసి ఉంటుంది. అయితే రెవెన్యూ శాఖ జారీ చేసిన ఇన్‌కమ్ సర్టిఫికెట్, వైట్ రేషన్ కార్డ్, స్కూల్, కాలేజ్ సర్టిఫికెట్, మార్క్స్ మెమోలను సదరు దరఖాస్తులకు జత చేసి, ఆగస్ట్ 10 లోపు అందజేయాలి. పూర్తి వివరాలకు 'ఎన్‌బికేపైసావసూల్‌డాట్‌కమ్' వెబ్‌సైట్‌ను క్లిక్ చేయాలి. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేస్తాం' అని అన్నారు. 'ఇన్నేండ్ల తర్వాత బాలకృష్ణ గారితో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. అంతేకాదు ఆయనతో సినిమా చేయడానికి ఇంత ఆలస్యమైందని ఫీలవుతున్నా. ఆయనతో పనిచేసిన వారంతా ఎందుకు అభిమానులు అయ్యారనేది అర్థమైంది. జూబ్లీహిల్స్‌లో బాలకృష్ణకు అభిమాన సంఘం ఉంటే నేనూ దానికి అధ్యక్షుడిని అవుతా. ఆయనతో మళ్ళీ మళ్ళీ పనిచేయాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు పూరీ జగన్నాథ్ తెలిపారు.


'జయ జానకి నాయక' చిత్ర ఆడియో ఆవిష్కరణోత్సవ దృశ్యం

లెజెండ్ రేంజ్‌లో సక్సెస్ సాధించాలి..

- 'జయ జానకి నాయక' చిత్ర ఆడియో వేడుకలో వి.వి.వినాయక్

'బోయపాటి శ్రీనుకు అణువణువు సినిమాయే. తన ప్యాషన్ ఎలా ఉంటుందో ఈ సినిమా ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది' అని అన్నారు వి.వి.వినాయక్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యాజైశ్వాల్ హీరో,హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయ జానకి నాయక'. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ వేడుక సోమవారం హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది. అతిథిగా విచ్చేసిన వి.వి.వినాయక్ పాటల సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను పరిచయం చేసిన దర్శకుడిగా నాకు అతని సినిమాలంటే ఒక ఎగ్జైట్‌మెంట్ ఉంటుంది. 'నువ్వు ఏడిస్తే వీణ్ణి చంపేస్తా' అనే డైలాగ్‌ను సాయి చాలా బాగా చెప్పాడు. ఇందులో చాలా మెచ్యూర్డ్‌గా నటించాడు. ట్రైలర్ చూస్తుంటే 'ఛత్రపతి' ఇంటర్వెల్ బ్లాక్ చూసినట్టు అనిపిస్తుంది. సినిమాలో ఉన్న ఏడు పాటలూ అద్భుతంగా ఉన్నాయి. హ్యాట్సాఫ్ టు దేవిశ్రీ ప్రసాద్. సినిమా 'లెజెండ్' అంత విజయం సాధించాలి' అని అన్నారు.

'డిఫరెంట్ స్క్రిప్ట్ ఇది. సినిమాలో నటించేటప్పుడు బోయపాటి అందరికి ఒక హెడ్‌మాస్టర్‌లా ఏ టాస్క్ చేయాలో చెప్పేవారు. సినిమాను చాలా బాగా హ్యాండిల్ చేశాడు. తన కెరీర్‌లో ఇది మరో 'లెజెండ్' అవుతుంది. ఈ చిత్రంతో సాయి శ్రీనివాస్ మరో స్టార్ హీరో అవుతాడు' అని జగపతిబాబు తెలిపారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ, 'ఈ ఏడాది నాలుగు అద్భుతాలు జరిగాయి. అందులో ఒకటి కళాతపస్వీ కె.విశ్వనాథ్‌కి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు రావడం, రెండు 'బాహుబలి 2' దేశవిదేశాల్లోనూ తెలుగువాళ్లందరూ తలెత్తుకునేలా చేయడం, మూడు 'లెజెండ్' సినిమా ఒకే థియేటర్‌లో 1084 రోజులు ఆడటం. నాలుగు చిరంజీవిగారు 'ఖైదీ నెంబర్ 150'తో రీఎంట్రీ ఇచ్చి 150 కోట్లు కలెక్ట్ చేసి తెలుగు సినిమా స్టామినా ఏంటో నిరూపించారు. ఇక సినిమా విషయానికి వస్తే, లైఫ్‌లో కష్టం వచ్చిన ప్రతిసారి ప్రేమను వదిలేస్తాం. కానీ నేను ప్రేమించాను కాబట్టి ప్రేమను వదలను అనే ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. తల్లిదండ్రులు బాగుండాలని కోరుకున్నట్టుగానే ప్రేమించిన అమ్మాయి కూడా బాగుండాలని కోరుకునే పాత్ర హీరోది. ఇలాంటి హీరోను తమ ఇంట్లో ఉండాలని కోరుకుంటారు. ఇది ప్రతి ఒక్కరి హృదయాలను తాకే సినిమా. జగపతిబాబు, రకుల్, సాయి బాగా నటించారు. రిషి పంజాబి కెమెరా వర్క్ అద్భుతం. రవీందర్‌రెడ్డి రాజీపడకుండా నిర్మించారు. ఇది తెలుగు ప్రేక్షకుల హృదయాలను తాకే చిత్రమవుతుంది' అని చెప్పారు.

'నా కెరీర్ ప్రారంభంలోనే ఈ సినిమాతో బోయపాటి ఇచ్చిన సపోర్ట్ మరువలేనిది. ఆయనకు రుణపడి ఉంటాను. ఆయన గొప్పగా సినిమాలు తీస్తారని, ఆయన ట్రాక్ రికార్డులు చెబుతున్నాయి. నా కలను నాన్న(బెల్లంకొండ సురేష్) తన కలగా తీసుకుని నిజం చేశారు' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాల రవీందర్‌రెడ్డి, రకుల్ ప్రీత్ సింగ్, దేవిశ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

నేనూ చేయక తప్పలేదు..

'అమెరికాలో చదువుకునేటప్పుడు పార్ట్‌టైమ్ జాబ్ కోసం కాఫీ షాప్‌లో పనిచేశా' అని తెలిపింది శ్రద్ధాకపూర్. ఇప్పటి వరకు గ్లామర్ తరహా పాత్రలు పోషించిన శ్రద్ధా ప్రస్తుతం ముంబయి లేడీ డాన్, దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ జీవితం ఆధారంగా రూపొందుతున్న 'హసీనా పార్కర్' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ అమెరికాలో చదువుకున్న రోజులను శ్రద్ధా గుర్తు చేసుకున్నారు. 'అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో లిబరల్ ఆర్ట్స్‌లో మాస్టర్ చేశాను. ఆ టైమ్‌లో చాలా మంది మార్నింగ్ టైమ్‌లో ఏదో ఒక పార్ట్‌టైమ్ జాబ్ చేసేవారు. నేను కూడా కాఫీ షాప్‌లో పనిచేశాను. ఆ తర్వాత బ్రెడ్ షాప్‌లో కూడా వర్క్ చేశాను. అది నాకు ఎంతో సంతోషాన్ని, ధైర్యాన్నిచ్చింది. ఫుడ్ అంటే నాకెంతో ఇష్టం. బ్రెడ్ షాప్‌లో పనిచేసేటప్పుడు బాగా తినేదాన్ని' అని శ్రద్ధా తెలిపింది. అపూర్వ లఖియా దర్శకత్వంలో తెరకెక్కిన 'హసీనా పార్కర్' చిత్రం ఈ నెల 18న విడుదల కావాల్సి ఉంది. అయితే ఇదే రోజు షారూఖ్ ఖాన్ నటించిన 'జబ్ హ్యారీ మెట్ సెజల్', అక్షయ్‌కుమార్ 'టాయ్‌లెట్ : ఏక్ ప్రేమకథ' చిత్రాలూ విడుదల కానున్నాయి. దీంతో 'హసీనా పార్కర్' విడుదల తేదీని వాయిదా వేశారు.


శ్రద్ధా కపూర్

గిట్టుబాటు ధరల కోసం..
అన్నదాత సుఖీభవ


ఆర్.నారాయణమూర్తి

ఆర్.నారాయణమూర్తి దర్శకత్వంలో 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఓ చిత్రం ప్రారంభం కానుంది. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ, 'నేను రూపొందిస్తున్న 32వ చిత్రమిది. ఈ నెల 4న సినిమా ఓపెనింగ్ ఉంటుంది. ఇందులో 11 పాటలున్నాయి. రీరికార్డింగ్ కూడా పూర్తయ్యింది. రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఉండే చిత్రమిది. దేశంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న హ్యాపీగా లేడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రస్తుతం గిట్టుబాటు ధర లేదు. దీంతో చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో దేశంలో దాదాపు 60వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని దీన్ని జాతీయ విపత్తుగా భావించి దేశవ్యాప్తంగా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి. పథకం తీసుకురావాలి. రాష్ట్రంలో కూడా సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి రైతు సంక్షేమ పథకాలు చేపడుతున్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరను కూడా కల్పించాలని కోరుకుంటున్నా. అటు ఏపీ ప్రభుత్వం కూడా దీనిపై చర్యలు తీసుకోవాలి' అని అన్నారు.

దేశభక్తి కిరీటం కాదు.. కృతజ్ఞత

సాయిధరమ్ తేజ్, మెహ్రీన్ ఫిర్జాదా జంటగా బి.వి.ఎస్.రవి దర్శకత్వంలో దిల్‌రాజ్ సమర్పణలో అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కృష్ణ నిర్మిస్తున్న చిత్రం 'జవాన్'. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో నిర్మాతలు మాట్లాడుతూ, 'అంచనాలకు మించి ఈ చిత్ర టీజర్ ఉండటంతో అభిమానులు హ్యాపీగా ఉన్నారు. ఈ టీజర్‌లో 'కొంతమంది మనుషులు కలిస్తే కుటుంబం అవుతుంది. కొన్ని లక్షల కుటుంబాలు కలిస్తే దేశం అవుతుంది. దేశభక్తి అనేది కిరీటం కాదు. కృతజ్ఞత..' అంటూ దర్శకుడు బి.వి.ఎస్.రవి చెప్పిన వాయిస్ ఓవర్ ఆలోచనాత్మకంగా, సందేశాత్మకంగా ఉంది. దేశానికి జవాన్ ఎంత అవసరమో, ప్రతి ఇంటికి మా కథానాయకుడు లాంటి వాడు ఉండాలని చెప్పడమే ఈ చిత్ర ఉద్దేశం. ఇందులో సాయి ధరమ్‌తేజ్‌ని కొత్త చూపించబోతున్నాడు దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.


'జవాన్'లో సాయి ధరమ్ తేజ్, మెహ్రీన్

నవ్వించే దెయ్యం


సాక్షి కక్కర్, శ్రీనాథ్ మాగంటి

వి.రవివర్మ దర్శకత్వంలో ఏ.వి.రమణమూర్తి సమర్పణలో చిన్మయినంద ఫిల్మ్స్ పతాకంపై ఎస్.సరిత నిర్మిస్తున్న చిత్రం 'ఇదేం దెయ్యం'. ఇందులో శ్రీనాథ్ మాగంటి, సాక్షికక్కర్, రచన స్మిత్, రుచి పాండే హీరోహీరోయిన్లు. ఈ నెల 4న విడుదల కానున్న ఈ చిత్రం గురించి సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో మాట్లాడుతూ, 'హాస్యానికి పెద్ద పీట వేస్తూ తెరకెక్కించిన సినిమా ఇది. భయపడే సన్నివేశాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అవన్నీ ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయి. రచ్చరవి, ఆర్.పితో నా కాంబినేషన్‌లో వచ్చే సీన్స్ బాగుంటాయి. తెలుగు ప్రేక్షకులంతా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు. 'శ్రీనాథ్ కొత్త కుర్రాడైనా చక్కగా నటించాడు. ఇందులో కామెడీ హైలైట్‌గా నిలుస్తుంది. హర్రర్ సన్నివేశాలు ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తాయి. ఈ నెల 4న వంద థియేటర్లలో సినిమాను రిలీజ్ చేస్తున్నాం' అని దర్శకుడు తెలిపారు. సంగీత దర్శకుడు బాలుస్వామి చెబుతూ, 'మా దెయ్యాలు భయపెడుతూనే నవ్విస్తాయి. ఇటీవల విడుదలైన ఆడియోకు శ్రోతల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. సినిమా కూడా పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాక్షికక్కర్, డిస్ట్రిబ్యూటర్ రామకృష్ణ, ఆర్.పి, రచన స్మిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌కార్డ్ తిప్పలు..

రమ్స్ దర్శకత్వంలో శతృఘ్న రాయపాటి, స్టెఫానీ, జోసెలిన్ ప్రధాన పాత్రధారులుగా మాస్టర్ దేవాన్ష్ సమర్పణలో సింహా ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీనివాస్ గుప్తా, మోహన్.ఆర్, నరసింహ, నాగశ్రీనివాస్‌రెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'గ్రీన్‌కార్డ్'. సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ, '90శాతం సినిమాను అమెరికాలోనే చిత్రీకరించాం. అమెరికా లైఫ్ ఎలా ఉంటుందన్న విషయాలను సినిమాలో చూపించాం. అమెరికాలో ఉన్న వారికి కూడా తెలియని చాలా విషయాలు ఇందులో ఉంటాయి. కథ అంతా సరదాగా సాగిపోతుంది. ఈ నెల 4న విడుదల చేయనున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఇండియా నుంచి అమెరికాకు వెళ్లేవారు గ్రీన్ కార్డ్ కోసం ఎన్ని తిప్పలు పడతారనే కాన్సెప్ట్‌తో దర్శకుడు రమ్స్ ఈ చిత్రాన్ని ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కించారు. తెలుగు ప్రేక్షకులకు కొత్త ఫీల్‌ను ఇచ్చే సినిమా ఇది. అలరించడంతోపాటు ఆలోచింపచేస్తుంది' అని నటుడు చలపతిరావు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నరసింహ చెబుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. ఇందులో చలపతిరావు పాత్ర హైలైట్‌గా ఉంటుంది' అని చెప్పారు.


రమ్స్, చలపతిరావు, ఏంజెలినా

భవిష్యత్‌లో ఆదరణ గ్యారంటీ..


నరసింహ నంది

దర్శకుడు నరసింహనంది రూపొందించిన 'బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్' చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నరసింహనంది మాట్లాడుతూ, 'ఇరానియన్ సినిమా 'ది కౌ' స్ఫూర్తితో ఈ చిత్రాన్ని రూపొందించాను. ఓ రోజు హైవేపై వెళ్తున్నప్పుడు సంపన్న కుటుంబానికి చెందిన వాహనం రోడ్డుపై ఉన్న ఓ గేదెను ఢీకొట్టింది. అయినా వాళ్ళు ఏమాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోతారు. దీంతో ఆ గేదె చనిపోతుంది. తన కుటుంబానికి జీవనాధారమైన గేదె చనిపోవడంతో ఆ రైతు చాలా ఇబ్బంది పడతాడు. ఈ అంశాన్ని జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాను. మూగ జీవులను కూడా మనుషుల్లాగా చూడాలనే చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం. నా మార్క్ విలువలుంటూనే, కమర్షియల్ అంశాలను మేళవించి రూపొందించాను. నేను కమర్షియల్ సినిమాలు తీయాలని ఇండస్ట్రీలోకి రాలేదు. సహజమైన, యదార్థ అంశాలతో సినిమా తీయాలని వచ్చా. కొన్ని సంవత్సరాల తర్వాత చూసుకుంటే మనకంటూ ఒక పేజీ ఉండాలన్నదే నా లక్ష్యం. నేను రూపొందించిన '1940లో ఓ గ్రామం' చిత్రానికి జాతీయ అవార్డు వచ్చింది. 'కమలతో నా ప్రయాణం' సినిమాకు నంది అవార్డు వచ్చింది.

నా సినిమాలు థియేటర్‌లో ఆడకపోయినా తర్వాత అవార్డుల రూపంలోనో, ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించడం ద్వారానో పెట్టిన డబ్బు వస్తుంది. అందుకే ఆర్ట్ తరహా సినిమాలే తీయాలని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్‌లోనైనా నా తరహా సినిమాలకు ఆదరణ ఉంటుంది. ఆ కోవలోకే అందరు వస్తారని భావిస్తున్నాను. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న కాన్సెప్ట్‌తో 'ఉత్పలమాల ఉత్తరం రాసింది' పేరుతో ఓ సినిమాను రూపొందిస్తున్నాను. గోపీచంద్ రాసిన 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాను. సాహిత్యంలోని పదాలు పాత్రలుగా మారితే వాటి ఫీలింగ్ ఎలా ఉంటుందనేది ఈ చిత్రంలో చూపించడం జరుగుతుంది. ఇప్పటికే 70శాతం షూటింగ్ పూర్తయ్యింది. ఆ తర్వాత వ్యవసాయం మీద ఓ సినిమా చేయబోతున్నాను. ఇప్పుడు జెనరేషన్ అంతా టెక్‌లు అనుకుంటూ వెళ్తున్నారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యవసాయం దండగ కాదు, పండగ అని చెప్పడమే ఆ చిత్ర ఉద్దేశ్యం' అని అన్నారు.

ఎమోషనల్ లవ్‌స్టోరీ నేపథ్యంలో..

అనిష్ చంద్ర, పావని, ఆర్యన్, పూర్ణి ప్రధాన పాత్రధారులుగా ధృవ శేఖర్ దర్శకత్వంలో ప్రవీణ్ గాలిపల్లి సమర్పణలో ప్లాన్ బి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రేయ ఆర్ట్ క్రియేషన్స్ పతాకాలపై భరత్ అవ్వారి నిర్మిస్తున్న చిత్రం 'లవర్స్ క్లబ్'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత భరత్ అవ్వారి మాట్లాడుతూ, 'ఈ ఏడాది పెద్దసినిమాలతోపాటు చిన్న సినిమాలు కూడా విజయం సాధించి కంటెంట్ ఈజ్ కింగ్ అని నిరూపించాయి. అదే ధైర్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. మొట్ట మొదటిసారిగా ఎమోషనల్ లవ్‌స్టోరీతో తెరకెక్కించిన చిత్రమిది. ఇటీవల విడుదల చేసిన పోస్టర్స్, టీజర్‌కు మంచి స్పందన లభించింది. పక్కా ఎమోషనల్‌గా మా కంటెంట్ అందరిని ఆకట్టుకుంటుంది. కొత్త వారితో చేసినా మెచ్యూర్డ్ నటనను దర్శకుడు రాబట్టుకున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'లవర్స్‌కి అండగా నిలబడే ఒక యువకుడి జీవితంలో కొన్ని అనుకోని సమస్యలు వస్తే వాటిని ఎలా ఎదుర్కొన్నాడన్నదే చిత్ర కథాంశం. యదార్థ సంఘటనలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాను. ఫస్ట్‌టైమ్ ఐ ఫోన్ టెక్నాలజీని ఉపయోగించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇంతవరకు ఎవరు తీయని విధంగా ఈ టెక్నాలజీతో మేం తీశాం. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. టీమ్ అంతా ఎనర్జిటిక్‌గా పనిచేసింది. స్క్రీన్ మీద కూడా అదే ఎనర్జి కనిపిస్తుంది. ఈ నెలలోనే విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాను' అని దర్శకుడు ధృవశేఖర్ తెలిపారు.


'లవర్స్ క్లబ్'లో పావని, అనిష్ చంద్ర

ప్రఖ్యాత శాస్త్రవేత్త పీఎం భార్గవ కన్నుమూత

సీసీఎంబీ స్థాపనలో క్రియాశీలక పాత్ర

- మూఢనమ్మకాలను వ్యతిరేకించిన మేధావి
- 4న జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో అంత్యక్రియలు
- పలువురి సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/ఉప్పల్/ ఉస్మానియాయూనివర్సిటీ

సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త పుష్పామిత్ర (పీఎం) భార్గవ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయస్సు ప్రస్తుతం 89 ఏండ్లు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. భార్గవకు కుమారుడు మోహిత్, కుమార్తె వినీత ఉన్నారు. ఆయన సతీమణి మనోరమ ఏడాది క్రితమే మరణించారు. భార్గవ భౌతిక కాయాన్ని ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఉంచారు. ఈనెల 4న మహాప్రస్థానం జూబ్లీహిల్స్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన భారతదేశంలోనే ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరుగాంచారు. సీసీఎంబీ స్థాపనలో క్రియాశీలక పాత్ర పోషించారు. సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్‌గా సేవలం దించారు. ఆయన అందించిన సేవలకుగాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరిం చింది. రచయితలు, శాస్త్రవేత్తలపై ఎన్డీయే ప్రభుత్వం అనుసరించిన వైఖరికి నిరసనగా 2015లో పద్మభూషణ్ పురస్కారాన్ని భారత ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు.

రాజస్థాన్‌లో పుట్టి...

పీఎం భార్గవ 1928, ఫిబ్రవరి 22న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు డాక్టర్ రామచంద్ర భార్గవ, గాయత్రి భార్గవ. ఆయన పదేండ్ల వయస్సులోనే వారణాసికి వచ్చారు. అక్కడే బసంత్ థియోసాఫికల్ స్కూల్‌లో నేరుగా తొమ్మిదో తరగతిలో చేరారు. యూపీలో ప్రఖ్యాతి గాంచిన క్వీన్స్ కాలేజీలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. 1944లో బీఎస్సీ (ఎంపీసీ) డిగ్రీ పట్టా పొందారు. 1946లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేశారు. లక్నో విశ్వవిద్యాలయంలో 21 ఏండ్లకే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పట్టా పొందారు.


సతీమణి మనోరమతో...


పలువురు నివాళి

లక్నో విశ్వవిద్యాలయంలో పరిశోధన ప్రారంభం

లక్నో విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో చేరారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశాన్ని ఎంచుకొని పరిశోధన ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో సెంట్రల్ ల్యాబొరేటరీస్‌లో సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ చేశారు. ప్రస్తుతం అది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)గా ప్రఖ్యాతి గాంచింది. మెకార్డిల్ మెమోరియల్ ల్యాబొరేటరీ ఆఫ్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్‌డాక్టోరల్ కోసం అమెరికా వెళ్లారు. 1956 నుంచి 57 వరకు యూకేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్‌లో పనిచేశారు. 1958లో తిరిగి హైదరాబాద్‌కు వచ్చి సెంట్రల్ ల్యాబొరేటరీస్‌లో సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)లో శాస్త్రవేత్తగా చేరారు. అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీతోపాటు 50 దేశాలను ఆయన పర్యటించారు. ఆయన 125 సైంటిఫిక్ పబ్లికేషన్లను ప్రచురించారు. 1977, ఏప్రిల్ ఒకటిన సీసీఎంబీ స్థాపనలో పీఎం భార్గవ క్రియాశీలక పాత్ర పోషించారు. సీసీఎంబీ లోనే ఎక్కువ పరిశోధన పత్రాలు సమర్పించారు. 1990లో సీసీఎంబీ డైరెక్టర్ బాధ్యతల నుంచి పదవీ విరమణ పొందారు. అనంతరం సీఎస్ఐఆర్‌లో పరిశోధనలు చేసి 1993లో అక్కడి నుంచీ విరమణ పొందారు.

సైన్స్ వ్యాప్తికి విశేష కృషి

భారత ప్రభుత్వం రూపొందించిన పలు విధానాల్లోనూ పీఎం భార్గవ తనదైన ముద్ర వేశారు. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ చైర్మెన్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డ్ సభ్యునిగా పనిచేశారు. సుప్రీం కోర్టులో జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ నామినీగా పనిచేశారు. మూఢనమ్మకాలను వ్యతిరేకించారు. సమాజంలో సైన్స్ వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు. జాతీయ భావాన్ని పెంపొందించడానికి పనిచేశారు. అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియా (ఏఎస్‌డబ్ల్యూఐ) సభ్యునిగా కొనసాగారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, సైన్స్ చరిత్రను ప్రజలకు వివరించడానికి 1963లో సతీష్ ధావన్, అబ్దుర్ రెహమాన్‌తో కలిసి నేషనల్ సొసైటీ ఫర్ ద సైంటిఫిక్ టెంపర్‌ను ఆయన స్థాపించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం హైదరాబాద్‌లోని ఐఐసీటీలో 1964లో అంతర్జాతీయ సింపోజియం నిర్వహించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జరిగిన అనేక సమావేశాలు, సదస్సుల్లో ఆయన పాల్గొని తన అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలోని జాతీయ వాదుల్లో ఆయనొకరుగా ప్రసిద్ధి చెందారు. దేవుడు, దెయ్యం వంటి వాటిని వ్యతిరేకించారు. ద ఏంజెల్స్, డెవిల్ అండ్ సైన్స్ పుస్తకాన్ని ఆయన రచించారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని కోరుతూ 1976లో 42వ రాజ్యాంగ సవరణ కోసం ఆయన చేసిన కృషి ఫలించింది. ఎన్డీయే ప్రభుత్వం 2000 సంవత్సరంలో విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆయన వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేస్తే సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాల్ చేశారు. అక్కడా తిరస్కరించడంతో అనేక పుస్తకాల ద్వారా సమాజంలోకి తన అభిప్రాయాలను వెల్లడించారు.


రాజీవ్‌గాంధీతో...

ప్రజా శాస్త్రవేత్తను కోల్పోయాం : సీపీఐ(ఎం)

ప్రముఖ ప్రజా శాస్త్రవేత్త డాక్టర్ పీఎం భార్గవ మృతికి సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన రంగాల్లో నిజాయితీ, నిబద్ధతగల ఒక ప్రజా శాస్త్రవేత్తను కోల్పోయామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నిరంతరం మతోన్మాదానికి, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని తెలిపారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణకు అనుకూలంగా ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు చేసిన సందర్భంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఆయన తన పద్మ విభూషణ్ అవార్డును తిరిగి ఇచ్చారని తెలిపారు.

పీఎం భార్గవ రచనలు : ప్రొటీన్స్ ఆఫ్ సెమినల్

ప్లాస్మా, ద సాగా ఆఫ్ ఇండియన్ సైన్స్ సిన్స్ ఇండిపెం డెన్స్, ఏంజెల్స్, డెవిల్ అండ్ సైన్స్, ఎజెండా ఫర్ ద నేషన్, యాన్ అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ద యూపీఏ గవర్నమెంట్, ద టూ ఫేసెస్ ఆఫ్ బ్యూటీ, సైన్స్ అండ్ ఆర్ట్.

పలువురి సంతాపం

పీఎం భార్గవ మరణవార్త తెలుసుకున్న సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా, మాజీ డైరెక్టర్లు సీహెచ్ మోహన్‌రావు, లాల్‌జీ సింగ్, జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్, పలువురు శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న ప్రశాంత్‌నగర్‌లో ఆయన నివాసానికి వచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు.

గొప్ప శాస్త్రవేత్త : సీపీఐ

పీఎం భార్గవ గొప్ప శాస్త్రవేత్త అని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సీసీఎంబీని స్థాపించారని తెలిపారు. మానవత్వంతో పరిశోధనలు చేశారని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకించారని తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక దిగ్భ్రాంతి

పీఎం భార్గవ మృతికి జనవిజ్ఞాన వేదిక తెలంగాణ దిగ్భ్రాంతి ప్రకటించింది. దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడంలో మార్గదర్శిగా నిలిచారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి టి శ్రీనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు చేయడంలో భారతదేశ ఖ్యాతిని నిలబెట్టిన మహామనిషి అని పేర్కొన్నారు. సీసీఎంబీని స్థాపించి పరిశోధనలను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. భార్గవ మృతి శాస్త్ర ప్రచార ఉద్యమ సంస్థలకు తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన బాటలో నడిచి శాస్త్రీయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.



గో-టెర్రరిస్టులను నిషేధిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలి : చంద్రకుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గోవధ పేరుతో దళితులు, ముస్లింలపై దాడులకు పాల్పడుతున్న గో-ఉగ్రవాదులను నిషేధిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఆవాజ్ డిమాండ్ చేసింది. 'గో-టెర్రరిజాన్ని నిషేధించాలి' అనే అంశంపై ఆవాజ్ రాష్ట్ర శాఖ మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలన ఏవిధంగా ఉందో తెలంగాణ రాష్ట్రంలో కూడా కేసీఆర్ పాలన అలాగే ఉందని ఎద్దేవా చేశారు. గో సంరక్షకుల పేరుతో గో-టెర్రరిస్టులను పెంచిపోషిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ గో మాంసం తరలిస్తున్నారంటూ దళితులు, ముస్లింలపై దాడులు చేయించి దారుణంగా హత్యలు చేయిస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ టీఆర్ఎస్ శ్రేణుల్ని దళితులపై ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. గో సంరక్షణ పేరుతో అధికార బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు బరితెగించి ఉపన్యాసాలు ఇవ్వడం, రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం వల్లే గో-టెర్రరిస్టులు పెట్రేగి పోతున్నారన్నారు. వీరి అండదండలతోనే గో టెర్రరిస్టులు దళితులు, ముస్లింలను టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఉత్తరాధి రాష్ట్రాల్లో గో-టెర్రరిస్టుల చేతిలో అనేక మంది ప్రాణాలు కోల్పోతే ఇప్పటి వరకు ఒక్కర్ని కూడా అరెస్టు చేసిన దాఖలు లేవన్నారు. గోవధ పేరుతో దాడులకు పాల్పడుతున్న గో టెర్రరిస్టులను నిషేధిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సమావేశాలు ఇటీవల గోవాలో జరిగాయని, ఈ సమావేశాల్లో పాల్గొన్న సంఘపరివార్ మొత్తం రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని మార్చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. అందుకే గో-టెర్రరిస్టులు ఇన్ని దాడులకు పాల్పడుతున్నా ఒక్కరిపై కూడా కేసులు నమోదవ్వడంలేదన్నారు. మోడీ పాలనలో దశవ్యాప్తంగా ముస్లింలు, దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆవాజ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ గో సంరక్షకుల పేరుతో ముస్లింలు, దళితులపై దాడులకు పాల్పడుతున్న గో-టెర్రరిస్టులను నిషేధించాలని డిమాండ్ చేశారు. గోవధపై నిషేదం విధించిన నాటి నుంచి ఇప్పటి వరకు రాజస్థాన్‌లోని ఓ గోశాలలో నాలుగు వందల గోవులు మృత్యువాత పడ్డా పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఇంకో పక్కేమో గో సంరక్షణ పేరుతో గో-టెర్రరిస్టులు దేశవ్యాప్తంగా దళితులు, ముస్లింలపై దమనకాండ సృష్టిస్తున్నారని, వీరిని నిషేధిస్తూ పార్ల మెంట్‌లో చట్టం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా గోమాంసం నిషేధి ంచినా గోవాలో అలాంటి పరిస్థితి రాకుండా చూస్తానని ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి మనోహర్ పారికర్ బహిరంగ ప్రకటన చేయడంలో ఆంతర్య మేమిటని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గో మాంసానికి కొరత లేకుండా చేస్తున్న సంఘపరివార్ ఇతర రాష్ట్రాలో దళితులు, ముస్లింను టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు సిరాజ్ ఖాన్, హైదరాబాద్ జిందాబాద్ అధ్యక్షులు అమీ న్, ఆవాజ్ సిటీ సెక్రెటరీ అలీ, సిటీ వైస్ ప్రెసిడెంట్ పాషా, ఎస్సీఎస్టీ,బీసీ, మైనారిటీ సంఘాల సంఘం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతుల పట్ల అసభ్య ప్రవర్తన

నవతెలంగాణ - రాజేంద్రనగర్

షాపింగ్ కోసం ఆటోలో వెళ్తున్న ఇద్దరు యువతులను ఆరుగురు యువకులు వెంబడించి అసభ్యంగా ప్రవర్తించారు. ఈఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువతి (17) సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో తన వదినతో కలిసి షాపింగ్‌కు ఆటోలో బయల్దేరింది. అయితే శాస్త్రీపురం వద్దకు రాగానే ఆరుగురు వ్యక్తులు ఆటోను వెంబడించారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఆటోడ్రైవర్‌ను బెదిరించి ముగ్గురు వ్యక్తులు ఆటోలోకి వెళ్లి యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. వారు గట్టిగా కేకలు వేయడంతో ఆరుగురు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధిత మహిళలు వెంటనే వచ్చి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురి కోసం గాలింపు చేపట్టారు. అయితే ఈ ఆరుగురిలో ఇద్దరు ఎంఐఎం పార్టీకి చెందిన నాయకుల కొడుకులుగా గుర్తించారు. దీంతో వారు ఈకేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని.. అదేవిధంగా పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని యువతుల బంధువులు ఆరోపిస్తున్నారు.

14 గ్రామాలకు మియాపూర్ భూదాహం

నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మియాపూర్ ప్రాంతంలోని అత్యంత ఖరీదైన భూభాగోతం 693 ఎకరాలేకాదని, గ్రామాలకు గ్రామాలకు ఈ భూకుంభకోణం విస్తరించిందని వాదనలపై హైకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. మియాపూర్ భూదందాపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ న్యాయవాది, బీజేపీ అధికార ప్రతినిధి అయిన పిటిషనర్ ఎం. రఘునందన్‌రావు హైకోర్టును కోరారు. మొత్తం 14 గ్రామాల్లోని ప్రయివేటు భూమి కూడా అన్యాక్రాంతమైందని, మరో 700 ఎకరాల భూకుంభకోణం జరిగిందని, వీటిపై బ్యాంకుల ద్వారా అప్పులు కూడా తీసేసుకున్నారని, దీనికి చెందిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన బెంచ్ ద ష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలన్నీ అఫిడవిట్ ద్వారా తమకు తెలియజేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఆ వివరాలన్నీ పరిశీలించాకే ప్రతివాదులకు నోటీసులు ఇస్తామని స్పష్టం చేసిన బెంచ్ విచారణ 8వ తేదీకి వాయిదా వేసింది. హఫీజ్‌పేటలోని సర్వే నెంబర్ 77లోని భూముల వివరాలు తెప్పించుకోవాల్సివుందన్నారు.

9న గిరిజన దినోత్సవం: టీఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఈనెల 9న ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా జరిగే వారోత్సవాల్లో విద్యార్థులంతా పాల్గొనాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చందునాయక్, శోభన్‌నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనీ, ఎస్టీ బ్యాక్‌లాగ్‌పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

టార్చి లైట్ల వెలుగులో ఆపరేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయలేని ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం ఎలా అందిస్తుందని పలువురు రోగులు ప్రశ్నిస్తు న్నారు. 'కనీస పరికరాలు, వసతులు అందుబాటులో లేకు ండా వైద్య సేవ లు ఎలా అందిస్తాం? ఆపరేషన్లు ఎలా చేస్తాం? పరికరాలు అందుబాటులో లేకపోవటం వల్లే ఆపరేషన్లలో జాప్యం అవుతున్నది. ఇదేమి తెలవని రోగుల బంధువులేమో మీ నిర్లక్ష్యం వల్లే చనిపోతున్నారని మాపై దాడి చేస్తున్నారు' అని అక్కడి డాక్టరు కూడా వాపోతున్నారు.

ఆస్పత్రిలో ఒకే ఈసీజీ..

అత్యవసర రోగులకు ముందుగా చికిత్సలు నిర్వహించేందుకు చేయాల్సిన పరీక్షల్లో షుగర్, బీపీ చెకప్‌ల తోపాటు ఈసీజీ అవసరం. ప్రథమంగా ఈసీజీ ఆధారంతో రోగి పరిస్థితి గురించి తెలుసుకుని చికిత్సలు నిర్వహిస్తారు. ఓపీ ఎమర్జెన్సీ, ఐపీ ఎమర్జెన్సీకి ఒకే యంత్రం ఉంది. బీపీ, షుగర్, ఈసీజీ యంత్రాలు కూడా ఎప్పుడు ఆగిపోతాయో? ఎప్పుడు పనిచేస్తాయో? తెలియని పరిస్థితి నెలకొంది.

మెడిసిన్ అవుటాఫ్ స్టాక్

ఆపరేషన్ చేసినవారికి, అత్యవసర రోగులకు ఇవ్వాల్సిన మెడిసిన్ విభాగంలో ఎప్పుడూ అవుటాఫ్ సర్వీస్ బోర్డు తగిలించి ఉంటున్నది. మందులు బయట తెచ్చుకోవాలని చీటీలో రాసి రోగుల బంధువులకు ఇస్తున్నారు. కనీసం ఎన్ఎస్ గ్లూకోజ్ బాటిల్ కూడా సమయానికి సరఫరా కావడం లేదంటే ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యం ఏ స్థాయిలో అందుతుందో ఇట్టే అర్థమవుతున్నది. దీనిపై దృష్టిసారించాల్సిన ఆస్పత్రి యంత్రాంగం, ప్రభుత్వమూ పట్టించుకోవట్లేదు.

జీఎస్టీ దెబ్బకు ఉత్పత్తి ధమాల్

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి దాపు రించిందని తయారీదారులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇలా ఎంతకాలం కొనసాగుతుందన్నదానిపై నిపుణులు సైతం అంచనా వేయలేకపోతున్నారు. దీంతో, తయారీ రం గం విస్తరణ, నూతన ఉద్యోగాల సృష్టిపై స్పష్టత కరువైంది. నోట్ల రద్దు తర్వాత తయారీ రంగంపై దాని ప్రభావం ఏవిధంగా ఉందో పీఎంఐని పరిశీలిస్తే అర్థమవుతుంది.

గతేడాది నవంబర్ 8న పెద్ద నోట్ల రద్దు జరగగా, ఆ తర్వాతి నెల డిసెంబర్‌లో పీఎంఐ సూచీ ఒక్కసారిగా పడిపోయి 49.6 పాయింట్లకు దిగజారింది. ఆ తర్వాత జనవరిలో కొంత పుంజుకొని 50.4గా నమోదైంది. ఫిబ్రవరిలో 50.7, మార్చిలో 52.5, ఏప్రిల్‌లోనూ 52.5, మే నెలలో మళ్లీ కిందికి జారి 51.6గా పీఎంఐ నమోదైంది. తయారీరంగంలో పీఎంఐ 50 శాతానికన్నా పైగా ఉంటే ఈ రంగం విస్తరిస్తున్నట్టుగా, వృద్ధిలో ఉన్నట్టుగా భావిస్తారు. 50 శాతానికన్నా తక్కువగా నమోదైతే క్షీణ దశకు చేరుకున్నట్టుగా భావిస్తారు.

పీసీసీ రాష్ట్ర వ్యవహారాల

ఇన్‌చార్జి కుంతియా

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పనిచేస్తుందని కాంగ్రెస్ అధిష్టానం భావించింది. అయితే తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాలేదు. ఏపీలో ఒక్కస్థానం కూడా గెలవలేదు. దీంతో ఆయనపై నేతల్లో వ్యతిరేకత వ్యక్తమవుతూ వచ్చింది. ఎన్నికల అనంతరం ఆయనను తప్పిస్తారని ప్రచారం జరిగింది. ఈ మూడేండ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీని గాడిపెట్టే ప్రయత్నంలోనూ ఆయన విఫలమయ్యారని ప్రచారం జరిగింది. పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలను, కుమ్ములాటలను ఆయన పరిష్కరించి, నేతల మధ్య సమన్వయం, సర్దుబాటు చేయలేకపోయారనే విమర్శ ఉంది. ఆయన ఎదుటే ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి కొట్టుకున్నారు.

ఇటీవల ఆయన ట్విట్టర్‌లో చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌పార్టీకి ఇబ్బందికరంగా మారాయని రాష్ట్ర కాంగ్రెస్‌నేతలు అభిప్రాయపడ్డారు. వాటిని సమర్థించుకోలేక నేతలు ఇబ్బందులు పడ్డారు. అయితే మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు ఉండడంతో దిగ్విజయ్‌సింగ్ ఆ రాష్ట్రానికి ఇన్‌చార్జిగా పంపించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌పై పార్టీపై దృష్టి సారించేందుకు ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సమయంలో తెలంగాణకు మరో ఇన్‌చార్జిని నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. కుంతియా రాకతో ప్రస్తుతానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మార్పు ఉండకపోవచ్చు అని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

మధ్యప్రదేశ్ హైకోర్టు ఎదుట జడ్జి ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

శ్రీవాస్.. మధ్యప్రదేశ్ హైకోర్టు ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. నిబంధనల ప్రకారం.. న్యాయమూర్తులను మూడేండ్లకోసారి బదిలీ చేయాలి. కానీ, కుట్రపూరితంగా తనను 15 నెలల్లో నాలుగుసార్లు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయమూర్తి, రిజిస్ట్రార్ జనరల్‌కు మొర పెట్టుకున్నా.. చర్యలు తీసుకోలేదని ఆయన వాపోయారు. బుధవారం కూడా ధర్నా చేస్తానని, న్యాయం జరిగేవరకూ పోరాటం ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆందోళన బాట పట్టిన తనపై హైకోర్టు చర్యలు తీసుకుంటుందని తెలుసని, ఉద్యోగం కూడా పోవచ్చని అన్నారు. కానీ, కొందరు వ్యక్తులకు తాను దీర్ఘకాలం భయపడేది లేదని తేల్చి చెప్పారు. అంతేకాక, తనను అరెస్టు చేసి జైలుకు పంపే అవకాశం ఉన్నదని, దీనికి సిద్ధపడే ఉన్నానని శ్రీవాస్ చెప్పారు. న్యాయశాఖలో సంస్కరణలు తేవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జడ్జి సత్యాగ్రహం పేరుతో నిరసనకు దిగటంతో పలువురు న్యాయవాదులు ఆయనకు మద్దతుగా నిలిచారు.

2వేల కోట్లతో ఎస్సారెస్పీ పునర్జీవన పథకం

(మొదటిపేజీ తరువాయి)

పథకానికి రూ. 1000 కోట్లు, ఆధునీకరణకు రూ. 1000 చోట్ల చొప్పున కేటాయించినట్టు తెలియజేశారు. గతంలోని ఆంధ్రాపాలకులు ఎస్సారెస్పీలో నీరు లేకుండా చేశారని, అసలు పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్సారెస్పీ ప్రధాన కాలువల్లో 6 వేల క్యూసెక్కుల నీరు కూడా పారలేదని, ఎనిమిదిన్నర క్యూసెక్కుల నీరు పారేలా ఎస్సారెస్పీ ప్రధాన కాలువల ఆధునీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదన్నారు. కాళేశ్వరం వరద కాలువ ద్వారా నీళ్లు మళ్లించడంతో పూర్తి స్థాయిలో సాగునీరు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆంధ్రాలోని ప్రాజెక్టులన్నింటినీ ఆధునీకరించినా తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టును కూడా పట్టించుకోలేదని విమర్శించారు. సదర్మట్ రిజర్వాయర్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని తెలిపారు. గతంలో చెరువుల పునరుద్ధరణను ఎవరూ పట్టించుకోలేదని, ఘనపురం ఆయకట్టు ఎత్తు పెంచడం, కాలువల ఆధునీకరణకు సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని వివరించారు. ఇప్పుడు బ్రహ్మాండంగా ఆయకట్టు జరుగుతున్నదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, ఈసారి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఉన్న ప్రాజెక్టులను స్థిరీకరించి, ఆధునీకరిస్తామన్నారు. కొత్తప్రాజెక్టులను చేపడతామన్నారు. సీఎం కేసీఆర్ ఒక రైతు కాబట్టే వ్యవసాయానికి కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తున్నారని తెలియజేశారు. మిషన్ కాకతీయతో ఆయకట్టు భారీగా పెరిగిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండినా ఒక్క గింజ కూడా వదలకుండా కొన్నామని తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని మంత్రి వివరించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.7 వేల కోట్లు చెల్లించామన్నారు. రైతులకు ఏడాదికి ప్రతి రైతుకు ఎకరాకు రూ.8 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. రూ.1024 కోట్లతో ప్రతీ మండల కేంద్రంలో గోదాము ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ ఇస్తున్నం, ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చేశామన్నారు. మిషన్ కాకతీయతో నాలుగున్నర లక్షల ఎకరాల సాగు విస్తరణ పెరిగిందని వివరించారు. రైతులకు ప్రభుత్వం రూ.17 వేల కోట్ల మేర పంట రుణాలు మాఫీ చేసిందని చెప్పారు.

పేదలపై దోపిడీ ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

పెద్దపెద్ద హామీలు ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదు' అని ఆయన ప్రశ్నించారు.

చెప్పిందొకటి..చేస్తున్నది మరొకటి : సీతారాం ఏచూరి

పేదలకు వంటగ్యాస్‌ను సబ్సిడీపై అందించేందుకు వీలుగా ప్రధానమంత్రి పిలుపు మేరకు కోట్లాది మంది గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకున్నారని సీపీఐ(ఎం) ఎంపీ సీతారాం ఏచూరి గుర్తు చేశారు. కానీ కేంద్ర సర్కారు ప్రతి నెల రూ.4 పెంచి ప్రతి ఒక్కరిపైనా భారాలు మోపిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం జుమ్లా సర్కారు అని, చెప్పిందొకటి చేస్తోంది మరొకటని ఎద్దేవా చేశారు.'పేద ప్రజలపై భారాలు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. సీపీఐ(ఎం) ఎంపీ తపన్‌సేన్, ఎస్పీ ఎంపీ నరేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. కేంద్ర సర్కారు లాభాల కోసం పని చేస్తోందని దుయ్యబట్టారు. సభా కార్యకలాపాలు రద్దు చేసి ఈ అంశంపై చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు డిప్యూటీ చైర్మన్ పిజె కురియన్ నిరాకరించారు. దీంతో వివిధపార్టీలకు చెందిన ఎంపీలు చైర్మెన్ వెల్‌లోకి దూసుకెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ధర పెంపు నిర్ణయాన్ని విరమించుకోండి' 'పేదలను దోపిడీ చేయడం ఆపండి' అంటూ నినాదాలు చేశారు. దీంతో సభను డిప్యూటీ చైర్మెన్ పీజే కురియన్ పది నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత రాజ్యసభ ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్ మాట్లాడారు. పేదలకు గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ధరకు అందిస్తారని చాలా మంది స్వచ్ఛందంగా వదులుకున్నారని గుర్తు చేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం భారాలు మోపి పేదల ఉసురు తీస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఒక్క యేడాదిలోనే సిలిండర్ల ధర రూ.48 పెరుగుతుందని వివరించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు రికార్డు స్థాయిలో పతనమైన సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. కాగా ధరల పెంపు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం యూపీఏ సర్కారుకు అంటగట్టింది. పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ మాట్లాడుతూ.. ప్రతి నెలా సబ్సిడీ సిలిండర్ల ధర పెంచాలన్న నిర్ణయం 2010 జూన్ నెలలో యూపీఏ హయాంలో తీసుకున్నారని సభలో చెప్పారు. ఇందుకు సంబంధించి కొన్ని పత్రాలను సభ్యులకు చూపించే యత్నం చేశారు. సబ్సిడీని ఎత్తివేయబోమని, క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. పైగా తమ ప్రభుత్వ హయాంలో 2.6 కోట్ల ఉచిత కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. మంత్రి సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో సభ 12 గంటలకు వాయిదా పడింది.

కార్మిక వైద్యానికి సర్కార్ గండి

(మొదటిపేజీ తరువాయి)

39 రోజులు ఉద్యోగి వాటా చెల్లిస్తే ఈఎస్ఐ వర్తించేది. ఇక ఆయనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సైతం ఎంతో కొంత వెసులుబాటు అం దేది. అంటే ఆరు నెలల సర్వీసు కాలంలో 78 రోజుల బీమా వాటా చెల్లించి ఉంటే ఆ ఉద్యోగి కుటుంబ సభ్యులకు సైతం ఈఎస్ఐ వైద్యం అందేది. సంబ ధిత ఉద్యోగి (ఇన్సూర్డ్ పర్సన్-ఐపీ) తన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకుంటే సూపర్ స్పెషాలిటీ సేవలు(ఎస్ఎస్‌టీ) సైతం లభించేవి.

నహీ.. నహీ..

మరికొంత వెనక్కి వెళితే.. 'కహీ భీ.. కభీ భీ' (ఎక్కడ నుంచైనా.. ఎప్పుడైనా) అనే సౌకర్యం అందుబాటులో ఉండేది. అంటే సాధారణంగా ఉద్యోగికి పని ప్రాంతం సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి కేంద్రాన్ని కేటాయిస్తారు. ఇక అదే వారికి రిఫరెల్ కేంద్రంగానూ పని చేస్తుందన్న మాట! అయితే దానిని మరింత విస్తృత పరిచి ఉద్యోగులు.. తమను కేటాయించిన కేంద్రాల్లోనే కాకుండా దేశంలో మరే ఈఎస్ఐ ఆస్పత్రి నుంచైనా వైద్య సేవలు పొందేందుకు అర్హత ఉండేది. తొలుత కేంద్రం ఆ సౌకర్యంపై దెబ్బకొట్టింది. ఆ సేవలను కేవలం అత్యవసర వైద్యానికి మాత్రమే పరిమితం చేశారు. బీమా పొందిన వ్యక్తి తప్పనిసరిగా ఏదో ఒక పేరెంట్ డిస్పెన్సరీలో నమోదు చేసుకోవాలన్న నిబంధనా పెట్టారు. అయితే తమ కుటుంబ సభ్యులకు అవసరమైతే వేరే ఆస్పత్రిలో నమోదు చేసుకునే వీలు కల్పించారు. ఆయా కేంద్రాల ద్వారానే చికిత్సకు సిఫారసు చేయించుకోవాలి. అయితే అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేషన్‌కు సంబంధించిన ఏ డిస్పెన్సరీ నుంచైనా ఎస్ఎస్‌టీ పొందే వీలుండేది.

ఈఎస్ఐ సేవలకు గండి

కొద్ది నెలల కిందట ఎన్డీయే ప్రభుత్వం కార్మికులకు ఉన్న కొద్దిపాటి ఎస్ఎస్‌టీ సౌకర్యానికి దొడ్డి దారిన గండికొట్టింది. ఈఎస్ఐ వైద్య, సూపర్ స్పెషాలిటీ సేవల అమలుపై ఒక ఉప సంఘాన్ని నియమించింది. దాని 'సిఫారసుల ఆధారంగా' దేశ వ్యాప్తంగా ఉన్న సంబంధిత వైద్యాధికారులకు 'తగు' ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర కార్మికశాఖ కార్యదర్శి పేరిట వీ-14/ 11/5 /2012 ఎంఈడీ.1 (పాలసీ) నెంబర్‌తో ఆదేశాలు జారీ అయ్యాయి. అవి జారీ అయ్యేందుకు వీలుగా ఈఎస్ఐ 169వ సమావేశంలో ఉప సంఘం 'సిఫారసులను ఆమోదించారు'.

అలవి కాని నిబంధనలు.. అందని వైద్యం

ఆమోదం పొందిన సిఫారసుల ప్రకారం బీమా ఉన్న వ్యక్తి సూపర్ స్పెషాలిటీ సేవలు పొందాలంటే కనీసం రెండేండ్ల నిరంతర సర్వీసు అవసరం. అంతే కాకుండా 156 రోజుల బీమా చెల్లింపులు తప్పనిసరి చేసింది. రెండుసార్లు వైద్య ప్రయోజ నాలు పొందాలంటే వారు కనీసం నాలుగు సార్లు బీమా చెల్లించి ఉండాలని సవరణ చేసింది. ఇక పది లక్షల వ్యయం దాటిన చికిత్సలో బిల్లుల మంజూ రిపై ఏకరూపత లేదు. ఏ కేసుకాకేసును విడిగా పరిశీలించి మాత్రమే మంజూరు చేస్తారు. దానికి ఈఎస్ఐ చైర్మన్ అను మతిని తప్పనిసరి చేశారు. ఇక బీమా పొందిన వ్యక్తుల పిల్లల వైద్యంలోనూ పలు పరిమితులు విధించింది. 2015 తర్వాత పుట్టిన సంతానానికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. వాస్త వానికి ఈ ఆదేశాలను 7 నవంబర్ 2016లోనే జారీ చేసినప్పటికీ.. సంబంధిత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ఇప్పుడిప్పుడే అందుతు న్నాయి. అంటే.. విషయం బయటకు వస్తే ఎక్కడ ప్రజా వ్యతిరేకత ఎదుర్కొనాల్సి వస్తుందోనన్న 'ముందు చూపు' కన్పిస్తోంది. ఈ విషయాలను తెలియని ఈఎస్ఐ సౌకర్యం ఉన్న ఉద్యోగులు యథావిధిగా ఆస్పత్రులకు రావడం.. అక్కడ వైద్య నిరాకరణతో ఉస్సురంటూ ఇంటి దారి పట్టడం ఇప్పుడిప్పుడే ఈఎస్ఐ ఆస్పత్రుల వద్ద కనిపిస్తోన్న కొత్త దృశ్యం.

సెన్సెక్స్ ▲60	నిఫ్టీ ▲37	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు			
32,575	10,114	64.07	రూ. 29, 315	రూ. 41,500	హైదరాబాద్	320	విజయవాడ	320
					ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
					వరంగల్	322	ముంబయి	365







ఆసియాలోనే ముఖేశ్ రెండో కుబేరుడు



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ ఆసియాలోనే రెండో అతిపెద్ద కుబేరుడిగా రికార్డు నమోదు చేశారు. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త లి కా-షింగ్‌ను అధిగమించి అంబానీ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నట్టుగా బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ తెలిపింది. ఈ ఏడాది ముఖేశ్ అంబానీ సంపదకు మరో 12.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.77 వేల కోట్లు) జత కలిసినట్టు బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. ఆయిల్ నుంచి టెలికాం రంగం వరకు అంబానీ నిర్వహిస్తున్న కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీ ర్యాలీ నమోదు చేయడమే ఆయన సంపద పెరగడానికి ప్రధాన కారణమైందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది. 2016లో బ్లూమ్‌బర్గ్ బిలినీయర్ ఇండెక్స్‌లో 29వ స్థానంలో ఉన్న ముఖేశ్ అంబానీ ప్రస్తుతం 34.8 బిలియన్ డాలర్ల నికర విలువతో 19వ స్థానానికి చేరువయ్యేరని తెలిపింది.

రూ.2లక్షల కోట్ల 'కార్పొరేట్' అప్పుల పునరుద్ధరణ : జైట్లీ



న్యూఢిల్లీ : కార్పొరేట్లకు చెందిన భారీ మొత్తం రుణాలను బ్యాంకులు పునరుద్ధరించాయి. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఆ వర్గాలకు చెందిన రూ.2,04,884 కోట్ల అప్పులను పునరద్ధరించినట్టు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. 2014-15లో రూ.3,70,279 కోట్లు, 2015-16లో రూ.2,99,111 కోట్ల చొప్పున కార్పొరేట్ల అప్పులను పునరుద్ధరించినట్టు వెల్లడించారు. ఎవరి రుణాలు పునరుద్ధరించారు, ఏ ప్రతిపాదికన చేశారు అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ ఈ వ్యవహారం రిజర్వు బ్యాంకు చూసుకుంటుందన్నారు. ఆర్‌బీఐ దీనిపై విధివిధానాలు కలిగి ఉందని, ఆ ప్రకారం జాయింట్ లెండర్స్ ఫోరమ్ (జేఎల్ఎఫ్), స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్షరింగ్ (ఎస్‌డీఆర్), స్కీమ్ ఫర్ సస్టెయినెబుల్ స్ట్రక్షరింగ్ ఆఫ్ స్ట్రెస్‌డ్ అసెట్స్ (ఎస్4ఏ) ప్రకారం అప్పుల పునరుద్ధరణ జరుగుతుందన్నారు. రుణ గ్రహీతల పేర్లు, వివరాలు 1934 బ్యాంకింగ్ చట్టాల ప్రకారం ఆర్‌బీఐ యాక్ట్ 45ఈ సెక్షన్ ప్రకారం రహస్యంగా ఉంచబడుతాయన్నారు. రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవహారం జరుగుతుందన్నారు.

4జీ చౌక ఫీచర్ ఫోన్లపై గురి

- సెల్‌ఫోన్ తయారీ కంపెనీల ప్రణాళికలు

న్యూఢిల్లీ : దేశంలో చౌక 4జీ ఫీచర్ ఫోన్లకు డిమాండ్ పెరుగనున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ తయారీ కంపెనీలు ఈ మార్కెట్‌ను అందిపుచ్చుకోవడానికి వీలుగా ప్రణాళికలు రూపొంది స్తున్నాయి. రిలయన్స్ జియో ఈ విభాగంలో అతి చౌక ఫోన్‌కు తెరలేపోవడంతో ఇతర సెల్యూలర్ కంపెనీలు కూడా ఇదే తరహా ఆఫర్లను ప్రకటించే అవకాశం లేకపోలేదు. తాము నాలుగైదు టెలికం కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని స్ప్రెడ్‌ట్రమ్ కమ్యూనికేషన్స్ కంట్రీ హెడ్ నీరజ్ శర్మ పేర్కొన్నారు. నాలుగో త్రైమాసికంలో వారు కొత్త ఫోన్లను తెచ్చే అవకాశం ఉందన్నారు. జియోకు చౌక ధరల్లో ఫోన్లను సరఫరా చేస్తోన్న కంపెనీల్లో ఇది ఒక్కటిగా ఉంది. భారత దేశంలో అత్యధిక మంది 2జీ ఫీచర్ ఫోన్లను వినియోగిస్తున్నారన్నారు. ఇప్పటికే లావా కంపెనీ చౌక 4జీ ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. కాగా ఇంటెక్స్ ఈ నెల చివరినాటికి రూ.1,999కే 4జీ చౌక ఫోన్‌ను తేనుందని సమాచారం.

ఐటీ రంగంలో క్లిష్ట పరిస్థితులు..

ఊడుతున్న ఉద్యోగాలు

- తొలిసారి తగ్గిన సిబ్బంది
- నాస్కామ్ అంచనాలు తప్పే అవకాశం..!



బెంగళూరు : భారత ఐటీ పరిశ్రమలో క్లిష్ట పరిస్థితులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఉద్యోగుల సంఖ్య నానాటికీ దిగజారిపోతుంది. ఒకప్పుడు భారీగా ఉపాధి కల్పనకు నిలయంగా ఉన్న 154 బిలియన్ డాలర్ల దేశీ ఐటీ రంగం తీవ్ర క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుంది. కొత్త ఉద్యోగాలు కల్పించడంలో స్తబ్దత నెలకొంది. తొలిసారి భారతదేశంలోనే అగ్రశ్రేణి ఐదు ఐటీ కంపెనీల్లోని మూడింటిలో ఉద్యోగులు భారీగా తగ్గిపోయారని మింట్ ఓ కథనం ప్రచురించింది. ప్రస్తుత ఏడాది జూన్30తో ముగిసిన త్రైమాసికం నాటికి ఈ టాప్-5 కంపెనీల్లో 984,913 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కాగా ఇంతక్రితం మార్చితో ముగిసిన త్రైమాసికం సంఖ్యతో పోల్చితే 1,821 మంది తగ్గిపోయారు. 2017 మార్చి ముగింపు నాటికి దేశీయ ఐటీ పరిశ్రమలో మొత్తంగా 39 లక్షల మంది పని చేస్తున్నారని ఐటీ పరిశ్రమ బాడీ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) వెల్లడించింది. ప్రస్తుత ఏడాదిలో ఐటీ రంగంలో కొత్తగా కనీసం 150,000 మందికి ఉద్యోగాలు లభించవచ్చని నాస్కామ్ అంచనా వేసింది. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే నాస్కామ్ అంచనాలు తప్పేలా కనిపిస్తున్నాయి.

కంపెనీల వ్యాపార పద్దతులు, విధానాలు మారడంతో ఐటీ కంపెనీలు కొత్తగా ఉద్యోగులను నియమించుకోవడంలో తీవ్ర కఠినతరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పరిశ్రమ విశ్లేషణ. ఓ వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, మరోవైపు ఆటోమేషన్ ప్రభావంతో చాలా కంపెనీలు తమ ప్రస్తుత ఉద్యోగులు, నియామకాల విషయంలో పున్లసమీక్షించుకోవడం మొదలుపెట్టాయి. ప్రధానంగా ఈ రెండు ప్రభావాలతోనే కంపెనీలు సిబ్బందికి కోత పెడుతున్నాయని అంచనా. దేశంలోని ప్రముఖ ఏడు ఐటీ కంపెనీలు దాదాపుగా 56 వేల మంది ఇంజనీర్లను వెళ్లిపోవాలని సూచించినట్టు ఆంగ్ల పత్రిక మింట్ ఒక కథనం వెలువరించింది. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య రెండింతలు పెరుగుతుందని అంచనా వేసింది.

ఇన్ఫోసిస్, టీసీఎస్‌లోనూ...

దేశంలోనే అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సర్వీసుల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,414 మంది తగ్గి 3,85,809కి చేరింది. ఇన్ఫోసిస్‌లో నికరంగా 1,811 ఉద్యోగాలు పోయాయి. టెక్ మహీంద్రాలో 1,713 మంది ఉద్యోగాలు తగ్గాయి. కేవలం విప్రో, హెచ్‌సీఎల్‌లు మాత్రమే తమ ఉద్యోగుల నికర సంఖ్యలో పెరుగుదల చోటు చేసుకుంది. అది కూడా బెంగళూరుకి చెందిన ఓ ఐటీ సంస్థతో విప్రో కుదుర్చుకున్న ఒప్పందం సఫలమవడంతో విప్రో అదనంగా ఉద్యోగులను చేర్చుకోగలిగింది. ఇన్ఫోసర్వర్‌ను విప్రో కొనుగోలు చేయడంతో కొత్తగా 200 మంది ఉద్యోగులను తీసుకుంది.

బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ ఒక అవుట్ సోర్సింగ్ క్లయింట్ ద్వారా మరో 1000 మంది ఉద్యోగులను తీసుకుంది. ఇతర ఐటీ కంపెనీలు ఎల్అండ్‌టీ ఇన్ఫోటెక్ లిమిటెడ్, మైండ్‌ట్రీ లిమిటెడ్, కేపీఐటీ టెక్నాలజీస్ లిమిటెడ్, హెక్సావేర్ లిమిటెడ్, సైయంట్ లిమిటెడ్‌లు క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 2,026 మంది ఉద్యోగులను తీసుకున్నాయి. ఈ కంపెనీల్లో మొత్తంగా 77,447 మంది సిబ్బంది పని చేస్తోన్నారు. అంటే దాదాపుగా దేశంలోని అతిపెద్ద 10 ఐటీ కంపెనీలు ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరంగా కొత్తగా 205 మంది ఉద్యోగులను తీసుకున్నాయి. ప్రతీ త్రైమాసికంలో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే ఐటీ పరిశ్రమ నియామకాలపై నీలినీడలు కమ్ముకోవడంతో ఈ రంగంపై ఆశలు పెట్టుకుంటున్న అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన మొదలయ్యింది.

మార్కెట్లకు 'వడ్డీ రేట్ల' అండ..

ముంబయి : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లలో 25 బేసిస్ పాయింట్లు మేర తగ్గించవచ్చునన్న అంచనాలు మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో విశ్వాసాన్ని నింపాయి. దీనికి తోడు వాహన అమ్మకాల మద్దతు రెండో రోజూ మార్కెట్ల రికార్డు లాభాలకు దోహదం చేశాయి. అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం నెలకొనడం కూడా స్టాక్‌మార్కెట్లకు కలిసోచ్చింది. కొత్తపన్ను విధానం వల్ల అవుట్‌పుట్ డిమాండ్ పడిపోవడంతో జులై నెల తయారీ రంగానికి చెందిన పీఎంఐ గణాంకాలు భారీ కనిష్టానికి పడిపోయాయి. ఈ నేపథ్యంలో బీఎస్‌ఇ సెన్సెక్స్ 60.23 పాయింట్లు లాభపడి 32,575.17 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 37.55 పాయింట్లు పెరిగి 10,114.65 వద్ద ముగిసింది. ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య సమీక్ష నిర్ణయాలను బుధవారం వెల్లడించనుంది. గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమీక్షలో వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపునకు అవకాశం ఉందని ఇప్పటికే పలు అంచనాలు వెల్లడయ్యాయి.

ఫ్లిప్‌కార్ట్ చేతికి ఈబే ఇండియా

న్యూఢిల్లీ : ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మరో ఆన్‌లైన్ పోర్టల్ ఈబే ఇండియాను స్వాధీనం చేసుకుంది. గత ఏప్రిల్‌లోనే దీనిపై ఒక అవగాహనకు రాగా, మంగళవారం చర్చలు పూర్తయినట్టు ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. దీంతో ఇక నుంచి ఈబే.ఇన్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌లో భాగమని ఆ సంస్థ పేర్కొంది. అయినప్పటికీ ఈబే స్వతంత్ర్యంగానే వ్యాపారం కొనసాగించనుంది. దీంతో ఈ కంపెనీలో మైక్రోసాఫ్ట్, ఈబే, టెన్ సెంట్ కంపెనీలు దాదాపు రూ.9,030 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. స్నాప్‌డీల్, ఫ్లిప్‌కార్ట్‌లో విలీన రద్దు ప్రకటన వెలుపడిన తదుపరి రోజే ఈబే విలీనం పూర్తయిన ప్రకటన చేయడం విశేషం.

జేఎస్‌డబ్ల్యూకు వ్యయాల భారం

న్యూఢిల్లీ: సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ అధిక వ్యయాల కారణంగా లాభాలు సగం వరకు పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 44.10శాతం పడిపోయి రూ.626 కోట్లుగా నమోదు అయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో సంస్థ నికరలాభం రూ.1,120కోట్లుగా ఉంది. మొత్తం నిర్వహణ రెవెన్యూ 23.98శాతం వృద్ధితో 12,886 కోట్ల నుంచి రూ.15,977 కోట్లకు ఎగిశాయి. వ్యయాలు 32.86శాతం పెరిగి రూ.11,383 కోట్ల నుంచి రూ.15,124కోట్లకు పెరిగాయి.

పేటీఎం నుంచి మెసేజింగ్ యాప్!

ముంబయి: ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం మెసేజింగ్ సేవలను ప్రారంభించే యోచనలో ఉంది. ప్రత్యర్థి సంస్థలైన ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు గట్టి పోటీ ఇచ్చేందుకు ఈ నెల చివరిలోపు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానుందని సంబంధిత అధికార వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న తమ పేటీఎం వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు పేటీఎం యాప్‌లో ఈ సరికొత్త సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. నోట్ల రద్దు తర్వాత పేటీఎం సేవలకు ఆధారణ భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. ఈ యాప్‌ను ఉపయోగించి ఫుడ్ నుంచి విమాన టికెట్ల వరకు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ కొత్త యాప్ ద్వారా తమ వినియోగదారులకు ఆడియో, వీడియో, ఫోటో, సందేశాలు షేరు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించనుంది. ప్రస్తుతం పేటీఎంకు దేశవ్యాప్తంగా 225 మిలియన్ (22.5 కోట్లు) వినియోగాదారులున్నారు. ఇప్పటికే ప్రముఖ దేశీయ సంస్థ మెసేజింగ్ యాప్ హైక్ తన ప్లాట్‌ఫామ్‌పై ఈ పేమెంట్ ఫీచర్‌ను ప్రారంభించింది. దీంతో తమ యూజర్లకు హైక్ ద్వారానే పేమెంట్ ట్రాన్స్‌ఫర్స్, తదితర సేవలు ఉపయోగించే వీలు కల్పించిన సంగతి విదితమే. గత కొంత కాలంగా వాట్సాప్ డిజిటల్ పేమెంట్స్ ఫీచర్‌ను ప్రారంభించాలని యోచిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ వార్తలపై పేటీఎం, వాట్సాప్ అధికార వర్గాలు దీనిపై స్పందించేందుకు నిరాకరించాయి.

భూతెలంగాణ, బతుకు తెలంగాణ కోసం పోరాడుదాం

- కామ్రేడ్ కె కృష్ణమూర్తి 11వ వర్థంతి సభలో వక్తలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం 70 ఏండ్ల క్రితమే సామాన్య ప్రజానీకం సాయుధులై పోరాడిన గడ్డ తెలంగాణ అని వక్తలు చెప్పారు. ఆనాటి పోరాటంలో నాయకత్వం వహించిన కామ్రేడ్ కె కృష్ణమూర్తి 11వ వర్థంతిని పురస్కరించుకుని భూమి కోసం...భూ నిర్వాసితుల హక్కుల కోసం పోరాడే దినంగా పాటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి పిలుపునిచ్చింది. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐటీయు ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్న ధీశాలి ఆయన అన్నారు.

రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి ఎంతోగానో కృషి చేశారన్నారు. ప్రజా నాయకుడిగా ఎంత పేరు తెచ్చుకున్న సామాన్య కార్యకర్తలతో అప్యాయంగా ఉండేవారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తున్న పరిస్థితుల్లో ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త అంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ భూపాల్, రైతు సంఘం సీనియర్ నేత అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నేత ఆర్ ఆంజనేయులు, సీఐటీయు రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, జె వెంకటేష్, ఎస్ రమ, నగర నాయకులు శ్రవణ్, ఐద్వా నాయకులు అరుణజ్యోతి, విజయకుమార్, రాహుల్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి..

- సీపీఐ (ఎం) డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంటగ్యాస్ సబ్సిడీ సిలిండర్‌పై ప్రతినెలా రూ.4 పెంచాలన్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. లేదంటే ప్రజాగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అంశంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని టీఆర్ఎస్ సర్కారుకు సూచించారు. పేదలకు ఇస్తున్న సబ్సిడీలను తగ్గించాలనే ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం.. వివిధ పథకాలపై ఇస్తున్న సబ్సిడీలను క్రమక్రమంగా తగ్గిస్తున్నదని పేర్కొన్నారు. గత మూడేండ్లలో వీటిని మూడోవంతకు తగ్గించారని తెలిపారు. ఇప్పటికే అనేక రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్నారని.. ఇప్పుడు గ్యాస్ ధరల పెంపు వల్ల 20 కోట్ల మంది వినియోగదారులపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నా మన ప్రభుత్వం మాత్రం రేట్లను పెంచుతూ పోవటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

హక్కులు అడుగుతం...వినకుంటే తరుముతం

పోరాటాలను అణచేందుకే ఫ్రెండ్లీ పోలీస్

- కేటీఆర్ మంత్రి పదవి ఊడేది ఖాయం
- కృష్ణమూర్తి స్మారక భవనం పోరాట కేంద్రం కావాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

'మా హక్కులు మేం అడుగుతం... వినకుంటే తరుముతాం' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కాసం కృష్ణమూర్తి స్మారక భవనాన్ని రంగారెడ్డి జిల్లా మంచాలలో సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్ కమిటీ సభ్యులు పి.యాదయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం జరిగే పోరాటాలను అణిచేందుకే కేసీఆర్ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసును తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో అవకాశవాద రాజకీయాలు ముందుకొస్తున్నాయన్నారు. ఏ ఎమ్మెల్యే ఏ పార్టీలోకి వెళ్తాడో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ కృష్ణమూర్తి చివరి వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డారని గుర్తు చేశారు. ఆయన పేరుతో స్మారక భవనం నిర్మాణం చేసుకోవడం శుభపరిణామమన్నారు. ప్రతి ఎర్ర జెండా అభిమాని కృష్ణమూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజాఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అవే ఆయనకు నిజమైన నివాళులన్నారు. 10లక్షల ఎకరాల భూములను దొరలు, భూస్వాములు, నిజాం, దేశ్‌ముఖుల నుంచి గుంజుకుని పేదలకు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఉందన్నారు. నాడు దొరల నుంచి భూములు గుంజుకుని పేదలకు పంపిణీ చేస్తే, నేడు కేసీఆర్ ప్రభుత్వం పేదల నుంచి గుంజి దొరలకు పెడుతోందని విమర్శించారు. కంపెనీలు, ఫార్మా పేరుతో రాష్ట్రంలో 5లక్షల ఎకరాలను గుంజుకుంటోందన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమంటూనే రైతుల నుంచి తీసుకున్న భూములకు చట్టబద్ధంగా నష్టపరిహారం ఇవ్వకుండా దుర్మార్గ పాలన సాగిస్తున్నారన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో వేల కోట్ల విలువ చేసే భూములను ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. భూకుంభకోణాల బండారం బయటపడుతుందనే ప్రజల దృష్టిని డ్రగ్స్ వైపు మళ్లిస్తున్నారని చెప్పారు. మరోవైపు కేటీఆర్ తన సొంత నియోజకవర్గమైన సిరిసిల్లలో ఇసుక దందాకు తెరలేపాడన్నారు. నేరెళ్లలో ముఖ్యమంత్రి బంధువులు, అనుచరుల ఇసుక మాఫియా వల్ల మూడు నెలలో 42 ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆరుగురు మృతి చెందారన్నారు. వీరిలో భూమయ్య అనే దళితుడు కూడా చనిపోయాడన్నారు. అందుకు ఆగ్రహించిన జనం రోడ్డుమీద పోగై ఇసుక లారీలపై దాడులు చేశారన్నారు. దాంతో పోలీసులు న్యాయ విచారణ జరపకుండా 12 మంది దళితులు, గిరిజనులు, బీసీలను అదుపులోకి తీసుకుని మర్మాంగాలకు విద్యుత్‌షాక్ పెట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఇదేనా దళితోద్ధరణ అని ప్రశ్నించారు.

చట్టవిరుద్ధంగా కేటీఆర్ ఓ ప్రయివేటు కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్నాడని చెప్పారు. హిమాన్షు మోటార్ కంపెనీలో వాటా ఉన్నట్టు 2014 ఏప్రిల్ 4న ఎన్నికల అధికారికి అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. ఆ పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. 2015-16లో కూడా దానికి ట్యాక్స్‌ను కేటీఆర్ పేరుతోనే కట్టారన్నారు. అదే కంపెనీకి 2000 మోటార్ సైకిళ్లను కొనేందుకు రూ.351కోట్లు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఇది చట్టవిరుద్ధమని చెప్పారు. కేజీ నుంచి పీజీ విద్యను అందిస్తామని ఓట్లేయించుకున్న ముఖ్యమంత్రి 5వేల స్కూళ్లను మూసేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అందుకు వ్యతిరేకంగా తిరగబడే రోజు వస్తుందన్నారు. ఇంటికో ఉద్యోగం ఏమైందని ప్రశ్నించారు.

సాయుధ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. భూమిని దున్నేవాళ్లం, పడించేటోళ్లం, సంపదను సృష్టించేటోళ్లం మనమేనన్నారు. నాడు ఆంద్రోళ్లంటూ విమర్శించిన ముఖ్యమంత్రి నేడు ఎవరికి వేలాది భూములు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా బానిసత్వాన్ని అనుభవించిన జిల్లా అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. పేదల భూములను కొంతమంది పెద్దలు స్వాధీనం చేసుకుంటునారన్నారు. దళితులు, గిరిజనులు అక్రమించిన భూముల్లో వచ్చే నెలలో ఎర్రజెండాలు పాతి ఆక్రమించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి భూపాల్, ప్రజాకవి గోరెటి వెంకన్న, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, సీపీఐ(ఎం) జిల్లా కోర్ కమిటీ సభ్యులు బి.సామెల్, చంద్రమోహన్, రాంచందర్, కె.జగన్, మధుసూదన్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎ.నర్సింహా, శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.జంగయ్య, జగదీష్, కిషన్, ప్రకాశ్‌కారత్ ఉన్నారు.

డ్రగ్స్ కేసులో ముగిసిన 'సిట్' విచారణ

- సిటీ సివిల్ కోర్టుకు కేసు డైరీ, సీడీలు
- మూడు గంటల్లోనే హీరో నందు విచారణ పూర్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమలో అలజడి సృష్టించిన డ్రగ్స్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముగిసింది. చివరిగా యువ హీరో నందును సిట్ మంగళవారం ప్రశ్నించింది. కేవలం మూడు గంటల్లోనే నందు విచారణను ముగించారు. ఉదయం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా గుడికి వెళ్లి దర్శనం చేసుకుని తండ్రి, మేనమామతో కలిసి నందు ఆబ్కారీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ బాలత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ఐదో అంతస్తులోని సిట్ కార్యాలయం లోపలికి వెళ్లారు. డ్రగ్స్‌కు సంబంధించి తనకు తెలిసిన విషయాలను వెల్లడించిన నందు, కెల్విన్‌తో తనకు స్నేహం లేదని చెప్పారు. సినిమాలకు సంబంధించి ఒకటి, రెండు సార్లు మాట్లాడానని తెలిపారు. డ్రగ్స్ ఎప్పుడూ వినియోగించలేదని, వాటివల్ల దుష్పరిణామాలు తెలుసునని అన్నారు. తాను అమాయకుడ్ని అని, ఈకేసులో నోటీసులు రావడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు.


ఇదిలాఉండగా, ఈకేసులో చిత్ర పరిశ్రమకు చెందిన 12 మందికి సిట్ నోటీసులు జారీచేయగా వారందరూ విచారణకు హాజరయ్యారు. వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో సాక్షులు వెల్లడించిన అంశాలతో రూపొందించిన వీడియో సీడీలు, కేసు డైరీని సిట్ అధికారులు సిటీ సివిల్ కోర్టుకు త్వరలో సమర్పించనున్నారు. వాటిని న్యాయస్థానం పరిశీలించిన తర్వాత ఇచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. సిట్ నోటీసుల మేరకు విచారణకు హాజరైన వారిపై కేసులు నమోదు చేసే విషయంలో కూడా అప్పుడే స్పష్టత రానుంది. జులై 19న ప్రముఖ దర్శకులు పూరి జగన్నాథ్‌తో సిట్ విచారణ మొదలయింది. తరువాత వరుసగా శ్యామ్.కె.నాయుడు, సుబ్బరాజు, నవదీప్, తరుణ్, ఛార్మి, ముమైత్‌ఖాన్, రవితేజ, రవితేజ మాజీ కారు డ్రైవర్ శ్రీనివాసరావు, తనీష్, నందులను సిట్ అధికారులు ప్రశ్నించారు. మొదటి ఐదు రోజుల విచారణలో సిట్ కీలక సమాచారం సేకరించింది. పూరి, శ్యామ్ కె నాయుడు, సుబ్బరాజు, నవదీప్, తరుణ్‌లను రాత్రి పదకొండు గంటల వరకు విచారించారు. రక్తం, తలవెంట్రుకలు, గోళ్ళ నమూనాలను కూడా సేకరించారు. నోటీసులు ఇచ్చిన వారిని సాక్షులుగానే పిలిచామని అధికారులు చెబుతున్నా.. వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. హైకోర్టుకు వెళ్లిన చార్మీతో పాటు ముమైత్‌ఖాన్‌లను విచారించేందుకు ప్రత్యేకంగా మహిళా అధికారులను నియమించారు.

సెకండ్ పార్ట్ ఉన్నట్టా, లేనట్టా.. లేనట్టేనా..

సిట్ విచారణలో వెల్లడైన సమాచారం ఆధారంగా డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న వారి పేర్లతో రెండో జాబితా తయారు చేయనున్నట్టు సిట్ బృందం తెలియజేసింది. ఈ జాబితాలో నిర్మాతల కుమారులతో పాటు పెద్దల పేర్లు ఉన్నట్టు లీకులు కూడా మీడియాలో వచ్చాయి. అధికారపార్టీ టిఆర్ఎస్‌పార్టీకి అనుబంధంగా ఉన్న పత్రికలోనే ఈ పేర్లు రావడం గమనార్హం. దీంతో రెండో జాబితాపై ఉత్కంఠ నెలకొంది. అయితే ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రగ్స్ కేసుపై ఎక్సైజ్ అధికారులను, పోలీసులను పిలిపించి సమీక్షించిన విషయం తెలిసిందే. డ్రగ్స్ కేసులో విచారించబడుతున్న సినిమా వారూ బాధితులేనని తేల్చారు. వారు నేరస్తులు కాదు అని ప్రకటించారు. ముఖ్యమంత్రి సమీక్షతో విచారణ పక్కదారి పట్టినట్లయింది. విచారణ పేరుతో పబ్‌లు, రెస్టారెంట్ యాజమాన్యాలను పిలిపించి మాట్లాడటంతో వారంతా సీఎం కేసీఆర్ వద్ద మొరపెట్టుకున్నట్టు తెలిసింది. మరికొంత మంది సినీ పెద్దలు కూడా ఒత్తిడి చేసినట్టు సమాచారం. ఆయా స్కూల్స్ యాజమాన్యాలు కూడా విచారణను



నిలుపుదల చేయాలని కోరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండో జాబితా ఉంటుందా, ఉండదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వినూత్నం.. విలక్షణం...

కవి హృదయం ఎక్కడికెళ్ళినా కవితాత్మకంగా స్పందిస్తుంది. కవిత్వమై జాలు వారుతుంది. ప్రముఖ కవి, రచయిత, అధ్యాపకుడు డాక్టర్ కాంచనపల్లి అమెరికా యాత్రాకథనమే ఇందుకు నిదర్శనం. ఇటీవల ఆయన అమెరికాని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సుందరమైన ప్రదేశాల్లో పర్యటించినప్పుడు పొందిన అనుభూతుల్ని కవిత్వం చేయాలని తపించారు. అంతగా ఈ కవిని స్పందింపజేసిన పర్యాటకానుభూతుల సమాహారం 'జరదేఖో' పాఠకులకు ప్రత్యేకం.

హంటగన్ దానా పాయింట్ దగ్గర కళ్యాణ్ (అల్లుడు) నేను కారు దిగుతున్నాం. అప్పటికే వెన్నెల (కూతురు), అంజని (భార్య) దిగి పోయారు. పార్కింగ్ దొరక్క పోవడం వల్ల కళ్యాణ్ కారు పార్క్ చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. పసిఫిక్ కోస్ట్ మీద అలా నడుస్తుంటే వాతావరణం సుందరంగా విచిత్రం గా అనిపించింది. తల వంచుకొని కళ్యాణ్, వెన్నెల వెంట ఇసుకలో కొంత దూరం నడిచాను. ఇర్విన్ స్పెక్ట్రంలో షాపింగ్, తెలుగు కుటుంబాలతో కలిసి సౌత్ కోస్ట్ మాల్ లో బాహుబలి సినిమా చూడడం, స్వామి నారా యణ, మాలిబ్ దేవాలయాలకి వెళ్ళడం లాంటివన్నీ స్మ తి పథంలో ఇంకా కదులుతున్నాయి. కాని ఈ అనుభవం కొత్తగా వుంది. మనసును హత్తుకునేలా వుంది. వెన్నెల మా ముగ్గురిని నిలబెట్టి ఫొటోలు తీసింది. ఆ తర్వాత కళ్యాణ్ మమ్మల్ని ఫొటోలు తీశాడు. నలుగురం దిగడం ఎలా? "షల్ ఐ టేక్ ఫొటోగ్రఫి?" అని ఓ తెల్లగా మెరిసి పోయే యువతి అడిగింది. 'ప్లీజ్' అంది వెన్నెల. ఆ యువతి మా కుటుంబాన్ని ఫొటో తీసింది. "సో నైస్ అఫ్ ఇట్" థాంక్స్, అన్నాను నేను. ఆమె నవ్వుతూ వెళ్లి పోయింది.

కొందరు సరదాగా సైకిల్ రైడ్ చేస్తున్నారు. కొందరు అలలతో విన్యాసం చేస్తున్నారు. దీన్ని వాళ్ళు సర్ఫింగ్ అంటారు. అల ఎంతలేస్తే మనిషి అంత ఎత్తు లేచి పడుతుంటాడు. ఇంకొందరు అర్ధ దిగంబరులు ఆకాశాన్ని చూస్తూ పడుకున్నారు. ఒక పెద్ద గ్యాంగ్ మరోచోట డోలక్ వాయిస్తు న్నారు. వివిధ రకాలైన దుకాణాలు, అమ్మకాలు. చిత్రమేమిటంటే మనం ఎవరి మొహాన్నైనా నిమిషం చూస్తే చాలు. హలో అంటూ పలక రిస్తారు. కొందరు పలకరిస్తే మాత్రం ఎక్కడో, ఏదో.. తీయని కలకలం. మరుసటి రోజు చూసిన లగునా బీచ్, మాలీబ్ బీచ్, వేనైస్ బీచ్ లాంటివన్నీ దీనికి ప్రతి రూపాలే. భిన్నమైన మనుషుల జీవన విన్యాసాలే. మే 16 న లాస్ ఏంజిల్స్ నుండి లాస్ వేగాస్ కి బయలు దేరాం. వెన్నెల వాళ్ళ కారు ఈ మధ్య సర్వీసింగ్ కి ఇవ్వలేదట. కళ్యాణ్ చాలా పెద్ద కారొకటి అద్దెకు తెచ్చాడు. సుమారు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మా ప్రయాణం మొదలైంది. మధ్య మధ్యలో పెట్రోలు బంకులు వచ్చినప్పుడు ఆగుతూ వెళ్లాం. ఘాట్ రోడ్ పక్కనే గుట్టలు. వాటి మధ్య పాములాగా వయ్యారంగా సాగిపోయే కాలువలు. కారు డోర్ తీస్తే చాలు గాలి విసిరికొట్టేది. కారు పడిపోతుందా అన్నట్టు ఊగిపోయేది.

పెట్రోల్ బంకుల దగ్గర చిన్న చిన్న హొటళ్లున్నాయి. కళ్యాణ్ ఎప్పుడూ బ్లాక్ కాఫీ తాగుతాడు. ఒకసారి నేను రుచి చూశాను, చాలా చేదుగా ఉంది. మళ్ళీ దాని జోలికి పోలేదు. నేను చాక్లెట్ కాఫీ తాగుతాను. ఇక కారులో వెళ్ళినంత సేపు నేను ఘంటసాల పాటలు పెట్టమంటే. వెన్నెల,కళ్యాణ్ ఇంగ్లీష్, హిందీ పాటలు పెట్టుకునేవారు. చాల సరదాగా లాస్ వేగాస్ చేరుకున్నాం. లాస్ వేగాస్ లైట్లకు పుట్టిల్లుగా ఉంది. ఎటు చూసినా విద్యుత్ కాంతులు. కారు లాస్ వేగాస్ ప్రవేశిస్తుంటే చెప్పలేని ఉత్సాహం. ఆకాశాన్నంటే సుందరమైన మేడలు. ట్రంప్ హొటల్ ఒకటుంది. ప్రతీది చాలా కాస్ట్లీ అట. అట్లా రోడ్లన్నీ వెన్నెల తిరుగుతూ చూపించింది. 'నాన్నా, అదిగో మనం ఉండబోయే హొటల్". చూసి దిగ్భ్రమకు లోనయ్యాను. నూట రెండు ఫ్లోర్ల ఎత్తైన భవనం అది. స్ట్రాటో స్పియర్ హొటల్ మీద గుండ్రంగా తిరిగినట్టు అనిపిస్తుంది. దూరం నుంచి చూస్తే అది హొటల్ అని ఎవరూ అనుకోరు. స్తంభం లాగా కనిపిస్తుంది. సుమారుగా రాత్రి ఒంటిగంట ప్రాంతంలో హొటల్ చేరుకున్నాం. కళ్యాణ్ మేం దిగాల్సిన గదికి సంబంధించిన ఫార్మాలిటీస్ పూర్తి చేయడానికి వెళ్ళాడు. అరగంటలో వచ్చాడు. మేం ఉండాల్సింది నూట రెండవ ఫ్లోర్.

హొటల్ లోనే సుమారు గా అరకిలోమీటర్ నడిచాం. చివరకు పైకి వెళ్ళడానికి లిఫ్ట్ దొరికింది. ఒక నల్ల జాతీయుడు లిఫ్ట్ ఆపరేటర్. అతను ఒకటే చెబుతున్నాడు. అందరూ నవ్వుతున్నారు. మాకయితే అర్థం కాలేదు. అతను చెబుతూ మావైపు చూశాడు. మేం కూడా నవ్వాం. మొత్తానికి నూటరెండవ ఫ్లోర్ కు చేరుకున్నాం. గుండ్రని రెస్టారెంట్ అది. కూల్ డ్రింక్, బీర్ (ఎవరికీ కావలసినవి వాళ్ళు) ఆర్డర్ ఇచ్చి సోఫాలో కూచున్నాం. రెస్టారెంట్ గుండ్రంగా, మెల్ల గా తిరుగుతుంది. లాస్ వేగాస్ ఎక్కడో కింద భూమి మీద నక్షత్రాలు పరచినట్టు గా కనబడుతుంది. అట్లా పై భాగం స్లో గా రౌండ్ గా తిరుగుతుంటే వేగాస్ ని చూడడం గొప్ప అనుభూతి. ధగ ధగా మెరిసిపోతున్న విద్యుత్కాంతి లో వేగాస్ అసాధారణంగా కనిపించింది. మే 13 న ఆ హొటల్ వెకేట్ చేశాం. ఉదయమే అంటిలోప్ కెన్యాన్ కి వేగాస్ నుంచి బయలు దేరాం. ఇక్కడి నుంచి కెన్యాన్ వరకు మన వాహనాలు వెళ్ళవు. దారంతా ఇసుకమయం గా



ఉంటుంది. దాదాపు పది కిలోమీటర్లు ఉంటుంది. యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన ట్రక్కులో బయలు దేరాం. ఆ ట్రక్కు డ్రైవర్ ఒక రెడ్ ఇండియన్. ప్రయాణం జరిగేటప్పుడు అతను తన పద్ధతిలో చెప్పాడు. ఆ ప్రదేశం రెడ్ ఇండియన్స్ కే వదలివేసిందట ప్రభుత్వం. రెడ్ ఇండియన్స్ అదంతా తమ సొంతంగా భావిస్తుంటారు. మూలవాసులకు అట్లాంటి ప్రాధాన్యత దొరకడం మాకు చాలా సంతోషంగా అనిపించింది. కచ్చా రోడ్ మీద ఊగిసలాడుతూ ట్రక్కు వెళ్తుంది. అమెరికా లో కూడా ఇట్లాంటి రోడ్లు ఉంటాయన్నమాట.

లాస్ వేగాస్ లో మాతో పాటు అజయ్, ప్రతిమ కలిశారు. వాళ్ళు వెన్నెల, కళ్యాణ్ కుటుంబ స్నేహితులు. దగ్గరలో వేరే హొటల్లో దిగారు. అంటిలోప్ కెన్యాన్‌లోనికి వెళ్తుంటే చిన్నప్పుడు చూసిన జానపద సినిమాలు గుర్తొచ్చినై. గుట్టల నడుమ చీకటిలోకి నడచి వెడుతున్నట్టనిపించింది. మధ్యలో శ్వాస ఆడకపోతే ఎలా? కొంచెం భయం వేసింది. ఇంత మంది ఉన్నారు. 'నాకేం సమస్యా' ధైర్యం తెచ్చుకొని కొనసాగాను. లోనికి వెళ్తుంటే చీకటి. పైన ఏర్పడ్డ బిలం నుంచి వెలుగు. కొంత దూరం నడిచాక మళ్ళీ చీకటి. క్రమంగా భయం పోయింది. నూతనోత్సాహం వచ్చింది. మాతో వచ్చిన గైడ్(డ్రైవర్)విషయాలు చెప్పుకుంటూ పోతున్నాడు. అవేం చారిత్రకాంశాలు కావు. కల్పిత కథలే. ఎంతో అల్లరి చేశారు. కేరింతల నడుమ, అంతమంది వివిధ దేశాలకు చెందిన జనాల నడుమ మా నడక కొనసాగింది. రెండు నుంచి మూడు గంటల విహారం తర్వాత వెనక్కి బయలు దేరాం.

కళ్యాణ్, వెన్నెల, అజయ్ ప్రతిమలు పిజ్జా హంట్ కి వెళ్ళారు. మేం కూడా అనుసరించాం, కానీ తిండి ముగించక ముందే లోయర్ అంటిలోప్ కెన్యాన్ కి పిలుపు వచ్చింది. త్వరగా బయలు దేరాం. లోయర్ అంటిలోప్ కెన్యాన్ ప్రతిచోట కిందికి దిగాల్సి ఉంటుంది. చీకట్లో కొంత నడిచాక కొండ కింది



లేక్ వ్యూ లో నది ఒడ్డునే మా నివాసం. ఇంటి వెనుక చైర్స్ వేసుకొని కూర్చుంటే.. సరస్సు దగ్గరికి చుట్టరికానికి వచ్చినట్టే ఉంది. సరస్సు తో మౌన సంభాషణ చేసిన అనుభూతి పొందుతాం. సరస్సు పై ఎగురుతున్న పక్షులు, కదిలిపోతున్న పడవలు, కొద్ది దూరంలో వాయిద్యాలు మీటుతూ మత్తుగా ఊగిపోయే ధవళ సుందరులను చూస్తూ ఎన్ని పద్యాలైనా రాసుకోవచ్చు.

భాగంలోకి దిగాలి. భయపడేవాళ్ళని, స్పృహ కోల్పోయే వాళ్ళని, ఏమైనా గాయాలు అయిన వాళ్ళని తీసుకెళ్ళడానికి ట్రక్కులున్నాయి. మామూలు వాళ్ళంతా నడిచి వెళ్ళాల్సిందే. నేనయితే అసలు చలించలేదు. కళ్యాణ్, అజయ్ ఇతర మిత్రులలాగే నేను చాల ఉత్సాహంగా దిగిపోయాను. లోయర్ అంటి లోప్ కెన్యాన్ దగ్గర గైడ్ ఒక రెడ్ ఇండియన్ అమ్మాయి. బాగా జోకులు వేసింది. ఆమె కూడా ఏవో కథలు చెప్పింది. మొత్తానికి ఒక గంటన్నర లో ముగిసింది. ఆ చీకటి నుండే మెల్ల మెల్లగా పైకి ఎక్కడం, మళ్ళీ భూమి మీద తేలడం. మరో గంటలో అంటే సాయంత్రం సుమారు ఆరు గంటల ప్రాంతం లో లేక్ వ్యూకి బయలు దేరాం. లేక్ పావెల్ రిసార్ట్ దగ్గర మాకు రెండు రోజులు బస అని చెప్పింది వెన్నెల. నావాజి ట్రైబ్స్ నుండి లేక్ పావెల్ రిసార్ట్ కి బయలు దేరాం. విచిత్రమేమిటంటే రాత్రి ఎనిమిది కావస్తున్నా ఇంకా ఎండ ఉంది.

మే 14 వ రోజు లేక్ పావెల్ లో ఓ బోట్ టూర్ చేశాం. అవి బోట్స్ కాదు చిన్న పాటి ఇండ్లు. అందులో రెండు బెడ్ రూమ్ లు, హాల్, కిచెన్ ఉంటాయి. బోట్ పైకి



వెళ్లి మేడ పైకి వెళ్ళినట్టుగా వెళ్లి ఆకాశాన్ని చూస్తూ పడుకోవచ్చు. అక్కడి యాత్రికులు బోట్లో రెండు మూడు రోజులు కూడా బస చేస్తారట. గాలి పైన ఎక్కువ వీస్తుండడం వల్ల మా బోటు విహారం కొనసాగలేదు. అధికారులు గాలి అలలు ఎక్కువగా ఉన్నాయని, ప్రమాద సూచిక అని అభ్యంతర పెట్టారు. దాంతో వెనుదిరిగాల్సి వచ్చింది. మళ్ళీ లాస్ వేగాస్ వైపు బయలు దేరాం. మే15 వ రోజు ఏరియా హొటల్లో క్యాసినో ఆడాం. వెన్నెల ఆటలో 100 డాలర్లు సంపాదించింది. కాని నేను పోగొట్టాను. నేను మళ్ళీ ప్రయత్నం చేయలేదు. లియో గ్రాస్ రెస్టారెంట్లో థాయ్ ఫుడ్ తిన్నాం. అక్కడే ప్రతిభ బర్త్ డే సెలబ్రేట్ చేశాం. తర్వాత మరో హొటల్ లో గండోల రైడ్ చేశాం. హొటల్ లో కత్రిమ ఆకాశం, నక్షత్రాలు, కింద ఒక చిన్న సరస్సు, అందులో ఇటలీ లోని వెనిస్ ని ప్రతిఫలిస్తూ బోట్ రైడింగ్. నావికుడు నవ యువకుడు. చక్కగా పాట పడుతూ మమ్మల్ని బోట్ లో తిప్పాడు. ఒక అరగంట వరకు డ్రైవ్ కొనసాగింది.

అదే రోజు సాయంత్రం విన్ హొటల్ లో లీ రేవ్ అనే డ్రీం షో చూశాం. ఒక యువతి ప్రేమకోసం ఒక దౌర్జన్య పరుడైన యువకుడు, ఒక మంచి యువకుడు ఇద్దరూ ప్రయత్నిస్తారు. చివరికి మంచి యువకుడు ఆమె మనసును జయిస్తాడు. గొప్ప సర్కస్ విన్యాసాలు, సముద్రాల హొరు, మంత్రాల మహిమలతో ఆ షో మన కండ్లముందే జరిగే ఓ అద్భుతం. మే 16 న వేగాస్ నుండి గ్రాండ్ కెన్యాన్ వెళ్ళాం. అక్కడ చాలా ఎత్తైన కొండలు. చుట్టూ లోయ, అందులో ప్రవాహం, ప్రకతిని ఎవరో అమర్చినట్టు ఉంది. ఈగల్ పాయింట్ అమితం గా ఆకర్షించింది. గుట్టలే గద్దల్లాగున్నాయి. ఆ మర్నాడు టికెట్ రుసుము చెల్లించి స్కై వాక్ చేశాను. గువెనో పాయింట్ చేరాం. చాల ఎత్తైన కొండలు పైనున్న మనుషులు చిన్న పక్షుల్లాగా కనబడుతున్నారు. కళ్యాణ్ కొండ ఎక్కడం మొదలు పెట్టాడు. నేను ఉండబట్ట లేక ఎక్కడం మొదలు పెట్టాను. వెన్నెల ఎంతో వారించింది. వినకుండా నేను పైకి ఎక్కేశాను. ఆయాసం వచ్చినా విజయోత్సాహం దాన్ని గుర్తు చేయలేదు. రాత్రి లాస్ వేగాస్ కి తిరుగు ప్రయాణమయ్యాం. మే 17 న సీజర్ ప్యాలెస్ హొటల్ కి వెళ్లాం. సీజర్ వీర గాథా కథనం గురించి నేను కళ్యాణ్ కొంచెం సేపు మాట్లాడుకున్నాం. అక్కడ బక్ హావెల్ బఫెట్ లో వేయి రకాల డిష్ లుంటాయి. సుమారుగా రెండు వందల వరకు వివిధ రకాల మాంసాహారాలు న్నాయి. ప్రతి మాంసాహారం మీద ఆయా జంతువుల బొమ్మలున్నాయి. పాములు, కుక్కల బొమ్మలు కూడా ఉన్నాయి. మేం మేక బొమ్మ ఉన్న చోటే మటన్ కర్రీ వేసుకున్నాం. ప్లేట్ లో ఇష్టమున్నవి వడ్డించుకొని వచ్చి మా సీట్లో కూర్చొని తిన్నాం. తర్వాత బెలాజియం హొటల్ లో పౌంటేన్ షో చూశాం. నీరు ఒకేసారి పొంగివచ్చి చుట్టూ కురుస్తుంటే భలేగా వుంటుంది. అక్కడి



నుంచి చాలిస్ హొటల్ కి వెళ్ళాం. చివరగా లాస్ ఎంజిల్స్ బయలు దేరాం.

లాస్ ఎంజిల్స్ చేరుకొని రెండు రోజులు పూర్తి విశ్రాంతి తీసుకున్నాం. మే ఇరవై ఒకటో రోజున హాలివుడ్ కి వెళ్ళాం. వాక్ ఆఫ్ ఫేం పైన నడచాం. రోడ్డు పైన గొప్ప నటుల చిత్రాలున్నాయి. గేటు వే కి వెళ్లి అద్భుతమైన ప్రకతి దశ్యాలు చూశాం. విశ్వం ఎలా పరిణామం చెందుతుందో చూశాం. హలీవుడ్ దర్శనం ఒక గొప్ప అనుభూతి. మొత్తంగా మా పర్యటన వినూత్న అనుభవాలతో, అనుభూతు లతో సాగింది.

- డాక్టర్ కాంచనపల్లి
ఫోన్ నెం: 9676096614

హమారా ఖజానా...

రాజులు పోయారు.. రాజ్యాలు పోయాయి... కేవలం వారి ఆన వాళ్లు మిగిలాయి. అవే హైదరాబాద్ నిండా మనకు కనిపి స్తాయి. వారు కట్టించిన భవనాలు, నివసించిన మందిరాలు, పాలించిన ప్రాంతాలు, సేకరించిన అపురూప వస్తువులు అన్నీ అలనాటి జ్ఞాపకాలుగా, చరిత్రను చెప్పే వస్తువులుగా వారసత్వ సంపదలుగా మిగిలిపోయాయి. అలాంటి వాటిలో ఒకటి ఖజానా బిల్డింగ్.


రాయల్ ట్రెజరీ...

ఖజానా బిల్డింగ్ గోల్కొండ కోటకు దగ్గరలో ఉంటుంది. గోల్కొండ అంటే వజ్రాలకు పేరుగాంచిన ప్రదేశం. ప్రపంచంలో ఉన్న విలువైన వస్తువులను గోల్కొండ మార్కెట్‌లో (ముత్యాలు, వజ్రాలు, రత్నాలు) రాసులుగా పోసి అమ్మెవారు. అంతే కాదు విక్టోరియా రాణి కిరిటంలో ఉండే కోహినూర్ వజ్రం కూడా గోల్కొండ కోటలోనిదే. గార్నెట్, హనేథీస్టు, తొపాజ్, అగాతే లాంటి వజ్రాలను గోల్కొండ కోట నుంచే ఎగుమతి చేసేవారని చరిత్ర చెబుతుంది.

రాయల్ ట్రెజరీ... గోల్కొండ రాజులైన కుతుబ్ షాహీలకు సంబంధించిన సంప్రదాయ ఆభరణాలు, నగలు, విలువైన రాళ్లు, రత్నాలను భద్రపరచటానికి కట్టించిన భవంతి ఖజానా బిల్డింగ్. నాలుగు వందల ఏండ్ల కిందట కట్టించిన ఈ భవంతి... ఇప్పటికీ గత వైభవపు ఆనవాళ్ల చెక్కుచెదరలేదు. మట్టి గోడలున్న గోల్కొం డను... శత్రుదుర్భేధ్యమైన రాతి కోటలుగా మార్చారు కుతుబ్ షాహీలు. కోట లోపల, బయట చాలా నిర్మాణాలు చేశారు. ఇక్కడి నుంచే మిలిటరీ, పరిపాలన అధికారుల కోసం ముఖ్యమైన భవనాలు కట్టించారు. అట్లాంటి వాటిలో ఒకటి ఖజానా బిల్డింగ్.

రాతి చెక్కడాలు...

ఫతే దర్వాజా నుంచి బాలా హిస్సారు వెళ్తుంటే మెయిన్ రోడ్ మీద ఒక పెద్ద బిల్డింగ్ కనిపిస్తుంది. ఫతే దర్వాజా నుంచే గోల్కొండ కోటను చూడటానికి లోపలికి వెళ్తాం.



గుమ్మటం కింద నిలబడి చప్పట్లు కొడితే అతి ఎత్తైన ప్రదేశంలో ఉన్న కోట అంటే "బాలా హిస్సారు" వద్ద చాలా స్పష్టంగా శబ్దం వినిపి స్తుంది. ఈ శబ్దాలను పూర్వం ప్రమాద సంకేతాలకు ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు మాత్రం సందర్శకులకు వినోదం పంచుతోంది. ఖజానా బిల్డింగ్‌ను చూడగానే ఆ కాలపు ప్రముఖ కట్టడమని సులభంగా గుర్తుపట్టేలా కనిపిస్తుంది. ఈ బిల్డింగ్ ఇబ్రహీమ్ కుతుబ్ షాహీ ఖజానా గా పేరుగాంచినది. ఈ బిల్డింగ్‌లోకి వెళ్లాలంటే మెయిన్ ఎంట్రెన్స్ నుంచి వెళ్ళాలి. దీన్ని చాలా ఎత్తుగా, బలంగా నిర్మించారు. మూడు వరుసలున్న ఆర్చీలుగా ఈ నిర్మాణం కనిపిస్తుంది. బయట నుంచి చూస్తే సింపుల్ కర్వ్‌డ్ ఆర్చీలు, మధ్యలో కాగడాల్లాంటి సింపుల్ స్టకోవర్ కనిపిస్తుంది. దీనికి రెండు దిక్కులా తలుపుల ఆకారంలో ఉండే కిటికీ ఆర్చీలు కూడా కనిపిస్తాయి. వీటికి కిందున్నవి క్లోజ్డ్ ఆర్చీలైతే, పైనున్నవి ఒపెన్ ఆర్చీలు. మెయిన్ ఎంట్రెన్స్‌కు రెండు దిక్కుల సోలిపోతున్న గదులు, బయటి దిక్కు ఆర్చీలు వెంటిలేటర్‌ల తో డిజైన్స్‌గా కనిపిస్తాయి. లోపలికి వెళితే పెద్ద దర్వాజ, దాన్ని ఆనుకొని పెద్ద వరండా దర్శనమిస్తుంది. ఆ తర్వాత బయటికి వెళ్లడానికి ఒపెన్ అయ్యే గదులుం టాయి. ఈ మూడింటిని వేరు చేసి చూపిం చడా నికి ఆర్చీల నిర్మాణం చాలా అందం గా ఉంటుంది.

నలు దిక్కులా కోటలు...

ఖజానా బిల్డింగ్ చతురస్రాకారపు నిర్మాణం. చుట్టూ గదులు, మధ్యలో బిల్డింగ్. పాతకాలపు ఇస్లామిక్ కట్టడాల్లో మతపరమైన మందిరాలుంటాయి. అలాగే ఈ ఖజానా బిల్డింగ్‌లోను కనిపిస్తాయి. ఒకప్పుడు ఖజానా బిల్డింగ్‌లో భాగంగా ఉండే ఆస్ట్రాఫిమస్, చనీ మాస్క్, షంషేర్ కోటలు కూడా కనిపిస్తాయి. ఈ బిల్డింగ్‌కు నాలుగు దిక్కులా కోటలు ఉండేటట్టు నిర్మించారు. షంషేర్ కోటలో యుద్ధంలో ఉపయోగించే ఆయుధాలు దాచిపెట్టేవారు. చనీ మాస్క్ ను (1550–1580) మధ్యకాలంలో ఇబ్రహీమ్ కుతుబ్ షాహీ కట్టించారని చరిత్రకారులు చెబుతారు. ఖజానా బిల్డింగ్‌ను కూడా అదే సమయంలో కట్టించారు. ఖజానా బిల్డింగ్‌ను సింగిల్ స్టోన్‌తో నిర్మించారు. ఈ బిల్డింగ్ మధ్యలో పెద్దగా, అందంగా ఉన్న ఆర్చీలు చాలా ఉంటాయి. దీనికి ఇరువైపులా రెండు హాల్స్ ఉంటాయి. వీటిని స్టోర్ హౌస్‌లుగా ఉపయోగించుకునే వారు. ఈ గదుల్లో ఆ కాలపు రాయల్ ట్రెజరీ, ప్రభుత్వ, ఆర్మీ ఆస్తులను భద్రపరిచే వారు.

ప్రస్తుతం ఖజానా బిల్డింగ్‌ను మ్యూజియంగా మార్చారు. ఇప్పుడు దీంట్లో కుతుబ్ షాహీ కాలం నాటి రాతిచప్టాలు కనిపిస్తాయి. చాళుక్య, కాకతీయ, బహుమనీ, కుతుబ్ షాహీ విగ్రహాలు, దేశ విదేశాల నుంచి సేకరించిన అరుదైన రాతి విగ్రహాలు ఇక్కడ కనిపిస్తాయి. రాతి విగ్రహాలే కాదు వందల, ఏండ్ల నాటి అరుదైన నాణేలు కూడా ప్రదర్శనకు పెట్టారు. అనేక రకాల త్రవ్వకాల్లో బయటపడ్డ నాణేలు చరిత్రను చెబు తాయి. ఈ బిల్డింగ్ మొత్తాన్ని రాయి, సున్నం మిశ్రమంతో కట్టారు. అందుకే శతాబ్దాలు గడుస్తున్నా చెక్కుచెదరకుండా ఉంది.

వారసత్వ సంపద...

కుతుబ్ షాహీల తర్వాత వచ్చిన మొఘల్స్,ఆ తర్వాత వచ్చిన నిజాములు ఈ బిల్డింగ్‌ను ట్రెజర్ హౌస్‌గా, సైన్యానికి నివా సంగా, ప్రభుత్వ కార్యక్రమాలకు వేదికగా, ఆయుధగారంగా ఉపయోగించారు. అయితే దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత దీని రూపం పూర్తిగా మారింది. 1952లో పురావస్తు శాఖ దీన్ని "డిపార్టుమెంట్ ఆఫ్ ఆర్కియాలజికల్ మ్యూజియం" గా మార్చింది. ఆ సమయంలోనే ఖజానా బిల్డింగ్‌ను వారసత్వ కట్టడంగా గుర్తించారు. హైదరాబాద్ ను సందర్శించే వారు ఈ బిల్డింగ్‌ను తప్పని సరిగా చూడాలి.

- స్వేచ్ఛ







గతం కంటే గొప్ప!

విరాట్‌సేనపై శాస్త్రి వ్యాఖ్య
విమర్శలకు తావిస్తోన్న కోచ్ మాటలు



కొలంబో : టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి సహజశైలిలో కోహ్లిసేనను పొగిడే ప్రయత్నంలో సరికొత్త వివాదానికి తెరతీశాడు!. శ్రీలంకపై గాలె టెస్టును 309 పరుగుల తేడాతో నెగ్గి రికార్డు విజయం సాధించిన భారత్ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం నుంచి రెండో టెస్టు ఆరంభం కానున్నది. ఈ నేపథ్యంలో ప్రెస్ మీట్‌లో శాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుత జట్టు రెండేండ్లుగా కలిసి ఆడుతోంది. ఎంతో అనుభవం గడించింది. గతంలో పెద్ద పెద్ద ఆటగాళ్లు కెరీర్‌లో సాధించలేనిది కోహ్లిసేన అప్పుడే సొంతం చేసుకున్నది. 2015లో శ్రీలంకలో టెస్టు సిరీస్ విజయం అందులో ఒకటి' అని శాస్త్రి పేర్కొన్నాడు. 'ఎంతో మంది పెద్ద పెద్ద ఆటగాళ్లు గత 20 ఏండ్లలో ఇక్కడి వచ్చారు, కానీ సిరీస్ సాధించలేదు. ఈ జట్టు సాధించింది. గత జట్లు సాధించలేనివి విదేశాల్లో కోహ్లిసేన సాధించగలదు' అని కోచ్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఎదుగుదలపైనా పనిలో పనిగా ప్రశంసలు గుప్పించాడు. ఇంకా తొలినాళ్లలోనే ఉన్నా.. భారత్‌కు తిరుగులేని కెప్టెన్‌గా, అద్భుత విజయాలు తీసుకురాగలడని అన్నాడు.

ఇక శాస్త్రి వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరతీయటంతో పాటు వివాదాన్ని రాజేసే అవకాశం లేకపోలేదు. విదేశాల్లో గత జట్లు సైతం చెప్పుకోదగిన విజయాలు అందుకున్నాయి. 2007లో ఇంగ్లాండ్‌లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో 1-0తో టెస్టు సిరీస్ సాధించగా, 2004లో సౌరవ్ గంగూలీ ఆస్ట్రేలియాలో 1-1తో సిరీస్‌ను డ్రా చేసుకోగలిగింది. ఇక 2002లో నాసిర్ హుస్సేన్ కెప్టెన్సీలోని ఇంగ్లాండ్‌పైనా 1-1 టెస్టు సిరీస్‌ను డ్రా చేసుకున్నది. 2009లో న్యూజిలాండ్‌లో ధోని 1-0తో టెస్టు సిరీస్ సాధించగా, 2011లో దక్షిణాఫ్రికాలో 1-1తో డ్రా చేసుకున్నాడు. గత 20 ఏండ్లలో భారత్ శ్రీలంకలో సిరీస్ నెగ్గకపోయినంత మాత్రాన.. దిగ్గజ ఆటగాళ్లను అగౌరవపరిచే వ్యాఖ్యలు చేయటం ఎంతవరకు సబబని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. వచ్చే ఏడాదిలో కోహ్లిసేన దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలలో పర్యటించాల్సి ఉన్నది. ప్రస్తుతం దిగ్గజ ఆటగాళ్ల వీడ్కోలుతో శ్రీలంక సాధారణ జట్టుగా మారింది. సఫారీ, ఇంగ్లాండ్, ఆసీస్‌లను ఓడిస్తే అప్పుడు కోహ్లిసేనను కీర్తిస్తే అర్థం ఉంటుందని అంటున్నారు. అయినా ఒక్క టెస్టు విజయానికే శాస్త్రి ఏకంగా గత జట్లను మొత్తంగా తక్కువ చేయటం ఏ మాత్రం తగదని చెబుతున్నారు.

మిథాలీకి బీఎండబ్ల్యూ కారు అందజేత



భారత మహిళల జట్టు సారథి మిథాలీరాజ్‌కు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చాముండేశ్వరినాథ్ బీఎండబ్ల్యూ కారును కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గోపీచంద్ అకాడమీలో ఏర్పాటు చేశారు.

హాట్రిక్ ఓటమి

సొంతగడ్డపై కోలుకోని తెలుగు టైటాన్స్



31-18తో యూపీ యోధా మెరుపులు
దబంగ్ ఢిల్లీని ఓడించిన గుజరాత్

ప్రొ కబడ్డీ లీగ్ -5

నవతెలంగాణ క్రీడా ప్రతినిధి-హైదరాబాద్ :
సొంతగడ్డపై తెలుగు టైటాన్స్‌కు ముచ్చటగా మూడో ఓటమి ఎదురైంది. లీగ్ ఆరంభ మ్యాచ్‌లో తమిళ తలైవాస్‌పై విజయంతో సీజన్‌ను ఘనంగా మొదలెట్టినా.. తర్వాత వరుసగా మూడు మ్యాచుల్లోనూ పరాజయం పాలైంది. కొత్త జట్టు యూపీ యోధా చేతిలోనూ తెలుగు టైటాన్స్ 13 పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది. యూపీ జట్టులో నితిన్ తోమర్, రిషాంక్ దేవాడిగ, మహేష్ గౌడ్ సహా నితీష్ కుమార్‌లు మెరవటంతో యూపీ యోధా ఏకపక్ష విజయంతో సీజన్‌లో శుభారంభం చేసింది. తెలుగు టైటాన్స్ స్టార్ రైడర్, కెప్టెన్ రాహుల్ చౌదరి ఏడు పాయింట్లతో మెరిసినా.. జట్టులోని మిగతా ఆటగాళ్లు విఫలమయ్యారు. ప్రథమార్థంలో 13-14తో కేవలం ఒక్క పాయింట్ వెనుకంజలోనే నిలిచినా.. ద్వితియార్థంలో దారుణ వైఫల్యం టైటాన్స్‌ను దెబ్బకొట్టింది. 31-18తో యూపీ యోధా మెరుపు విజయం సాధించింది. అంతకముందు జరిగిన మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీపై 26-20తో కొత్త జట్టు గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ గెలుపొంది సీజన్‌ను విజయంతో ఆరంభించింది.

ప్రథమార్థం.. నువ్వా నేనా! : ప్రొ కబడ్డీ సీజన్-5లో అడుగుపెట్టిన మరో కొత్త జట్టు యూ.పి యోధ. జట్టు కొత్తదే, ఆటలోనూ కొత్తదనం ఉండటంతో తెలుగు టైటాన్స్‌కు గట్టిపోటీ ఇచ్చింది. ప్రథమార్థం 20 నిమిషాలు నువ్వా నేనా అన్నట్టు సాగింది. యూపీకి నితిన్ తోమర్ రైడ్ పాయింట్‌తో పాయింట్ల ఖాతా తెరువగా, రాహుల్ చౌదరి మెరుపు రైడ్‌తో టైటాన్స్ కూత మొదలెట్టాడు. యూపీ నుంచి నితిన్ తోమర్, రిషాంక్ దేవాడిగ, నితీష్ కుమార్‌లు రాణించగా.. తెలుగు టైటాన్స్ నుంచి రాహుల్ చౌదరి, వికాశ్, రాకేశ్ కుమార్‌లు పాయింట్లు తీసుకొచ్చారు. ఇరు వైపులా రైడర్లు పోటీపడి పాయింట్లు సాధించటంతో 4-4, 6-6, 8-8తో స్కోరు సమంగా సాగింది. ప్రథమార్థంలో రైడింగ్‌లో ఇరు జట్లు చెరో 8 పాయింట్లు సాధించగా.. యూపీ డిఫెన్స్‌లో పైచేయి సాధించింది. దీంతో 20 నిమిషాల ఆట ముగిసే సరికి 12-11తో తెలుగు టైటాన్స్‌పై ఓ పాయింట్ ముందంజలో కొనసాగింది. ప్రథమార్థంలో రాహుల్ చౌదరి నాల్గు పాయింట్లు, వికాశ్ 3, రాకేశ్ 2 పాయింట్లు తీసుకొచ్చారు. యూపీలో రిషాంక్ కూతకెళ్లి 4 పాయింట్లు తేగా, నితీష్ సైతం నాల్గు పాయింట్లు సాధించాడు. నితిన్ తోమర్ మూడు పాయింట్లతో మెరిశాడు.

సూపర్ యోధా : ప్రథమార్థంలో ఒక పాయింట్ ఆధిక్యం సాధించిన యూపీ యోధా.. సెకండ్ హాఫ్‌లో రెచ్చిపోయింది. సురేందర్ సింగ్ సూపర్ రైడ్‌తో టైటాన్స్‌ను ఆలౌట్ చేయటంతో యూపీ 17-13తో ముందంజ వేసింది. ఈ సమయంలో రాహుల్ చౌదరి సహా డిఫెండర్లు మెరవటంతో టైటాన్స్ వరుస పాయింట్లు సాధించింది. కానీ యోధాను అందుకోలేకపోయింది. నిలేశ్ సాలంకేను సూపర్ ట్యాకిల్ చేయడానికి తోడు నితీశ్ సూపర్‌రైడ్ మెరవటంతో యూపీ యోధా 28-18తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 31-18తో టైటాన్స్‌ను చిత్తుచేసిన యూపీ యోధా 13 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రాహుల్ చౌదరి ఏడు పాయింట్లు సాధించినా ప్రయోజనం లేకపోయింది. యూపీలో నితిన్ తోమర్ (6), మహేష్ గౌడ్ (4), నితీష్ కుమార్ (5)లు ఆకట్టుకున్నారు.

గుజరాత్ శుభారంభం : ప్రొ కబడ్డీ లీగ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ శుభారంభం చేసింది. ఈ సీజన్‌తోనే ప్రొ కబడ్డీ లీగ్‌లో అడుగుపెట్టిన గుజరాత్ తొలి పోరులోనే అదరగొట్టింది. దబంగ్ ఢిల్లీపై 6 పాయింట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ జట్టులో స్టార్ రైడర్ సుఖేష్ హెగ్డెకు తోడు రాకేశ్ నర్వాల్, సచిన్‌లు రాణించటంతో తొలి అర్ధభాగం ఆట ముగిసే సరికి 16-5తో ఆధిక్యంలో నిలిచింది. ఫస్ట్ హాఫ్‌లో నిరాశపరిచిన ఢిల్లీ.. ఆఖర్లో పుంజుకున్నది. సబ్‌స్టిట్యూట్ రైడర్ శ్రీరామ్ ఐదు పాయింట్లతో మెరవటంతో ఢిల్లీ కోలుకున్నది. డిఫెండర్ నీలేశ్ షిండే, సునీల్‌లు చెరో రెండు పాయింట్లు సాధించారు. గుజరాత్ విదేశీ డిఫెండర్ ఫజల్ ఏకంగా నాల్గు ట్యాకిల్స్‌తో ఆకట్టుకున్నాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌పై తిరుగులేని పట్టు సాధించిన గుజరాత్ 26-20తో ఆరు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లోనే విజయంతో పాయింట్ల పట్టికలో బోణీ కొట్టేసింది.

ప్రొ కబడ్డీలో నేడు
గుజరాత్ X హర్యానా
రాత్రి 8 గంటలకు
హైదరాబాద్ X బెంగాల్
రాత్రి 9 గంటలకు
వేదిక : గచ్చిబౌలి స్టేడియం
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం...

అగ్రస్థానం జడేజాదే..

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్

దుబాయ్ : టీమ్ ఇండియా స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో జోరు కొనసాగిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన జాబితాలో జడేజా వరల్డ్ నెం.1 బౌలర్‌గా నిలిచాడు. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఓ స్థానం మెరుగై.. మళ్లీ రెండోస్థానానికి చేరుకున్నాడు. బ్యాటింగ్ విభాగంలో చటేశ్వర్ పుజారా నాల్గో స్థానంలో నిలువగా, విరాట్ కోహ్లి ఐదో స్థానంలో ఉన్నాడు. గాలెలో విలయతాండవం చేసిన శిఖర్ ధావన్ ఏకంగా 21 స్థానాలు మెరుగై 39వ స్థానానికి చేరుకున్నాడు. ఆసీస్, ఇంగ్లాండ్, కివీస్ సారథులు స్టీవ్ స్మిత్, జోయ్ రూట్, కానె విలియమ్సన్‌లు తొలి మూడు స్థానాలు నిలుపుకున్నారు. ఆల్‌రౌండర్ జాబితాలోనూ జడేజా, అశ్విన్‌లు వరుసగా రెండు, మూడో ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.



డెఫ్ అథ్లెట్లకు అవమానం

మెడల్స్ నెగ్గిన వారికి దక్కని గౌరవం
ఎయిర్‌పోర్ట్‌లోనే అథ్లెట్ల నిరసన



న్యూఢిల్లీ : ఓ అంతర్జాతీయ వేదికపై మెడల్ నెగ్గితే చాలు.. విమానాశ్రయం నుంచి స్వాగతం, సన్మాన సత్కారాలు. ఇవీ ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ట్రెండ్!. కానీ కేంద్ర క్రీడా శాఖ వినికిడి లోపమున్న అథ్లెట్ల విజయాలు గుర్తించలేని అంధత్వంలో పడిపోయినన వేళ.. డెఫ్ అథ్లెట్లకు దారుణ అవమానం ఎదురైంది. 2107 డెఫ్‌లింపిక్స్‌లో ఎనిమిది విభాగాల్లో ప్రాతినిథ్యం వహించిన భారత్ మూడు విభాగాల్లో కలిపి ఐదు పతకాలు సాధించింది. రెజ్లర్ వీరేందర్ సింగ్ 74 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగంలో స్వర్ణం సాధించగా, సుమిత్ దహియ (97 కేజీలు), అజయ్ కుమార్ (65 కేజీలు)లు కాంస్య పతకాలతో మెరిశారు. గోల్ఫర్ దిక్షా దాగర్ సిల్వర్ పతకం సాధించగా, పృథ్వీ శేఖర్, జాఫ్రీన్ షేక్‌లు మెన్స్ డబుల్స్ టెన్నిస్‌లో కాంస్యం సాధించారు. ఐదు పతకాలతో స్వదేశానికి తిరిగొచ్చిన అథ్లెట్ల బృందానికి విమానాశ్రయంలో స్వాగతం పలికే నాథుడే కరువయ్యాడు. ఉదయం 5 గంటలకు న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న అథ్లెట్ల బృందం.. ఒక్క అధికారి కూడా రాకపోవటంతో విమానాశ్రయంలోనే నిరసన వ్యక్తం చేశారు. 'మేము పతకాలు సాధించిన రోజే ప్రభుత్వానికి సమాచారం ఇచ్చాం. దేశం గర్వపడే ప్రదర్శన చేశాం. కానీ ఒక్క అధికారి కానీ కనీసం క్రీడా మంత్రి కూడా స్వాగతం పలకటానికి రాలేదు. సాయ్ అధికారులు లేదా క్రీడా మంత్రి ఇక్కడికి రావాలి. అథ్లెట్ల విజయాన్ని గుర్తించాలి. ఆగస్టు 1న వస్తున్నామని ముందే చెప్పాం. కానీ ఎటువంటి సమాధానం రాలేదు. అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించాం కానీ ప్రయోజనం లేదు. అందుబాటులో లేరని అంటున్నారు' అని అథ్లెట్ల బృందం మేనేజర్ కేతన్ షా అన్నారు.

పొలాల్లో హైటెన్షన్





అభివృద్ధి పేరుతో సర్కార్ ఏ పని చేపట్టినా నష్టపోతున్నది సాధారణ ప్రజలే. మొన్న నిమ్జ్ పేరుతో భూములు లాక్కున్నారు. నిన్న మల్లన్నసాగర్ పేరుతో ఊర్లను ముంచేందుకు సిద్ధమయ్యారు. నేడు హైటెన్షన్ విద్యుత్ టవర్ల పేరుతో పొలాల్లో మంటలు లేపారు. తమకు న్యాయం చేయాలని రైతులు చేపట్టిన ఆందోళనలు ఎవరికీ పట్టడం లేదు. పైగా కాంట్రాక్టర్ల బెదిరింపులు, కేసులు. పరిహారంలో అవకతవకలు జరిగాయని చెప్పినా పట్టించుకునే నాథుడు లేడు. గ్రామసభలు లేకుండా పనులు ఎలా చేపడుతున్నారని ప్రశ్నిస్తే ఎవరి దగ్గరా సమాధానం లేదు...

అడ్డుకుంటే ఆర్మీ వస్తదని కాంట్రాక్టర్ బెదిరింపులు
- పరిహారం చెల్లింపులో అవకతవకలు
- కలెక్టర్ ఆదేశాలూ బేఖాతర్

నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి
రాష్ట్రంలో 24 గంటలు కరెంట్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం శంకర్‌పల్లి నుంచి నిజామాబాద్ వరకు 400 కేవీ, 765కేవీ హైటెన్షన్ వైర్‌లైన్లను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొల్చారం, పాపన్నపేట, కౌడిపల్లి, హత్నూర, పుల్కల్, సంగారెడ్డి, కంది మండలాల మీదగా ఈ లైన్లు వెళ్తున్నాయి. ట్రాన్స్‌కో పరిధిలో మహేశ్వరం, ఎల్‌అండ్‌టీ వంటి ప్రయివేటు కంపెనీలకు పనులు అప్పజెప్పారు. సదరు కంపెనీ కాంట్రాక్టర్లు మాత్రం తమ ఇష్టానుసారంగా పని చేసుకుంటూ వెళ్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే 'ఇవి కేంద్రప్రభుత్వ పనులు, అడ్డుకుంటే ఆర్మీ వస్తది. కేసులు నమోదు చేసి ఎందుకూ పనికిరాకుండా చేస్తారు' అని బెదిరింపులకు దిగుతున్నారు. సదరు కంపెనీ ప్రతినిధులు ఒక్కో టవర్‌కు రూ.50వేలు చెల్లిస్తూ వస్తున్నారు. పంట, సారవంతమైన భూమి నష్టపోతున్నామని, ఈ పరిహారం సరిపోదని ఎదురు ప్రశ్నిస్తే గరిష్టంగా రూ.లక్ష వరకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నిబంధనల ప్రకారం చెల్లింపులు లేకపోగా, కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు కంపెనీ చేతిలోనే తప్ప రైతులకు చేరకపోవడం గమనార్హం.

కలెక్టర్ ఉత్తర్వుల్లో ఏముంది..?

400కేవీ, 765 కేవీ లైన్లకు సంబంధించి పరిహారం చెల్లింపులపై 2017 ఏప్రిల్ 20న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ మాణిక్యరాజ్ కణ్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మహేశ్వరం ట్రాన్స్ మిషన్ లిమిటెడ్ ఏజీఎం, ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్లను రిఫరెన్స్‌గా పేర్కొన్నారు. వాటి ప్రకారం అంతగా ప్రాధాన్యం లేని భూముల్లో టవర్ ఏర్పాటు చేస్తే ఒక్కో టవర్‌కు రూ.2.45 లక్షలు, మధ్యస్తంగా ఉన్న భూములకు రూ.3.50లక్షలు, రోడ్డు పక్కన, వ్యాపారానికి అనువుగా ఉన్నా, సారవంతమైన నేలలు, ఇండ్ల లేఅవుట్లలో అయితే రూ.4.50లక్షలు చెల్లించాల్సి ఉంది. రెండు టవర్ల మధ్య వైర్లు వెళ్తున్నపుడు చదరపు మీటర్‌కు రూ.60 చొప్పున రైతులకు చెల్లించాలి. ఈ ఉత్తర్వులు జారీ చేసి మూడు నెలలు దాటినా ఆర్డీఓ, తహసీల్దార్లకు చేరలేదంటే ఆలోచించాల్సిందే. 400కేవీ లైన్లకు సంబంధించిన ఉత్తర్వులు మహేశ్వరం కంపెనీ ప్రతినిధుల వద్ద ఉన్నట్టు బాధిత రైతులు చెబుతున్నారు. కానీ 765కేవీ లైన్లు వెళ్తున్న భూముల కోసం ఇచ్చిన ఉత్తర్వులు ఇంతవరకూ బయటకు రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇందులో ప్రారంభ పరిహారమే రూ.6లక్షలకు పైగా ఉంటుందని రైతుల అంచనా. కంపెనీ ప్రయోజనాల కోసమే రెవెన్యూ, జిల్లా అధికారులు దాచిపెడు తున్నారని వారి ఆరోపణలున్నాయి. ఈఉత్తర్వుల విషయం బయటకు రాగానే రైతులు ఆందోళన బాట పట్టారు. కలెక్టరేట్ ఎదుట పురుగుల మందు, ఉరితాళ్లతో నిరసనలు తెలిపారు. ఇంతా జరిగినా కలెక్టర్ కలవకపోగా, డీఆర్‌ఓతో సర్దిచెప్పి పంపించేశారు.

రైతుల భూముల్లో విద్యుత్ స్తంభాలు
ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

పంట పొలాల్లో విద్యుత్‌లైన్లు వేసినందుకు రైతులకు పరిహారం ఇవ్వడం లేదన్న కేసులో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యుత్ నియంత్రణ మండళ్లు, విద్యుత్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రైతుల పంట భూముల్లో వేసిన విద్యుత్ లైన్లకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్స్ (సీఐఎఫ్ఎ) ప్రధాన సలహాదారు పి.చంగల్‌రెడ్డి వేసిన రిట్ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. ఇదే అంశంపై గతంలో ఉన్న పిల్‌తో కలిపి ఈకేసు కూడా బెంచ్ జరిపిన విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేసే వరకూ ఉద్యమం



కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పరిహారం చెల్లించేవరకూ ఉద్యమం చేస్తాం. రైతులు చనిపోతున్నా కలెక్టర్ స్పందించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. అవసరమైతే హైటెన్షన్ వైర్లు వెళ్తున్న అన్ని జిల్లాల్లో ఉద్యమం చేయాలని ఆలోచిస్తున్నాం. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం.

- అందోల్ కృష్ణ, సర్పంచుల సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు

పత్తి పంటను తీసేసి పనులు చేస్తున్నారు

టవర్ పనుల కోసం ఎకరన్నర పత్తిపంటను ట్రాక్టర్లతో తొక్కించారు. కౌలుకు తీసుకుని ఐదెకరాలు సాగు చేస్తున్నాం. కొట్లాడితే ఇప్పటికి రూ.లక్ష ఇచ్చారు. ఈపంటపై రూ.6లక్షల వరకు వస్తాయి. అవి మొత్తం ఇవ్వాలి. టవర్లతో భూమి ధర కూడా పడిపోతుంది.

- రమేష్, వెండికోల్, పుల్కల్

రూ.4లక్షలకు కొంటే రూ.50వేలు ఇచ్చారు



ఇద్దరం అన్మదమ్ములం కలిసి ఎనిమిది గుంటల భూమి రోడ్డు పక్కన కొనుక్కున్నాం. టవర్ కోసం మొత్తం భూమి పోతోంది. రూ.50 వేలు ఇచ్చారు. రోడ్డు పక్కన ప్లాట్ కోసం అప్పట్లో రూ. 4 లక్షలు పెట్టి కొన్నాం. ఇప్పుడు అక్కడ రూ.15 లక్షలకు పైగానే వస్తాయి. భూమి పోయి, డబ్బులు రాక పోతే ఎలా?. టవర్‌ను వేరే చోట వేసి మా భూమి మాకు ఇప్పించండి.

- ఆంజనేయులు, ఫసల్‌వాది, సంగారెడ్డి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.